కిషన్‌చందర్ రచనలు-1
రూ॥ 200/-
పేజీలు: 220



ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


సెప్టెంబర్ 3న చైనా పీపుల్స్ వార్
80వ వార్షికోత్సవ వేడుకలు

సహాయం కోసం ఎదురుచూస్తున్న 25 మంది పాలస్తీనియన్లను చంపిన ఐడిఎఫ్

లోపలి పేజీల్లో


సంపుటి 08, సంచిక: 205 | బుధవారం | 25 -06-2025 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


## గోదావరి జలాలపై చర్చకు
# కెసిఆర్ సిద్ధమా?



- అసెంబ్లీలో చర్చించేందుకు స్పీకర్‌కు లేఖ రాయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సవాల్
- అక్కడే రాష్ట్రానికి అన్యాయం చేసిందెవరో, దోచుకుందెవరో తేల్చుకుందామని ఉద్ఘాటన
- 70లక్షల రైతు కుటుంబాల 1.49 కోట్ల ఎకరాలకు 9 రోజుల్లో రూ.9వేల కోట్లు రైతు భరోసా
- రాజీవ్ ప్రాంగణంలో రైతు భరోసా విజయోత్సవ సభ

> నాడు ధనిక రాష్ట్రంగా రూ.16వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల కుప్పగా మార్చిన మామ (కెసిఆర్) శకుని, అల్లుడు (హరీశ్‌రావు) శనీశ్వరుడు ఇప్పుడు గొప్పలు చెబుతున్నారు. మొయినాబాద్‌లో హరీశ్ రావుకు, జన్వాడలో కెటిఆర్‌కు, ఎర్రవల్లిలో కెసిఆర్‌కు 100 ఎకరాల ఫామ్‌హౌస్‌లు, టివిలు, పేపర్లు పెట్టడానికి వేల కోట్లు పెట్టుబడి ఎలా వచ్చాయి? నాడు ఏమీ లేనివారు, నేడు కోట్లకు అధిపతులు కాగా, ధనిక రాష్ట్రం దివాళా తీసింది. -సిఎం

ప్రజాపక్షం/హైదరాబాద్

రైతుల సంక్షేమమే లక్ష్యంగా 18 నెలల కాలంలో రూ.1.04లక్షల కోట్లను రైతుల కోసం ఖర్చుచేసి, రైతును రాజును చేసిన ప్రజా ప్రభుత్వం తమదని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి అన్నారు. వ్యవసాయాన్ని పండుగ చేసిన ప్రజా పాలన తమదని స్పష్టం చేశారు. కెసిఆర్‌కు నీతి నిజాయితీ, చిత్త శుద్ధి ఉంటే గోదావరి నదీ జలాలు బనకచర్ల ప్రాజెక్టుపై శాసనసభలో చర్చిద్దామని శాసనసభ స్పీకర్‌కు లేఖ రాయాలని రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. అసెంబీ వేదికపై చర్చించి, తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసింది ఎవరూ?, రూ.లక్ష కోట్లు దోచుకుంది ఎవరో తేల్చుదామన్నారు. హైదరాబాద్‌లోని సచివాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ విగ్రహం ప్రాంగణంలో వ్యవసాయ శాఖ అధ్వర్యంలో 'రైతు భరోసా విజయోత్సవ సభ' మంగళవారం జరిగింది. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సభకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ముఖ్యఅధిగా హాజరయ్యారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి,కోమట్టి రెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు,ధనసరి అనసూయ సీతక్క, జూపల్లికృష్ణారావు,వాకిటిశ్రీహరి, టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి. మహేష్ కుమార్ గౌడ్, తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ ఎం. కోదండరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 70లక్షల రైతు కుటుంబాలకు సంబంధించి 1.49 కోట్ల ఎకరాలకు గాను 9రోజుల్లో రూ. 9 వేల కో ట్లు అన్నదాతల ఖాతాలో జమ చేసిన రైతు ప్రభుత్వమన్నారు. తెలంగాణ గడ్డ మీద జరిగిన భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం జరిపిన తెలంగాణ రైతాంగం సాయుధ పోరాటమైన ఆదిలాబాద్‌లో జరిగిన జల్ జంగల్ జమీన్ ఉద్యమమైనా భూమిచుట్టూ, త్యాగాలను చుట్టూనే తిరుగుతుంటాయన్నారు. ఉమ్మడి తరువాయి 2లో

## ట్రంప్ ఆదేశంపై
# 'కాల్పుల విరమణ'

- తొలుత ఉల్లంఘించిన ఇజ్రాయెల్ : టెహ్రాన్‌పై బాంబుల వర్షం
- అమెరికా అధ్యక్షుడు అసంతృప్తి
- ఒప్పందం పాటించాలని నెతన్యాహూకు హితవు
- ఇజ్రాయెల్ ఆరోపణలు తిరస్కరించిన ఇరాన్
- వాళ్ళు ఆపేస్తే మేమూ ఆపేస్తాం : ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్



> ''ఇజ్రాయెల్...ఆ బాంబులను ఇరాన్‌పై ప్రయోగించవద్దు, ఒకవేళ అదే జరిగితే అది అతిపెద్ద ఉల్లంఘన అవుతుంది, మీ పైలట్లను వెనక్కు తీసుకురండి'' అని ట్రంప్ సోషల్ మీడియాలో ఇజ్రాయెల్‌ను ఉద్దేశించి పోస్టింగ్ పెట్టారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది అని మొదట ఆయనే ప్రకటించారు. ''కాల్పుల విరమణ ఇప్పుడే అమలులోకి వచ్చింది, దయచేసి దానిని ఉల్లంఘించకండి'' అని ఆయన పోస్టింగ్‌లో రాశారు.

**వాషింగ్టన్ :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆదేశాలతో ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ జరిగింది. దీంతో 12 రోజులుగా జరిగిన ఇరుదేశాల మధ్య పరస్పర దాడులు ఆగాయి. మధ్యప్రాచ్యంలో అమెరికా సైనికస్థావరాలపై ఇరాన్ భీకరస్థాయిలో ప్రతీకార దాడులు ప్రారంభించగానే ట్రంప్ మంగళవారం తెల్లవారకముందే దౌత్య మార్గం పట్టారు. తానే యుద్ధానికి ఆజ్యంపోసి, ఆ జ్వాల చల్లారిందని తిరిగి తానే ప్రకటించారు. ''ఇజ్రాయెల్...ఆ బాంబులను ఇరాన్‌పై ప్రయోగించవద్దు, ఒకవేళ అదే జరిగితే అది అతిపెద్ద ఉల్లంఘన అవుతుంది, మీ పైలట్లను వెనక్కు తీసుకురండి'' అని ట్రంప్ సోషల్ మీడియాలో ఇజ్రాయెల్‌ను ఉద్దేశించి పోస్టింగ్ పెట్టారు. కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది అని మొదట ఆయనే ప్రకటించారు. ''కాల్పుల విరమణ ఇప్పుడే అమలులోకి వచ్చింది, దయచేసి దానిని ఉల్లంఘించకండి'' అని ఆయన పోస్టింగ్‌లో రాశారు. కాల్పుల విరమణను సంరక్షించాలని ఆ తర్వాత నేతన్యాహూకు ట్రంప్ నేరుగా ఫోన్ సంభాషణలో తెలియజేశారని వైట్‌హౌస్ సీనియర్ అధికారి చెప్పారు. అదేవిధంగా అమెరికా విదేశాంగమంత్రి మార్కో రుబియో, మధ్యప్రాచ్యంలో అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్‌కాఫ్ ఇద్దరూ ప్రత్యక్ష, పరోక్ష మార్గాలలో కాల్పుల విరమణ ఒప్పందం అమలు గురించి ఇరాన్‌కు తెలియజేశారు. ఐతే ఈ చర్చల్లో ఇరాన్ సర్వాధినేత అయొతుల్లా అలీ ఖమేనీ పాత్ర వహించారా? లేదా? అనే విషయం స్పష్టం కాలేదు. గడచిన శనివారంనాడు అమెరికా చేసిన బాంబు దాడులే ఇజ్రాయెలీని కాల్పుల విరమణ ఒప్పందానికి ఒప్పించేందుకు దోహదపడ్డాయని, ఈ విషయంలో ఖతార్ ప్రభుత్వం మధ్యవర్తిగా వ్యవహరించిందని వైట్‌హౌస్ వర్గాలు చెప్పాయి. ఐతే కాల్పుల విరమణపై మొదట కొంత గందరగోళం నెలకున్నది. కాల్పుల విరమణ జరిగిందని ట్రంప్ ప్రకటించిన తర్వాత కూడా టెహ్రాన్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం కురిపించింది. దీంతో ట్రంప్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఒప్పందం పాటించాలని నేతన్యాహూకు హితవు చెప్పారు. హేగ్‌లో రెండు రోజులు జరిగే నాటో సదస్సుకు బయలుదేరేముందుగా ట్రంప్ పాత్రికేయులతో తొలుత మాట్లాడుతూ, ఇరాన్‌పై దాడులపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్ వైఖరిపట్ల తాను సంతోషంగా లేనన్నారు. ''ఒప్పందం కుదుర్చుకున్న వెంటనే ఇజ్రాయెల్ దానిని ఉల్లంఘించిందన్న వాస్తవం నాకు నచ్చలేదు, నిర్దేశించిన గడువు ప్రకారం తెల్లవారుజామునాటికి శత్రుత్వాన్ని ఆపేయాలి, కానీ నాకు ఇప్పుడే తెలిసింది, ఒక రాకెట్ ఎక్కడా దాడి చేయకపోయినాగానీ తరువాయి 2లో



## మన 18 నెలల పాలన
# 'గోల్డెన్ పీరియడ్'

**స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవాలి**

- బిఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలపై గ్రామాల్లో చర్చపెట్టాలి
- పార్టీ పదవులను చిన్న చూపు చూడొద్దు
- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు, జమిలి ఎన్నికలు లాంటి అంశాలు మన ముందుకు రానున్నాయి
- పిఎసి, టిపిసిసి నూతన కార్యవర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాపక్షం / హైదరాబాద్

రాష్ట్రంలో పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనకు, 18 నెలల కాంగ్రెస్ పాలనపై బహిరంగ చర్చకు కాంగ్రెస్ నాయకులు సవాల్ చే యాలని, 18 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏం చేసిందో ప్రజలకు చెప్పాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి అన్నా రు. కాంగ్రెస్ ప్రభుత్వ 18 నెలల మన పాలన 'గోల్డెన్ పీరియడ్' అని దానిని ప్రజలలోకి తీసుకుపోవాలన్నారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్ని క కోసం కాంగ్రెస్ పార్టీని సిద్ధం చేయాలన్నారు. రానున్న రోజుల్లో అనేక సవాళ్లు ఎదుర్కోబోతున్నామని, డీలిమిటేష న్, మహిళా రిజర్వేషన్ బిల్లు, జమిలి ఎన్నికలు లాంటి అం శాలు మన ముందుకు రానున్నాయని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అనుసంధానంగా కాంగ్రెస్ నాయకులు ఉండాలన్నారు. టిపిసిసి రాజకీయ వ్యవహారాల కమిటీ (పిఎసి) సమావేశం, టిపిసిసి నూతన కార్యవర్గ సమావేశం గాంధీభవన్‌లో మంగళవారం జరిగాయి. టిపిసిసి అధ్యక్షులు బి. మహేష్‌కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశాలలో ఎఐసిసి తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, సిఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఎఐసిసి తరువాయి 2లో

## ఫోన్ ట్యాపింగ్ సూత్రధారి కెసిఆరే

- ఎస్ఐబి చీఫ్‌గా ప్రభాకర్ రావు నియామకం అక్రమం
- సిట్ విచారణలో బిజెపి ఎంపి ఈటల రాజేందర్
- ఇప్పటి వరకూ 278మంది సాక్షుల వాంగ్మూలం నమోదు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఫోన్ ట్యాపింగ్‌కు మూల సూత్రధారి మాజీ సిఎం కెసిఆర్ అని, ఎస్ఐబి చీఫ్‌గా టి.ప్రభాకర్ రావు నియామకం అక్రమం అని బిజె పి ఎంపి రాజేందర్ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ అధికారులు మంగళవారం సాక్షులుగా ఎంపి ఈటల రాజేందర్‌తో పాటు బిజెపి అధికార ప్రతినిధి ప్రేమేందర్‌రెడ్డిల వివరణ తీసుకున్నారు. అనంతరం ఈటల రాజేందర్ మీడియాతో మాట్లాడు తూ.. తనకు అనుకూలంగా ఉన్నవాళ్లను కెసిఆర్ అప్పట్లో నియమించుకున్నారని ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ ఇంకా ఎంతకాలం తరువాయి 2లో






## సామ్రాజ్యవాద కాంక్షతో
# మూడో ప్రపంచ యుద్ధం వైపు

- ఆ దిశగా ప్రపంచ దేశాలను నెట్టేస్తున్న అమెరికా
- వామపక్ష పార్టీల నేతల ఆగ్రహం
- ఇరాన్‌పై అమెరికా బాంబుదాడులను ఖండిస్తూ రాష్ట్రవ్యాప్త నిరసనలు

ప్రజాపక్షం/హైదరాబాద్

ఇరాన్‌పై అమెరికా బాంబుదాడులకు పాల్పడడాన్ని ఖండిస్తూ మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో వామపక్షపార్టీలు నిరసన కార్యక్రమాలు నిర్వహించాయి. అమెరికా సామ్రాజ్యవాద కాంక్షతో తనకు ఉన్న ఆర్థిక బలాన్ని ఆసరా చేసుకుని ప్రపంచ దేశాలను మూడో ప్రపంచ యుద్ధం వైపు నెట్టివేస్తుందని వామపక్ష పార్టీల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంతకాలం పరోక్ష పాత్ర పోషిస్తు వివిధ దేశాల మధ్య యుద్ధాన్ని సృష్టించిన అమెరికా ఇప్పుడు ప్రత్యక్షంగా ఇరాన్‌పై దాడికి తెగబడడం గర్హనీయమని వారు పేర్కొన్నారు. హైదరాబాద్ నారాయణగూడ వైఎంసిఎ చౌరస్తా వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సాధినేని వెంకటేశ్వర రావు (సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ), హన్మేష్ (సిపిఐ ఎంఎల్ మాస్ లైన్,) గాదగోని రవి (సిపిఐయు), మామిండ్ల రమేష్ రాజా (సిపిఐ ఎంఎల్ లిబరేషన్), సిహెచ్ మురహరి (ఎస్‌యుసిఐ), జానకిరాములు తరువాయి 2లో



## పెరగనున్న రైలు చార్జీ

**నాన్‌ఎసిలో కిలో మీటరుకు పైసా పెంపు**

ప్రజాపక్షం/హైదరాబాద్

భారతీయ రైల్వే ప్రయాణికులపై చార్జీల భారం మోపడానికి సిద్ధమైంది. కొన్నేళ్లుగా స్థిరంగా ఉన్న ప్రయాణ చార్జీలను స్వల్పంగా పెంచుతున్నట్లు మంగళవారం ప్రకటించింది. పెరిగిన చార్జీలు జూలై 1 నుంచి అమల్లోకి రానున్నాయి. దీంతో పాటు, తత్కాల్ టికెట్ బుకింగ్ విధానంలో కూడా భారతీయ రైల్వే కీలక మార్పులు చేసింది. ఇకపై తత్కాల్ టికెట్ల బుకింగ్‌కు తరువాయి 12లో

## ఫ్రెంచ్ కంపెనీలు తెలంగాణకు వచ్చేలా
# చొరవ చూపండి

- 'ఇఫ్కీ' ప్రతినిధులకు మంత్రి శ్రీధర్‌బాబు విజ్ఞప్తి
- 'తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేయాలనే పిపిపి విధానంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి శ్రీకారమని వెల్లడి



ప్రజాపక్షం/హైదరాబాద్

భావితరాల అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మించబోతున్న ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు పెట్టేలా ఫ్రెంచ్ కంపెనీలను ప్రోత్సహించాలని 'ఇండో – ఫ్రెంచ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఇండస్ట్రీ(ఇఫ్కీ)' ప్రతినిధులను మంత్రి శ్రీధర్ బాబు కోరారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఇఫ్కీ ప్రతినిధులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. తెలంగాణలో పరిశ్రమల ఏర్పాటుకున్న అనుకూలతలు, ప్రభుత్వం తరపున అందిస్తున్న ప్రోత్సాహకాలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. 'తెలంగాణ బ్రాండ్‌ను విశ్వవ్యాప్తం చేయాలనే దూరదృష్టితోనే సిఎం రేవంత్ రెడ్డి 30వేల ఎకరాల్లో పిపిపి విధానంలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఇది ఒక నగరం కాదు. భవిష్యత్తు. అంతర్జాతీయ భాగస్వామ్యంతో ఈ నగరాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నదే మా సంకల్పం' అని వివరించారు. 'ఏడాదిన్నర వ్యవధిలోనే తెలంగాణకు రూ.3 లక్షల కోట్ల పెట్టుబడులొచ్చాయి. గతేడాది హైదరాబాద్‌లో 70 జిసిసిలు తరువాయి 12లో

## ఆపరేషన్ సిందూర్‌తో ప్రపంచానికి
# భారత్ వైఖరి చాటాం

- పాకిస్థాన్‌తో జరిగిన ఘటనలో భారత్ ఆయుధాల ప్రభావం ఏమిటో చూపించాం
- భారతదేశం రక్షణ అవసరాల కోసం విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం వల్ల 'ఆత్మనిర్భర్'గా మారింది
- ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటన



**న్యూఢిల్లీ :** ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ కఠినవైఖరిని స్పష్టం చేసిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నొక్కిచెప్పారు. మంగళవారం ప్రధానమంత్రి మోదీ ఆధ్యాత్మిక ప్రముఖుడు, సంఘ సంస్కర్త శ్రీ నారాయణగురు, మహాత్మాగాంధీ సంభాషణ శతాబ్ది ఉత్సవాల కార్యక్రమంలో ప్రసంగించారు. భారతదేశంలో తయారైన ఆయుధాలు పాకిస్థాన్‌తో జరిగిన సంఘర్షణ సమయంలో వాటి ప్రభావం ఏమిటో చూపించాయన్నారు. 'భారతీయుల రక్తాన్ని చిందింపజేసిన ఉగ్రవాదులు దాక్కున్న ఏ ప్రాంతమూ సురక్షితం కాదని మేం నిరూపించాం' అని ప్రధానమంత్రి చెప్పారు. ఎటువంటి వివక్షతలేని బలమైన భారతదేశాన్ని కోరుకునే ఆధ్యాత్మిక ప్రముఖుడు నారాయణగురు ఆదర్శాలను ముందుకు తీసుకెళ్లేందుకు తన ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. తన ప్రభుత్వం గత 11ఏళ్లుగా సామాజిక, ఆర్థిక, రక్షణ రంగాలలో మేక్ ఇన్ ఇండియాను బలోపేతం చేసేందుకు పనిచేస్తోందన్నారు. భారతదేశం రక్షణ అవసరాల కోసం విదేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడం వల్ల 'ఆత్మనిర్భర్'గా మారిందని ఆయన చెప్పారు. భారత సైన్యం భారతదేశం తయారు చేసిన ఆయుధాలను ఉపయోగించి 22ని మిషాల్లోనే శత్రువును తరువాయి 12లో


05


9న సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు

'మహా' అసెంబ్లీ ఎన్నికల్లో 'ఓట్ల దొంగతనం'

మహారాష్ట్ర ఎన్నికలపై కోర్టుకు వెళ్లొచ్చు
రాహుల్‌గాంధీకి ఎన్నికల సంఘం సూచన

'ఆపరేషన్ సింధు' మిషన్‌లో భాగంగా...
మరికొందరు భారతీయులు న్యూఢిల్లీకి చేరిక



# ప్రపంచం
WORLD NEWS

## ఎవరిజోలికీ వెళ్ళం... మాజోలికొస్తే ఊరుకోం : ఖమేనీ



**టెహ్రాన్:** ''మేం ఎవ్వరి జోలికీ వెళ్ళం – మా జోలికి వస్తే ఊరుకోం'' అని ఇరాన్ సర్వాధినేత ఆయెతుల్లా అలీ ఖమేనీ ఎక్స్ వేదికగా ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. ఖతార్, ఇరాక్ దేశాలలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపై సోమవారం రాత్రి ఇరాన్ దాడులు చేసింది. ఇరాన్–ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఈ తర్వాత మంగళవారం తెల్లవారకముందు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పూర్వరంగంలో గుర్తుతెలియని ప్రదేశం నుండి ఖమేనీ చేసిన ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది. ఇరాన్ జాతి ఎవ్వరిముందూ మోకరిల్లదని, లొంగిపోయే మనస్తత్వం కాదని పేర్కొన్నారు. ఎక్స్ వేదికగా ఆయన రెండు పోస్టింగులు పెట్టారు. ''మేం ఎవ్వరికీ హాని చెయ్యం, ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవ్వరినుండీ వేధింపులను సహించం, ఎంతగా వేధించినా గానీ మేం (ఇరాన్ ప్రజలు)ఎవ్వరికీ లొంగిపోయేదిలేదు'' అన్నారు.

### మధ్యవర్తిదేశానికి వలస ప్రజల తరలింపుపై
## ట్రంప్‌కు 'సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్'



**వాషింగ్టన్:** స్వదేశానికి కాకుండా మధ్యవర్తి దేశానికి అక్రమ వలస ప్రజలను తరలించే చర్యలు కొనసాగించేందుకు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు సుప్రీంకోర్టు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఎలాంటి హానీ లేకుండా వారికి రక్షణ ఉండాలని కూడా న్యాయస్థానం పేర్కొంది. అమెరికా ప్రజల భద్రతకు, సంక్షేమానికి ఈ తీర్పు ఒక గొప్ప విజయమని హోం ల్యాండ్ డిపార్ట్‌మెంట్ ఒక ప్రకటనలో హర్షం ప్రకటించింది. దక్షిణ అమెరికాలో ఉన్న చిన్న చిన్న దేశాలకు తాత్కాలిక ప్రాతిపదికపై అమెరికా సొంత ఖర్చులతో వలస ప్రజల తరలించడాన్ని వ్యతిరేకిస్తూ డెమొక్రటిక్ పార్టీలకు చెందిన ప్రభుత్వ పాలకులు సహా అనేక మంది వలస ప్రజలు న్యాయస్థానాలను ఆశ్రయించారు. దీంతోపాటు కోర్టులో అనేక పిటిషన్లు ట్రంప్‌కు వ్యతిరేకంగా దాఖలయ్యాయి. తెలియని దేశానికి తరలిస్తే ప్రాణహాని కలుగుతుందని, స్థానికుల చేతుల్లో హతులవుతామని బాధితులు వాదించారు. ఐతే వారి పోషణభారం ఖర్చులను సంబంధిత ప్రభుత్వాలకు ఇస్తామని ట్రంప్ యంత్రాంగం చెప్పింది.


ఎట్టకేలకు ఈ విషయంలో తీర్పు ట్రంప్‌కు అనుకూలంగా వచ్చింది. స్వదేశీయులను కాకుండా ఇతర దేశాల నుండి అమెరికాకు వచ్చిన వారిని నిబంధనల ప్రకారం బహిష్కరించడానికి కోర్టు ద్వారా ట్రంప్‌కు సానుకూల సంకేతాలు లభించాయి. దీంతో 'తాత్కాలిక ప్రాతిపదికపై' అనే పేరుతో అక్రమ వలస ప్రజలను మరో చోటకు తరలించే కార్యక్రమం మళ్ళీ ప్రారంభం అవుతుంది. ఈ విధంగా మూడో దేశానికి, పరిచయంలేని దేశానికి వలస ప్రజలను తరలించడంవల్ల వారికి ఎదురయ్యే ప్రమాదాలు, సమస్యలను ఉన్నతస్థాయి అధికారులకు వివరించేందుకు తగినంత గడువు ఇవ్వాలని కోరుతూ దిగువ కోర్టులు ఇచ్చిన విరామకాల గడువును సుప్రీంకోర్టు ధర్మాసనం 6–3 మెజారిటీ తీర్పుతో తిరస్కరించి ట్రంప్‌కు అనుకూల తీర్పు ఇచ్చింది. ఐతే మెజారిటీ తీర్పుతో విభేదించిన న్యాయమూర్తులు సోనియా సోటోమయోర్, ఎలినా కగన్, కెటంజీ బ్రౌన్ జాక్సన్‌లు తీవ్రంగా విమర్శించారు. సంతకంలేని మెజారిటీ తీర్పును దారుణమైన దుర్వినియోగ చర్యగా తప్పుపట్టారు. మయన్మార్, మెక్సికో, దక్షిణ సూడాన్, క్యూబా, లావోస్, వియత్నాంలకు చెందిన ఎనిమిదిమంది వలస ప్రజలు కోర్టులో పిటిషన్లు దాఖలు చేసినవారిలో ఉన్నారు.

ఈ వలస ప్రజలను ట్రంప్ యంత్రాంగం ''చెత్తలో చెత్త..'' అని కొట్టిపారేసింది. వీరిని బలవంతంగా దక్షిణ సూడాన్‌కు తరలించే ప్రయత్నం చేశారు. వలస ప్రజలు తమ వైఖరిని, తమ బాధలను చెప్పుకోవడానికి ఒక అవకాశం, కొంత గడువు ఇవ్వాలని ఏప్రిల్‌లో ఇచ్చిన ఉత్తర్వులను వారు ఉల్లంఘించారని బోస్టన్‌లోని జిల్లా కోర్టు న్యాయమూర్తి బ్రియాన్ మర్ఫీ అన్నారు.

### సెప్టెంబరు 3న చైనా పీపుల్స్ వార్
## 80వ వార్షికోత్సవ వేడుకలు








**బీజింగ్ :** చైనా పీపుల్స్ వార్ 80వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు చైనా ప్రభుత్వం అంగరంగవైభవంగా ఏర్పాట్లు చేస్తున్నది. ఈ సందర్భంగా చైనా తన సైనిక పాటవాన్ని ప్రదర్శిస్తుంది. అనేకమంది సెప్టెంబరు 3వ తేదీన తియాన్మెన్‌స్క్వేర్ వద్ద జరిగే వేడులకు హాజరయ్యేందుకు ప్రపంచ నాయకులను ఆహ్వానాలు అందించనున్నది. దీనికి సంబంధించిన ఒక ప్రణాళికను మంగళవారంనాడు చైనా ప్రభుత్వం ఆవిష్కరించింది. జపాన్ దురాక్రమణకు, ఫాసిస్టు చర్యలకు వ్యతిరేకంగా చైనా ప్రజల పోరాట విజయంతోపాటు ఫాసిజానికి వ్యతిరేకం గా ప్రపంచం చేసిన పోరాట విజయాలకు సంకేతంగా ఈ వార్షికోత్సవం చేయనున్నది. ఆ రోజున జరిగే పరేడ్‌లో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ పాల్గొన్ని సైనిక వందనం స్వీకరించి ప్రసంగిస్తారు.

14 సంవత్సరాలపాటు చైనా ప్రజల ఘనమైన పోరాటాల తర్వాత 80 సంవత్సరాలక్రితం జపాన్ దురాక్రమణపై విజయం లభించింది. ఈ ఘన విజయం కేవలం చైనా ప్రజలదే కాకుండా యావత్ ప్రపంచ ప్రజల విజయమని చైనా కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిటీ ప్రచార విభాగ కార్యనిర్వాహక ఉపమంత్రి హూ హెపింగ్ మంగళవారంనాడు బీజింగ్‌లో జరిగిన పత్రికా గోష్ఠిలో చెప్పారు. 1945 నుండి 2025 వరకూ చైనా ప్రస్థానానికి సంబంధించిన అద్వితీయ ఘట్టాలను, ప్రగతి ని, పురోగతిని ప్రతిబింబింపజేసే అనేక కార్యక్రమాలను ఈ సందర్భంగా చేపడుతున్నారు. అంతర్జాతీయ విద్యావేత్తలతో ఒక సింపోజియంను కూడా నిర్వహిస్తారు. ఈ వార్షికోత్సవానికి ఒక ప్రత్యేక లోగోను కూడా విడుదల చేశారు.1931 నుండి 1945 వరకూ చైనాలో పీపుల్స్ వార్ జరిగింది. పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభమై 88 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా చైనా కమ్యూనిస్టుపార్టీ సెంట్రల్ కమిటీ, చైనా మిలిటరీ కమిషన్, స్టేట్ కౌన్సిల్స్ పేరుతో జులై ఏడో తేదీన సంబంధిత మ్యూజియంలో ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సెప్టెంబరు 18, అక్టోబరు 25, డిసెంబరు 13వ తేదీలలో కూడా సిపిసి సెంట్రల్ కమిటీ వేరు వేరు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుంది.

**అత్యాధునిక సైనికపాటవ ప్రదర్శన**

సెప్టెంబరు మూడో తేదీన 80వ వార్షికోత్సవం సందర్భంగా చైనా తన అత్యాధునిక సైనిక పాటవాన్ని ప్రదర్శించనున్నది. ఈ కార్యక్రమాన్ని జిన్‌పింగ్ తిలకిస్తారు. సంప్రదాయ యుద్ధ ఆయుధాలతోపాటు, మానవ రహిత కృత్రిమ మేధతో పని చేసే ఆయుధా లు, నీటి అడుగున కార్యకలాపాల ఆయుధాలు, సైబర్ ఎలక్ట్రానిక్ ఆయుధాలు, హైపర్ సోనిక్ పరికరాలతో కూడిన కొత్త పరికరాలను చైనా సైన్యం ప్రదర్శించనున్నది. చైనాను రక్షించుకోవడంలో, ప్రపంచశాంతిని కాపాడటంలో సైన్యం, రక్షణ వ్యవస్థ శక్తిసామర్థ్యాలను చైనా ఆ రోజున ప్రదర్శిస్తుందని సైనిక నిపుణుడొకరు బీజింగ్‌లో చెప్పారు.

## సహాయంకోసం ఎదురుచూస్తున్న 25మంది పాలస్తీనియన్లను చంపిన ఐడిఎఫ్



**డైర్ అల్ బలాహ్ :** గాజాలో ఆహారంకోసం ఎదురుచూస్తూ సహాయ కేంద్రాలవద్ద ఎదురుచూసే 25 మంది అమాయక పాలస్తీనియన్ ప్రజలను ఇరాన్ రక్షళ దళం (ఐడిఎఫ్) మంగళవారంనాడు కాల్చి చంపింది. గడచిన కొద్దిరోజులుగా యధేచ్ఛగా గాజాలో కొనసాగుతున్న ఈ అమానవీయమైన చర్యలు విరామం లేకుండా ప్రతిరోజూ జరుగుతున్నాయి. ప్రపంచ దేశాలు, ఐక్యరాజ్యసమితి, మానవ హక్కుల సంఘాలు ఎంతగా ఆందోళన వ్యక్తం చేసినా, హెచ్చరికలు చేసినా ఐడిఎఫ్ పట్టించుకోకుండా పాలస్తీనియన్లను హతమారుస్తున్నది. గతంలో సహాయ కేంద్రాలు ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థల అధీనంలో పనిచేసేవి. కానీ నెలరోజులుగా అమెరికా, ఇజ్రాయెల్ సహభాగస్వామ్యంతో కూడిన సంస్థలు అతి తక్కువ సంఖ్యలో గాజాలో ఆహార, సహాయ కేంద్రాలను నిర్వహిస్తున్నాయి. గాజాలో ఇజ్రాయెల్ చేస్తున్న యుద్ధం ప్రధాన మంత్రి నేతన్యాహూ లెక్కల ప్రకారం మంగళవారంనాటికి 627వ రోజుకు చేరుకుంది. ఇంకా 26 మంది బందీలు గాజాలో ఉన్నట్లు నేతన్యాహూ చెబుతున్నారు. వారందరినీ బేషరతుగా హమాస్ ఉగ్రవాదులు స్వాధీనం చేయాలని ఆయన కోరుతున్నారు. ఈ ఏడాది మార్చి రెండో తేదీ నుండీ గాజాలో సహాయాన్ని, ఆహార సరఫరాలను ఐడిఎఫ్ నిలిపివేసింది. ప్రపంచం తీవ్ర ఒత్తిడి చేయడంతో భరించలేక పరిమితంగా ఆహార సరఫరాలు ప్రారంభించింది. కాల్పుల విరమణ అనంతరం మార్చి 18 నుండి గాజాలో ఇజ్రాయెల్ యుద్ధాన్ని తిరిగి ప్రారంభించింది. అప్పటినుండి దాదాపు 5,500 మంది మరణించారు. 2023 అక్టోబరు ఏడో తేదీ నుండి ఇప్పటివరకూ గాజాలో 56,000 మంది పాలస్తీనియన్లు ఐడిఎఫ్ దాడుల్లో మరణించగా, మరో 14,000మంది శిథిలాల్లో కూరుకుపోయి మరణించారు.

## నాటో దేశాల భద్రతకు జిడిపిలో 5శాతం కేటాయింపు



**హేగ్ :** నాటో దేశాల రెండు రోజుల సదస్సు హేగ్‌లో మంగళవారంనాడు ప్రారంభమైంది. యూరప్ దేశాల నాయకులు సహా మొత్తం 45 దేశాల నాయకులు ఈ సదస్సులో పాల్గొంటూ ఉండటంతో డచ్‌దేశం నెదర్లాండ్‌లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. నాటో దేశాల జాతీయ భద్రత నిమిత్తం 2035 నాటి కి అన్ని దేశాలూ తమ స్థూల జాతీయోత్పత్తిలో ఐదుశాతం మేరకు ఖర్చు చేయాలన్నది ఈ సదస్సులో లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. దీనిపై నాటో కూట మి ఏకాభిప్రాయానికి వచ్చి ఒక తీర్మానం చేస్తుందని భావిస్తున్నారు. ఈ విషయంలో బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్ చాలా పట్టుదలతో ఉన్నారు. నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకుంటామని కీర్‌స్టార్‌మర్ ధీమా వ్యక్తం చేశా రు. 32 యూరప్ దేశాలూ ఈ ప్రతిపాదనకు అంగీకరిస్తాయని ఆయన ఆశాభావంతో ఉన్నారు. ఈ ఐదుశాతంలో 3.5శాతం బడ్జెట్ కీలక రక్షణావసరాలకు, 1.5 శాతం బడ్జెట్ భద్రతకు ఖర్చు చేస్తారు. ఐతే ఇంత డబ్బు కొత్తగా ఎక్కడ నుండి తెస్తారని కొందరు కన్జర్వేటివ్‌లు మండిపడుతున్నారు.ఇదిలా ఉండగా హేగ్‌లో సదస్సుకోసం భారీఎత్తున భద్రతా ఏర్పాట్లు చేసినప్పటికీ విద్రోహ చర్య జరిగింది. ఆమ్‌స్టర్‌డామ్ నుండి హేగ్ వరకూ రైళ్ళ రాకపోకలకు మంగళవారంనాడు తీవ్ర అంతరా యం కలిగింది. రైళ్ళ కేబుల్ వ్యవస్థ ను ధ్వంసం చేశారు. ఐతే నాయకులు ఇతర మార్గాలలో హేగ్‌కు చేరుకున్నారు. నెదర్లాండ్స్‌లో వేలాది మంది పోలీసులను భద్రతకోసం మోహరించారు. 27,000మంది అధికారులు ఈ పనిలోనే నిమగ్నమై ఉన్నారు.

## కెసిఆర్ సిద్ధమా?

(మొదటి పేజీ తరువాయి)



రాష్ట్రంలో 2004లో అప్పటీ ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి వ్యవసాయానికి ఉచిత విద్యుత్‌కు శ్రీకారం చుడితే దాని కొనసాగింపుగా ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమమే లక్ష్యంగా అనేక పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. రైతుల ఆత్మగౌరవం నిలబెట్టేందుకు ఏకకాలంలోనే 2535964 మంది రైతులకు సంబంధించి రెండు లక్షల వరకు ఉన్న రూ.20,617 కోట్ల రుణాలను 2024 అగస్టు 15వ తేదీన ఏకకాలంలో చెల్లించి రైతులను రుణాల నుంచి విముక్తి కల్పించామని చెప్పారు.

**అప్పులకుప్ప చేసి... గొప్పలు చెబుతారా?**

నాడు ధనిక రాష్ట్రంగా రూ.16వేల కోట్ల మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల కుప్పగా మార్చిన మామ (కెసిఆర్) శకునుడు, అల్లుడు (హరీష్‌రావు) శనిశ్వరుడు ఇప్పుడు గొప్పలు చెబుతున్నారని సిఎం రేవంత్ రెడ్డి ఎద్దెవా చేశారు. మొయినాబాద్‌లో హరీష్ రావుకు, జన్వాడలోకెటిఆర్‌కు ఎర్రవల్లిలో కెసిఆర్‌కు 100 ఎకరాల ఫామ్ హౌజ్, టివిలు, పేపర్లు పెట్టడానికి వేల కోట్లు పెట్టుబడి ఏలా వచ్చాయని నిలదీశారు. నాడు ఏమి లేనివారు, నేడు కోట్లుకు అదిపతులు కాగా, ధనిక రాష్ట్రం మాత్రం దివాళా తీసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాళేశ్వరం ముసుగులో వారు లక్ష కోట్లు రూపాయాలను కొల్లగొడితే, తమ ప్రభుత్వం ఉక్కు సకల్పంతో 18 నెలల కాలంలో రూ.1.04లక్షల కోట్లను రైతాంగానికి అందించి ఆదుకుందన్నారు. గడిచిన 10 ఏళ్లలో గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఏమి చేసిందో. 18 నెలలలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఏమి చేస్తోందో ప్రతి చోట చర్చ పెట్టాలని 4 కోట్ల ప్రజలకు సిఎం విజ్ఞప్తి చేశారు.

**కెసిఆర్‌ది మోస చరిత్ర..**

లక్షల కోట్లు కొల్లగొట్టి వేల ఎకరాల భూములను అక్రమించుకున్న కెసిఆర్,ఇప్పుడు తాను వచ్చి గోదావరి బనకచర్లను మొదలు పెట్టి చంద్రబాబు నాయుడుకి నీళ్లు ఇస్తున్నారని దుర్మార్గమైన మాటాలు మాట్లాడుతున్నారని రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడితో తను అంట కాగాలనుకుంటే అక్కడే ఉండేవాడనని, రాజీవ్ గాంధీ ఆశీర్వాదం తీసుకుని ఇక్కడ ఎందుకు ఉంటానని ప్రశ్నించారు. అనాడు సోనియమ్మను నమ్మించి నడి బజారులో ఆమెను మోసం చేసిన చరిత్ర కెసిఆర్‌ది అయితే, తెలంగాణ ఇచ్చిన సోనియమ్మకు అండగా నిలబడాలి ఆమె బిడ్డగా తెలంగాణలో ప్రజా ప్రభుత్వాని తేవాలని చంద్రబాబు నాయుడిని కాదనుకుని కాంగ్రెస్ పార్టీలో చేరి ప్రజా ప్రభుత్వం రావడానికి అందరి కదం కదం కల్పి ముందుకు నడిచానన్నారు.

ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ కేవలం 9రోజుల్లోనే రూ.9వేల కోట్లు రైతు భరోసా నిధులను రైతన్న ఖాతాల్లో జమ చేయడం దేశ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖి ంచదగ్గిన రోజని అన్నారు. ఈ ఘనత ఇందిరమ్మ రాజ్యమైన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. ఈ దేశ అభ్యున్నతికి ఎన్నో కలలు కన్న రాజీవ్ గాంధీ పాదాల సాక్షిగా రైతు భరోసా విజయోత్సవాలు జరపుకోవడం ఆనందంగా ఉందని అన్నారు. వ్యవసాయం అంటేనే కాంగ్రెస్ అని, వ్యవసాయం కోసం రైతుల కోసం బహుళార్ధక ప్రాజెక్టును నిర్మించిందని వివరించారు. ఉచిత విద్యుత్, మద్దతు,గిట్టుబాటు ధరలతో పాటు రైతు రుణాల మంజురుకు బ్యాంకులు ప్రాధాన్యత ఇచ్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని భట్టి గుర్తు చేశారు.

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ పంట పెట్టుబడి సహాయం కింద రైతులకు రూ.9 వేల కోట్లను అందజేయడం ద్వారా దేశ చరిత్రలో ఏ ప్రభుత్వం చేయని సాహసాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేసిందన్నారు. గత పాలకులు ఆర్థిక వ్యవస్థను పూర్తిగా విధ్వంసం చేసి, సంక్షోభంలోకి నెట్టినప్పటికీ, ప్రసుత కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం విధ్వంసం నుంచి వికాసం వైపు, సంక్షోభం నుంచి సంక్షేమం దీశగా అన్ని రంగాలను పురోగాభివృద్ధి సాధించేలా చర్యలు చేపట్టిందని వెల్లడించారు.

## 'గోల్డెన్ పీరియడ్'

(మొదటి పేజీ తరువాయి)

కార్యదర్శి విశ్వనాథన్, సిడబ్ల్యుసి సభ్యులు దామోదర్ రాజనర్సింహ, వంశీచంద్‌రెడ్డి, టిపిసిసి ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, డిసిసి అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ వ్యాసాల సంకలనం 'విధ్వంసం నుంచి వికాసం వైపు' పుస్తకాన్ని సిఎం రేవంత్‌రెడ్డి, ఎఐసిసి ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ వందేళ్ల కులగణన కలను నెరవేర్చామని, కులగణన చేసి కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి సవాల్ విసిరామని, కేంద్రం మెడలు వంచి దేశంలో కులగణన నిర్వహించేలా చేశామన్నారు.ఎస్‌సి వర్గీకరణ కోసం 35 ఏళ్లు పోరాటం చేశారని, అనేక మంది త్యాగాలు చేశారని, ఎస్‌సి వర్గీకరణ చేసి సమస్యకు పరిష్కారం చూపించామన్నారు.

**పార్టీ, ప్రభుత్వం జోడెద్దుల్లా పనిచేయాలి**

పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకు పోతామని, పార్టీ, ప్రభుత్వం జోడెద్దుల్లా పనిచేయాలని రేవంత్‌రెడ్డి అన్నారు. బూత్, గ్రామ, మండల స్థాయిలో పార్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని, బూత్ స్థాయిలో పార్టీ బలంగా ఉంటే ప్రభుత్వ పథకాలు ప్రజలలోకి సమర్థ వంతంగా తీసుకెళ్ళగలుగుతామన్నారు. పార్టీ నిర్మాణంపై టిపిసిసి దృష్టి సారించాలని, మరోసారి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే విధంగా పార్టీ నాయకులంతా ఐక్యంగా పనిచేయాలన్నారు. పార్టీ కమిటీలలో ఉన్న నాయకులు క్షేత్రస్థాయిలో పని చేయాల్సిందేనని, పనిచేస్తేనే పదవులు వస్తాయని సిఎం స్పష్టం చేశారు. పార్టీ కష్టకాలంలో పనిచేసిన వారికి పదవులు ఇచ్చామని, లక్ష్యాన్ని నిర్దేశించుకుని పార్టీ నాయకులు పనిచేయాలన్నారు. మార్కెట్ కమిటీలు, దేవాలయ కమిటీలు వంటి నామినేట్ పోస్టులు భర్తీ చేసుకోవాల్సిన అవసరముందన్నారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని, అనేక సామాజిక అంశాలను కూడా ప్రభుత్వం పరిష్కరించిందన్నారు. త్వరలో కార్యకర్తల ఎన్నికలు రానున్నాయని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలను గెలిపించుకోవాలన్నారు. మళ్లీ కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకు రావలసిన బాధ్యత కార్యకర్తలదేనన్నారు.

**పార్టీ పదవిని చిన్న చూపు చూడొద్దు**

పార్టీ నిర్మాణంలో క్రియాశీలక పాత్ర పోషించాలని, పార్టీ పదవి అని చిన్న చూపు చూడొద్దని, భవిష్యత్‌లో గొప్ప అవకాశాలు ఇచ్చేది పార్టీ పదవులేనని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు. 2029లో పార్టీ 2వ సారి అధికారంలోకి వస్తే పదవులన్నీ నాయకులు, కార్యకర్తలకే వస్తాయని, పార్టీ నాయకులు ప్రజలకు దగ్గరగా ఉండాలన్నారు. కార్యకర్తస్థాయి నుంచి అనేక మంది ముఖ్యమంత్రులుగా, మంత్రులుగా, టిపిసిసి అధ్యక్షులుగా ఎదిగారని, పార్టీలో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తే పదవులు వచ్చి తీరుతాయన్నారు. తనకు కాంగ్రెస్ పార్టీ బాధ్యతలతోనే ముఖ్యమంత్రి పదవి దక్కిందని, పార్టీ బాధ్యతలు మోసిన 65 మందికి ప్రభుత్వంలో పదవులు ఇచ్చామన్నారు. పార్టీ పదవులు వచ్చాయని పనిచేయకపోతే వారిని టిపిసిసి అధ్యక్షుడు పక్కన పెడతారన్నారు.

**ఆరు గ్యారెంటీల అమలును ప్రజల్లోకి తీసుకెళ్ళాలి : భట్టి**

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ సామాన్య ప్రజల కష్టాలను దృష్టిలో పెట్టుకొని మేము ఇచ్చిన ఆరు గ్యారెంటీలను సమర్ధవంతంగా అమలు చేస్తున్నామన్నారు. కొత్త పథకాలను కొనసాగించడమే కాకుండా గత ప్రభుత్వంలో ఉన్న సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామన్నారు. కళ్యాణలక్ష్మి పథకానికి కాంగ్రెస్ ప్రజా ప్రభు త్వం ఏర్పడిన తర్వాత రూ.3,022 కోట్లు విడుదల చేయగా 1,68, 225 మంది లబ్ధి పొందారన్నారు. చేయూత పథకం కింద మన ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు 17,563 వేల కోట్ల ఖర్చు చేయగా 43.01 లక్షల మంది వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు ఆర్థికంగా ప్రయోజనం పొందారని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఈ పథకాలన్నింటినీ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలలోకి తీసుకుపోవాలన్నారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ గోల్డెన్ పరిపాలన సాగుతోందని, అన్ని రకాలుగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అభివృద్ధి చేస్తున్నామని, దేశం మొత్తం మన వైపు చూస్తుందన్నారు. ఎఐసిసి నాయకులు తెలంగాణ రాష్ట్రం గురించి దేశమంతటా చెప్తున్నారన్నారు. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత పకడ్బందీగా చేపట్టాలని, అందుకు అందరూ పనిచేయాలని, గ్రామాలలో ప్రభుత్వ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేపట్టాలన్నారు.

## యుద్ధం వైపు

(మొదటి పేజీ తరువాయి)

(ఆర్‌ఎస్‌పి), బి.సురేందర్ రెడ్డి (ఫార్వర్డ్ బ్లాక్,) ప్రసాద్ అన్న (సిపిఐ ఎంఎల్) పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ అమెరికా దేశ అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ సామ్రాజ్యవాద కాంక్షతో ప్రపంచ దేశాలను మూడో ప్రపంచ యుద్ధం వైపు నడిపించే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగానే రష్యా ఉక్రేయిన్ మధ్య యుద్ధాన్ని పరోక్షంగా ప్రోత్సహించిన ట్రంప్ ఇటీవల వరకు పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడి చేసేలా చేయగా తాజా ఇరాన్‌పై ఇజ్రాయిల్‌ల యుద్ధానికి పుర్పిగొల్పడమే కాకుండా అణు అయుధాల పేరుతో అమెరికా ఇరాన్‌పై శక్తివంతమైన బాంబుల వర్షం కురిపించడం దుర్మార్గమన్నారు. కశ్మీర్‌లోని పహల్గామాలో ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో పాకిస్తాన్‌లో ఉగ్రవాదుల శిబిరాలపై భారత్ సైన్యాలు అపరేషన్ సిందూర్ చేపడితే ట్రంప్ భారత్‌కు మద్దతు పలికినట్లే పలికి రెండు రోజుల్లోనే పాకిస్తాన్‌కు వంతుపాడడమేకాకుండా ఇరు దేశాల మధ్య కాల్పుల విమరణకు తనవల్లే సాధ్యమైందంటూ ఈ దేశ సౌరభౌమ అధికారాన్ని కించపర్చినా మన దేశ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మాత్రం ఒక్క మాట కూడా మాట్లాడేలేదన్నారు. మన దేశం అవలభిస్తున్న అలీన దేశాల విధానానికి పూర్తిగా విస్మరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా వంతు పాడడం సరైంది కాదన్నారు. భారత దేశ ప్రధానిగా అమెరికా యుద్ధ కాంక్షకు వ్యతి రేకంగా తక్షణమే మోదీ తన గళాన్ని వినిపించాలని డిమాండ్ చేశారు. జాన్‌వెస్లీ మాట్లాడుతూ అమెరికా ప్రపంచ దేశాలపై ఆధిపత్యాన్ని చెలాయించేందుకు ప్రత్యక్షంగా, పరోక్షగా వివిధ దేశాల మధ్య యుద్ధాలకు ఆజ్యం పోయడాన్ని వామ పక్ష పార్టీలు తీవ్రంగా ఖండిస్తున్నాయన్నారు. ఇరాన్ వద్ద అణు అయుధాలను తయారు చేస్తే అడ్డుకోవడానికి ఐక్యరాజ్యసమితి, అంతర్జాతీయ న్యాయస్థానాలు ఉన్నాయని, అడ్డుకునే పేరుతో దాడికి పాల్పడే అధికారం ట్రంప్‌కు ఎవరూ ఇచ్చారని ప్రశ్నించారు. ప్రపంచ అశాంతికి కారణమవుతున్న అమెరికా యుద్ధోన్మాద చర్యలను భారత్ ప్రభుత్వం తక్షణమే ఖండించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్.ఛాయాదేవి, సహాయ కార్యదర్శులు కమతం యాదగిరి, స్టాలిన్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బి.వెంకటేషం, మహిళా సమాఖ్య నగర అధ్యక్షురాలు పడాల నళిని, ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సయ్యద్ వలి వుల్లా ఖాద్రీ, ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, సిపిఐ(ఎం) రాష్ట్ర నాయకులు, డి.జి.నరసింహా రావు, జ్యోతి, వెంకటేష్, న్యూడెమోక్రసీ నాయకులు చలపతి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## సూత్రధారి కెసిఆరే

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగుతుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. నిందితులపై ఎప్పుడు చర్యలు తీసుకుంటారని అడిగారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై కమిటీలు వేస్తున్న ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎందుకు నివేధికలను బయటపెట్టడంలేదని అడిగారు. ఫోన్ ట్యాపింగ్ చేయడం వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించడమే అన్నారు. హుజురాబాద్ ఉపఎన్నికల సమయంలో తన ఫోన్ ట్యాప్ చేశారని అన్నారు. తన ఫోన్ అనేకసార్లు ట్యాపింగ్ అయ్యిందని చెప్పారు. నాయకుల ఫోన్లను మాత్రమే కాకుండా వారి గన్‌మెన్ల ఫోన్లను కూడా ట్యాప్ చేశారన్నారు. 2018లో తాను ప్రభుత్వంలో ఉన్నప్పుడే తనను ఓడించే ప్రయత్నం జరిగిందన్నారు. 2021లో హుజురాబాద్ బై ఎలక్షన్ సమయంలో తాను ఏ కార్యకర్తతో మాట్లాడితే వాళ్ల ఇంటికి వెళ్లి పదవులు డబ్బులు ఆశచూపి ఓడించే ప్రయత్నం చేశారన్నారు. 2023లో గజ్వేల్, హుజురాబాద్‌లో పోటీ చేసిన ప్పుడు తమ ఫోన్లు ట్యాప్ చేశారన్నారు.

**సిట్ అధికారుల వద్దకు నేతల క్యూ**

ఫోన్ ట్యాపింగ్ కేసులో సాక్షులు జూబ్లిహిల్స్ పోలీసు స్టేషన్‌లో ఉన్న సిట్ అధికారుల వద్దకు క్యూ కడుతున్నారు.618 మందికి చెందిన ఫోన్‌లను ట్యాపింగ్ చేసిన జాబిత సిట్ అధికారుల వద్ద ఉంది. ఈ జాబితా ప్రకారం సిట్ అధికారులు ప్రతిరోజు 10 నుంచి 25 మంది సాక్షుల వాంగ్మూలాను సేకరించే పనిలో పడ్డారు. ఇప్పటి వరకు సిట్ అధికారులు 278 మంది బాధితుల వాంగ్మూలాను రికార్డు చేశారు. ఇంకా 340 మంది వాంగ్మూలాను సేకరించాల్సి ఉంది. ఈ రకంగా చూసుకుంటూ ఇంకా 20 రోజులు సిట్ అధికారులు సాక్షుల వాంగ్మూలాలు సేకరించడంలోనే బిజిబిజిగా గడిపే అవకాశాలు ఉన్నాయి. సాక్షుల వాగ్మూలాలు పూర్తయితే చార్జిషీట్‌లో సుమారు 3000 పేజీలు సాక్షుల కోసమే కేటాయించాల్సి వస్తుంది సిట్ అధికారులకు. ఫోన్ ట్యాపింగ్‌లో బాధితులుగా ఉన్న జడ్జిలను నుంచి కూడా సిట్ అధికారులు వాంగ్మూలం సీకరించే అవకాశాలు ఉన్నాయి.

## 'కాల్పుల విరమణ'

(మొదటి పేజీ తరువాయి)

ఉల్లంఘించినట్లు వారు భావించారు'' అన్నారు. ఐతే రెండు దేశాలూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించాయని చెప్పిన ట్రంప్, ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఇంకెంతమాత్రం ఇరాన్‌పై దాడులు చేయబోవని, విమానాలు వెళితే అది స్నేహపూర్వకమే అవుతుందని ప్రకటించారు.

''ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు వెనక్కు తిరిగాయి, ఇరాన్‌పై దాడులు చేయడం లేదు, ఆపేశాయి, రెండు దేశాలమధ్యా కాల్పుల విరమణ అమలులో ఉంది, కాల్పుల విరమణకు కట్టుబడేలా రెండు దేశాలపై ఒత్తిడి తీసుకువచ్చా'' అని తన సొంత సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో పెట్టిన పోస్టింగ్‌లో పేర్కొన్నారు. ఇజ్రాయెల్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి కూడా కాల్పుల విరమణ ప్రకటనను ధృవీకరించారు. సైనిక చర్యలను నిలిపివేయడంపై తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ''ఇజ్రాయెల్ దాడులు ఆపేస్తే మేమూ దాడులు ఆపేస్తాం'' అన్నారు. కాల్పుల విరమణ ఒప్పందం మొదలైందని ఇరాన్ ప్రభుత్వ మీడియా కూడా ప్రకటించింది. ఒప్పందం కుదరకముందు ఎక్స్ వేదికగా ఆయన ప్రకటన చేస్తూ, స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటల వరకూ ఎలాంటి కాల్పుల విరమణ ఒప్పందం జరగలేదని పేర్కొన్నారు. ఒప్పందం తర్వాత కూడా ఇలాంటి ప్రకటన చేయాలన్నది తమ ఉద్దేశం కాదన్నారు. కాల్పుల విరమణను ఉల్లంఘించారంటూ ఇరాన్,ఇజ్రాయెల్ మధ్య తొలుత పరస్పర విమర్శలు నడిచాయి. కాల్పుల విరమణ అమలులోకి వచ్చాక తమ గగనతలంలోకి క్షిపణులు దూసుకొచ్చాయని ఇజ్రాయెల్ చేసిన ఆరోపణను ఇరాన్ తిరస్కరించింది. ఐతే తెల్లారుజామున క్షిపణులు వచ్చాయని, పేలుళ్ళు జరిగాయని, సైరన్లు మోగాయని ఇజ్రాయెలీ మిలిటరీ అధికారులు చెప్పారు.

**ట్రంప్‌తో మాట్లాడాక ఇరాన్‌పై మరిన్ని కఠిన దాడులు ఆపేశా :** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడిన తర్వాత, ఇరాన్‌పై మరిన్ని కఠినమైన దాడులు చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నాననీ, దాడులు ఆపేశానని ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నేతన్యాహూ చెప్పారు. ఆయన కార్యాలయ అధికారులు బీర్షెబా నగరం నుండి మంగళవారంనాడు ఈ ప్రకటన చేశారు. యుద్ధంలో పన్నెండోరోజు ఉదయమే ఇరాన్ క్షిపణులు తమ దేశంపై దాడులు చేయడంతో తిరిగి ఆ దేశ రాడార్‌పై దాడి చేశామని చెప్పా రు. ''మా ప్రధానమంత్రి అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో సంభాషించారు. అదనపు దాడులకు ఇక ఇజ్రాయెల్ దూరంగా ఉం టుంది'' అని నేతన్యాహూ కార్యాలయం తెలియజేసింది. ''కాల్పుల విరమణ ఒప్పందాన్ని నేతన్యాహూ సమ్మతించారు, యుద్ధం ఆగిపోయింది'' అని ఇజ్రాయెల్ ప్రభుత్వ టీవీ ప్రకటించింది. ఈ 12 రోజుల యుద్ధంలో ఇజ్రాయెల్‌లో 28 మంది మరణించారు. 1000 మంది పైగా గాయపడ్డారు. ఇరాన్‌లో 974 మంది మరణించారు. 3,458 మంది గాయపడ్డారు. వాషింగ్టన్ కేంద్రంగా పనిచేసే మానవహక్కుల కార్యకర్తలబృందం ఈ విషయం వెల్లడించింది.

### సవరణ :

ఈనెల 24న ప్రజాపక్షం మొదటి పేజీలో ప్రచురితమైన సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా వార్తలో 'ఇజ్రాయెల్‌లో అమాయక చిన్నారులు, మహిళలను ఆకలితో చంపేస్తుండడంపై మోదీ ఎందుకు ఆ దేశాన్ని అడగడం లేదు'కు బదులుగా 'పాలస్తీనాలో అమాయక చిన్నారులు, మహిళలను ఆకలితో చంపేస్తుండడంపై ఇజ్రాయెల్‌ను మోదీ ఎందుకు అడగడం లేదు' అని చదువుకోగలరు.



# జనరల్
STATE & REGIONAL NEWS



తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా దేవాదాయ శాఖలో గ్రామీణ ప్రాంత దేవాలయా ల్లో అర్చకత్వం నిర్వహిస్తున్న ధూప దీప నైవేద్యం కింద అర్చక సంక్షేమ పథకాలు చేపట్టడంపై ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దౌలతాబాద్ వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో 100 మంది అర్చకులు వచ్చి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తన నివాసంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను సన్మానించారు.

# ఇప్పటి వరకూ 3 లక్షల 'ఇందిరమ్మ ఇండ్లు' మంజూరు

## మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు సుమారు 3లక్షల 'ఇందిరమ్మ ఇండ్ల'ను మంజూరు చేయగా, ఇందులో 2.37 లక్షల మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశామని గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 1.03 లక్షల ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయని, వివిధ దశల్లో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో హైదరాబాద్‌లోని సచివాలయంలో ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా రూ 22,500 కోట్లతో నియోజకవర్గానికి 3,500 చొప్పున 4.50 లక్షల ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని,ఈ నెల 23వ తేదీ వరకు గ్రేటర్ హైదరాబాద్ (జిహెచ్‌ఎంసి) మినహా రాష్ట్రంలోని 95 నియోజకవర్గాలకు గాను 88 నియోజకవర్గాలలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తయిందన్నారు. వర్షాకాలం సీజన్‌ను దృష్టి లో పెట్టుకొని గ్రౌండింగ్ అయిన ఇండ్లను వీలైనంత త్వరగా బేస్‌మెంట్ పనులు పూర్తి చేసుకునేలా నిరంతరం మానిటరింగ్ చేయాలని అధికారులకు మంత్రి పొంగులేటి సూచించారు. ఇండ్ల మంజూరు, గ్రౌండింగ్‌లో సూర్యాపేట, పెద్దపల్లి, భూపాలపల్లి, హనుమకొండ, వికారాబాద్, సిద్దిపేట, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల పనితీరు మరింత మెరుగు పడాలని, తక్షణమే ఆయా జిల్లాలపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లకోసం ప్రభుత్వం ఒక్కో ఇంటి కోసం 40 మెట్రిక్ టన్నుల ఇసుకను ఉచితంగా అందిస్తోందని, ఈ ప్రయోజనాన్ని పూర్తిస్థాయిలో లబ్ధిదారులు పొందే విధంగా క్షేత్ర స్థాయి లో అధికారులు చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏ మాత్ర ం ఆలస్యం చేయకుండా, ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి ఆధారంగా లబ్దిదారులకు ప్రతి సోమవారం నిధులను చెల్లిస్తున్నామని, మధ్యవర్తుల ప్రమేయానికి ఆస్కారం లేకుండా నాలుగు విడుతల్లో ఇందిరమ్మ లబ్దిదారుల బ్యాంకు ఖాతాలోని జమ చేస్తున్నామని వివరించారు.

ఇంటి స్థలాలు లేని, అర్హత కలిగిన లబ్దిదారులకు ఇప్పటివరకు కేటాయించని రెండు పడకల ఇండ్లను కేటాయించాలని, అలాగే మొండి గోడలతో ఉన్న రెండు పడకల ఇండ్లను పూర్తి చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రాకపోతే వాటిని లబ్ధిదారులే పూర్తి చేసుకునేందుకు రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వమే అందిస్తుందని తెలిపారు. జిహెచ్‌ఎంసి, నిజామాబాద్, కరీంనగర్, మహబూబ్‌నగర్, వరంగల్ జిల్లాలలో అసంపూర్తిగా ఉన్న రెండు పడకల ఇండ్లు విషయంలో అధికారులు ప్రధానంగా దృష్టి సారించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.

## నేలల భూసారం, వాతావరణ పరిస్థితుల ఆధారంగా
# వ్యవసాయ ప్రణాళిక రూపొందించాలి

### మంత్రి తుమ్మలకు సదస్సు నివేదికను సమర్పించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** వివిధ నేలల భూసారం, ప్రాంతాల వాతావరణ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభు త్వం సమగ్రమైన పంటల సాగు విధానాన్ని ప్రతిబింబించే వ్యవసాయ ప్రణాళికను రూపొందించాలని వ్యవసాయ ఆర్థిక రంగంలోని ప్రము ఖ విద్యావేత్తలు, వ్యవసాయ ఉద్యమ నాయకులు విజ్ఞప్తి చేశారు. 'భారతదేశంలో సమకాలీన వ్యవసాయం, వ్యవసాయఆర్థిక శాస్త్ర సవాళ్లు, దృక్పథాలు' అనే అంశంపై సదస్సు హైదరాబాద్ కొండాపూర్‌లోని చండ్ర రాజేశ్వరరావు ఫౌండేషన్‌లో గల నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధన కేంద్రం లో జరిగింది. ఈ సదస్సులో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డి.నర్సింహారెడ్డి, అఖిల భారత కిసాన్ సభ ఉపాధ్యక్షు లు ఎస్.మల్లారెడ్డి, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం డాక్టర్ బి.శరత్ బాబు, ఇక్రిసాట్ మాజీ శాస్త్రవేత్త డాక్టర్ కె.పూర్ణ చంద్ర రావు, ఐసిఎఆర్ మాజీ శాస్త్రవేత్త ప్రొఫెసర్ మార్ల సోమ సుందర్ తదితరులు పాల్గొన్నారు. భారతదేశంలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో వ్యవసాయ రంగం ప్రస్తుత స్థితిపై సదస్సు ఒక నివేదికను రూపొందించింది. ఆ నివేదికను మంగళవారం ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివ రావు, నీలం రాజశేఖర్ రెడ్డి పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ సురేష్ బాబు రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఆయన నివాసంలో కలిసి అందజేశారు. రాష్ట్రంలో వ్యవసాయరంగంలో తీసుకోవాల్సిన చర్యల గురించి సదస్సు రూపొం దించిన నివేదికలోని అంశాలను వారు మంత్రికి వివరించా రు. దేశంలో సుసంపన్నంగా ఉన్న వృక్ష, పంటల మూల వంగడాలు (జెర్మోప్లాజమ్)ను వినియోగించి, హాని కలిగించని నూతన బయోటెక్నాలజీ నుంచి నూతన పంట వంగడాలను మరింత వేగంగా రూపొందించటానికి నిధులను కేటాయించి ప్రభుత్వరంగం వ్యవసా య పరోశోధనలు జరపాలని సూచించారు. విత్తన రంగంలో స్వయం సమృద్ధిని సాధించేందుకు వెంటనే విత్తన చట్టాన్ని తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అన్ని పంటల విత్తన ఉత్పత్తిని విరివిగా ప్రభుత్వ వ్యవసాయ క్షేత్రాల్లో చేపట్టి చిన్న రైతులకు తక్కువ ధరలను అందుబాటులోకి తేవాలని, బిటి హైబ్రీడ్ విత్తనాలను విక్రయిస్తున్న విదేశీ విత్తన కంపెనీలను నిషేధించడం లేదా నియంత్రించడం చేయాలని సూచించారు. ఆర్థిక సంక్షోభానికి గురై రైతుల ఆత్మహత్యలను తగ్గించటానికి సత్వర చర్యలు చేపట్టాలని కోరారు.

ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పందిస్తూ వ్యవసాయరంగానికి సంబంధించి నీలం రాజశేఖర్‌రెడ్డి పరిశోధన కేంద్రం చేసిన ప్రయత్నాన్ని సమర్థిస్తూ నివేదికలోని, సూచనలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. తప్పనిసరిగా వ్యవసాయ రంగంలో ఉన్న రైతులందరికీ న్యాయం చేయడం, వారి ప్రయోజనాలను పరిరక్షించడాని కి అందరూ చేసే ప్రయత్నాలను ప్రభుత్వం స్వాగతిస్తుందని మంత్రి చెప్పారు.

# రాష్ట్ర పోలీసులకు మరో జాతీయ అవార్డు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**తెలంగాణ పోలీసులు మరో జాతీయ అవార్డును సొంతం చేసుకున్నారు. పాస్‌పోర్టు దరఖాస్తుదారుల పోలీసు ధృవీకరణలో దేశంలోనే తెలంగాణ పోలీసులు ముందున్నారు. ఇందుకోసం పోలీసులు ఉపయోగిస్తున్న ''వెరి ఫాస్ట్'' దేశవ్యాప్తంగా నీరాజనాలు అందుకుంది. న్యూఢిల్లీలో మంగళవారం నిర్వహించిన 'పాస్‌పోర్ట్ సేవా దివస్' సందర్భంగా కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్రా మార్గరిటా చేతుల మీదుగా తెలంగాణ ఇంటెలిజెన్స్ డిజి 'తెలంగాణ ఉత్తమ సేవా ధ్రువీకరణ పత్రం' (అవార్డు)ను అందుకున్నారు. పాస్‌పోర్ట్ దరఖాస్తుదారుల పోలీసు ధృవీకరణ ప్రక్రియలో తెలంగాణ రాష్ట్ర పోలీసు విభాగం అత్యుత్తమ ప్రదర్శనతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. ఈ విజయానికి కారణం తెలంగాణ పోలీసులు అభివృద్ధి చేసిన వెరిఫాస్ట్ యాప్, ఇది పాస్‌పోర్ట్ ధృవీకరణ ప్రక్రియను వేగవంతంగా, ఖచ్చితంగా, పారదర్శకంగా అత్యుత్తమమైన ప్రజాప్రయోజనకారిగా రూపుదిద్దుకుంది. విదేశాంగ శాఖ తాజా జాతీయ గణాంకాల ప్రకారం, రాష్ట్ర పోలీసులు దేశంలోనే అత్యంత వేగంగా పాస్‌పోర్ట్ ధృవీకరణను పూర్తి చేస్తూ, తక్కువగా మూడు పనిదినాల్లోనేఎక్కువశాతం కేసులను పరిష్కరిస్తున్నారు.

**ఈ యాప్ పోలీసులకే తల మానికం: శివధర్‌రెడ్డి**

వెరిఫాస్ట్ యాప్ తెలంగాణ పోలీసుల సాంకేతిక వినియోగ సామర్థ్యానికి తలమానికంగా నిలుస్తోంది. ఇది సాంకేతికత ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వ విధానాలకి ప్రతిబింబంగా ఉంది. తెలంగాణ పోలీసులు పాస్‌పోర్ట్ ధృవీకరణలో గోల్డ్ స్టాండర్డ్ నెలకొల్పినందుకు గర్వపడుతూ, భవిష్యత్తులో మరిన్ని ఆవిష్కరణల కోసం యోచిస్తున్నారు.






# రైలులో రూ.40 లక్షల చోరీ

## 48 గంటల్లో ఛేదించిన ఆర్‌పిఎఫ్ పోలీసులు

**ప్రజాపక్షం/హైదరాబాద్:**రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసులు (ఆర్‌పిఎఫ్) రూ.40 లక్షల చోరీ కేసును 48 గంటల్లోనే ఛేదించారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియాకు దక్షిణ మధ్య రైల్వే ప్రధాన పౌర సంబంధాల అధికారి (సిపిఆర్‌ఒ) ఎ.శ్రీధర్ మంగళవారం వెల్లడించారు. ఈ నెల 20వ తేదీన 73 ఏళ్ల వృద్ధురాలు తన భర్తతో కలిసి ఇండోర్ నుండి లోనావాలాకు ప్రయాణిస్తోంది. లోనావాలాలో జరిగే మతపరమైన భగవత్ కార్యక్రమంలో పాల్గొనడానికి వారు వెళ్తున్నారు. రాత్రి భోజనం చేసిన తర్వాత వృద్ధ దంపతులిద్దరూ నిద్రపోయారు. వృద్ధురాలు ఆమె తన హ్యాండ్ బ్యాగ్‌ను తన చంక దగ్గర ఉంచుకుంది. అదే పరిస్థితుల్లో, ఆమె కూడా నిద్రపోయింది. ఉదయం 7:30 గంటలకు రైలు లోనావాలా చేరుకోబోతుండగా ఆమె మేల్కొంది. ఆమె వెంటనే భారతీయ రైల్వే హెల్ప్‌లైన్ నంబర్ 139కి కాల్ చేసింది. తన బ్యాగ్ చోరీకి గురైందని..ఆ బ్యాగ్‌లో డైమండ్ బ్రాస్‌లెట్, డైమండ్ నెక్లెస్, ఉంగరాలు, బంగారు గడియారం, బంగారు గొలుసు మొత్తం 40లక్షల విలువైన రూ.50,000నగదు వంటి విలువైన ఆభరణాలు ఉన్నాయని ఫిర్యాదు చేసింది. లోనావాలాలోని జిఆర్‌పిలో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. జిఆర్‌పి, ఆర్‌పిఎఫ్, లోకల్ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు రైల్వే అధికారులు వేర్వేరు బృందాలను ఏర్పాటు చేసి రైలు ఆగిన వివిధ స్టేషన్లకు పంపారు. రైలు ఇండోర్, దేవాస్, ఉజ్జయిని, నాగ్దా, ఖచ్రోడ్ రత్లం, మేఘ్‌నగర్, దహోద్, గోద్రా, వడోదర, సూరత్, వాసాయి రోడ్ భివాండి రోడ్ కళ్యాణ్, కర్జాత్, లోనావాలా, చించ్వాడ పూణే, దౌండ్ గుండా వెళుతుంది. అన్ని సిసిటివి ఫుటేజ్‌లను శోధించారు. ఒక వ్యక్తి కళ్యాణ్ వద్ద రైలుదిగి సకాలం లో స్టేషన్ నుండి బయటకు రాలేదని తేలింది. అతన్ని ట్రాక్ చేయడం జరిగింది. ముంబైలోని చెంబూర్‌కు చెందిన నిందితుడు మహేష్ అరుణ్ ఘుగ్ అలియాస్ విక్కీని కనిపెట్టింది. దొంగిలించబడిన మొత్తం చోరీ సొత్తును బాధితులకు అప్పగించారు.

## గోదావరి మిగులు జలాల తప్పడు ప్రచారంతో
# ఎపి సిఎం కుట్ర : జగదీష్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గోదావరి మిగులు జలాలు సముద్రంలో కలుస్తున్నాయని ఎపి సిఎం చంద్రబాబు తప్పుడు ప్రచారంతో పెద్ద కుట్రకు పాల్పడుతున్నారని, అందుకే తెలంగాణ రాష్ట్రంలోని రాజకీయ పార్టీల మధ్య తగాదాలను సృష్టిస్తున్నారని బిఆర్ఎస్ మాజీ మంత్రి జి.జగదీష్ రెడ్డి ఆరోపించారు. కెసిఆర్‌మీద, ఇంకొకరిపైన నెపంతో వారి మధ్య పంచాయతీ పెట్టించి పబ్బం గడపాలని 'చంద్రబాబు అండ్ కో' ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. గోదావరి బనకచర్ల ప్రాజెక్ట్‌ను ఆపేందుకు తక్షణమే అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయాలని జగదీష్ రెడ్డి సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగదీష్ రెడ్డి మాట్లాడుతూ గోదావరి బనకచర్ల విషయంలో చంద్రబాబుతో చర్చలు జరగడం అంటేనే ఆయనకు దాసోహం చేయడమని, ఆయనను చర్చలకు ఆహ్వానించడం కాదని, ముందుగా అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌ను ఏర్పాటు నిర్వహించేలా రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేయాలని సూచించారు. గోదావరి జలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం న్యాయ కోవిదులతో మాట్లాడి, తగిన చర్యలు తీసుకోవాలని, కేంద్రం అనుకూలంగా లేకపోతే అవసరమైతే న్యాయపోరాటానికి కూడా సిద్ధం కావాలని జగదీష్‌రెడ్డి సూచించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర రాజకీయ పార్టీలుగా కొట్లాటలు, పంచాయతీలు పెట్టుకోవడం కాదని, తెలంగాణ రాజకీయ పార్టీలు చంద్రబాబు మాయలో పడొద్దని సూచించారు. చంద్రబాబు చెబుతున్న గోదావరి కావేరి లింక్ అనేది పెద్ద మోసం అని ఆరోపించారు.

గోదావరి నదిలో ఛత్తీస్‌ఘఢ్ ప్రభుత్వం వాడుకుని 150 టిఎంసిల నీటిని కావేరికి తీసుకెళ్తామని ప్రతిపాదించడంతో ఛత్తీస్‌ఘఢ్ ప్రభుత్వం వెంటనే మేల్కొని, తమ వాటా 150 టిఎంసిల నీరు తాము వాడుకుంటున్నామని, అందుకు పలు ప్రాజెక్ట్‌లను నిర్మిస్తున్నట్లు ప్రతిపాదించారని, ఇక్కడ చుక్క నీరు లేదని, గోదావరి కావేరి అనుసంధానాన్ని అంగీకరించబోమని ఆ ప్రభుత్వం స్పష్టం చేసిన విషయాన్ని జగదీష్ రెడ్డి వివరించారు.

ఇక గోదావరి కావేరి ముగిసిన అధ్యయనం అని అన్నారు. బిజెపి నాయకులు కూడా కేంద్ర మంత్రి స్థాయిలో ఉన్నవారు అవగాహన పెంచుకుని మాట్లాడితే మంచిదని, చిల్లర రాజకీయాలు వద్దని హితువుపలికారు. చంద్రబాబు రూపంలోనే నరేంద్రమోదీ కి శ్వాస వస్తుందని, మోదీకి చంద్రబాబు ఊపిరి అని, అందుకే ఆ పార్టీ నాయకులు మాట్లాడే పరిస్థితిలో లేరన్నారు. సముద్రంలో వృథాగా పోయే నీటిని రెండు రాష్ట్రాలు ఎలా ఉపయోగించుకోవాలనే అంశంలో కేంద్ర జలశక్తి మంత్రికి సిఎంగా కెసిఆర్ రాసిన లేఖ వాస్తవమేన ని, కానీ అందుకు భిన్నంగా ఎపి ప్రభుత్వం ప్రస్తుతం వ్యవహారిస్తోందని, కృష్ణనది నుంచి కాకుండా పక్కమార్గంలో ప్రాజెక్ట్‌ను నిర్మిస్తుందని వివరించారు.




# బిసిలకు 42శాతం రిజర్వేషన్లకు డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జూలై 17న నిర్వహించనున్న 'రైల్ రోకో'కు మద్దతు ఇవ్వాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత సిపిఐ(ఎం), సిపిఐ (న్యూడెమోక్రసి) నాయకులను కోరారు. హైదరాబాద్‌లోని ఎంబి భవన్‌లో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జ్యోతిని, ఆ తర్వాత అడిక్ మెట్‌లోని మార్క్స్ భవన్ లో సిపిఐ (న్యూడెమోక్రసి) కేంద్ర కమిటీ సభ్యులు సాధినేని వెంకటేశ్వర రావు, జెవి చలపతిరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.గోవర్ధన్ తో కల్వకుంట్ల కవిత భేటీ అయ్యారు. ఈ సందర్భంగా బిసి రిజర్వేషన్ అంశంపై చర్చించారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభ, శాసనమండలిలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపునకు రెండు వేర్వేరు బిల్లులను ఆమోదించి, కేంద్ర ప్రభుత్వానికి పంపి, మూడు నెలలు అవుతున్నప్పటికీ, ఎటువంటి స్పందన లేదని, రిజర్వేషన్ల అమలుకు సిఎం రేవంత్ రెడ్డి ఎలాంటి ఒత్తిడి కూడా చేయడం లేదని, అందుకే జూలై 17న రైల్ రోకోకు పిలుపునిచ్చామని కవిత వారికి వివరించారు. సమావేశానంతరం కవిత మీడియాతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం బిసి బిల్లుకు ఆమోదముద్ర వేయాలంటే ఉద్యమబాట ఒక్కటే మార్గమని, అందుకే రైల్ రోకోకు పిలుపునిచ్చామని వివరించారు.



**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: ఎల్.బి.నగర్ సర్కిల్-4**

NIT No. 11/EEC-4/LBNR/GHMC/2025-26, షార్ట్ టెండర్ నోటీసు తేది: 23.06.2025

**పని పేరు:** నిర్వహణ పనులు - 5 నెం.లు, **అంచనా విలువ :** రూ.36.85 లక్షలు, **బిడ్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 24.06.2025న మ.03.00గం.ల నుండి 01.07.2025న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వి.కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్.బి.నగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి, మొబైల్ నెం. 9701365519. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్.బి.నగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 4050-PP/CL/ADVT/1/2025-26, Date: 24-06-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ :: ఎల్.బి.నగర్ సర్కిల్-4**

NIT No. 12/EEC-4/LBNR/GHMC/2025-26, ఆర్ఎఫ్‌పి టెండర్ నోటీసు తేది: 24.06.2025

**పని పేరు:** అభివృద్ధి పని - 1 నెం.లు, **బిడ్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 25.06.2025న సా.05.00గం.ల నుండి 02.07.2025న మ.03.00గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ వి.కార్తీక్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్.బి.నగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి, మొబైల్ నెం. 9701365519. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్.బి.నగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 4081-PP/CL/ADVT/1/2025-26, Date: 24-06-2025

**ఫారం VII**

(సెక్షన్ ఉప నియమం (1) యొక్క నియమం -25 మరియు సెక్షన్ 19(1) యొక్క చట్టం -30/2013)

**తెలంగాణ ప్రభుత్వం**
**రెవెన్యూ (భూ సేకరణ) శాఖ**
**రూఢి ప్రకటన**

గెజిట్ నెం. 44/2025 తేది: 17.06.2025
ఎఫ్/777/2025 తేది: 16.06.2025
జి/197/2025 తేది: 17.06.2025

ప్రజా ప్రయోజనము నిమిత్తం అనగా నారాయణపేట కొండంగల్ లిఫ్టు ఇరిగేషన్ నిర్మాణంలో భాగంగా ప్రెస్సర్ మైన్ నిర్మాణం కొరకు **నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలం, లింగారెడ్డిపల్లి గ్రామం** పరిధిలో మొత్తం **ఎ. 17.17 గుంటలు** భూమి అవసరమైఉన్నదని తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్ నారాయణపేట వారు భావించుచున్నారు.

కావున ఇట్టి ప్రకటన ద్వారా నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండలంలోని లింగారెడ్డి పల్లి గ్రామంలో పైన పేర్కొన ప్రాజెక్ట్ కొసం భూమి కొలిచి ఎక్కువ లేదా తక్కువ **ఎ. 17.17గుంటలు** అంటే 6.94 హెక్టార్లు దీని వివరణాత్మక వర్ణన ఈ క్రింది విధంగా ఉంది.

| క్ర.సం. | సర్వే నెం. | [illegible] | భూమి రకం | [illegible] | ఆసక్తిగల వ్యక్తుల పేర్లు | సరిహద్దులు ఉ | తూ | ప | ద | చెట్లు రకం | సంఖ్య | కట్టడాలు రకం | విస్తీర్ణం |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 59/అ/ఆ | పట్టా | మెట్ట | 0-13 | ద్యావరి వెంకటప్ప తండ్రి తిప్పన్న | 59 | 59 | 59 | 59 | - | - | కరెంట్ స్థంబాలు | 1 |
| 2 | 59/అ 1 | పట్టా | మెట్ట | 0-01 | ద్యావరి వెంకటప్ప తండ్రిపెద్ద కనకప్ప | 59 | 59 | 59 | 59 | - | - | - | - |
| 3 | 59/అ 2 | పట్టా | మెట్ట | 0.21 | భీమమ్మ భర్త నర్సప్ప | 59 | 59 | 59 | 59 | - | - | పైప్ లైన్ | 280 మీ |
| 4 | 60/అ/1 | పట్టా | మెట్ట | 0-05 | గొల్ల చిన్న కనకప్ప తండ్రి కనకప్ప | 60 | 60 | 60 | 60 | - | - | బోర్ | - |
| 5 | 60/అ 2 | పట్టా | మెట్ట | 0-05 | గొల్ల పెద్ద కనకప్ప తండ్రి కనకప్ప | 60 | 60 | 60 | 60 | - | - | పైప్ లైన్ | - |
| 6 | 60/ఆ/2 | పట్టా | మెట్ట | 0-05 | ఆశప్ప తండ్రి కనకప్ప | 60 | 60 | 60 | 60 | టేకు | 15 | - | - |
| 7 | 60/ఇ | పట్టా | మెట్ట | 0-01 | బర్ల ముత్యాలప్ప తండ్రి చిన్నయ్య | 60 | 60 | 60 | 60 | [illegible] | 2 | - | - |
| 8 | 63/అ 1 | పట్టా | మెట్ట | 0-12 | బోడ కనకప్ప తండ్రి రామప్ప | 63 | 63 | 63 | 63 | - | - | - | - |
| 9 | 63/అ 1 | పట్టా | మెట్ట | 0-12 | పట్టాదారుడు :- బోడ కనకప్ప తండ్రి రామప్ప కాస్తుదారుడు :- బోడ వెంకటప్పా తండ్రి రామప్ప | 63 | 63 | 63 | 63 | - | - | - | - |
| 10 | 63/ఆ | పట్టా | మెట్ట | 0-27 | బోడ ఉషనప్ప తండ్రి రామప్ప | 63 | 63 | 63 | 63 | - | - | - | - |
| 11 | 64/అ/ఆ 1/1 | పట్టా | మెట్ట | 0-08 | పి. రాములు తండ్రి గోవిందు | 64 | 64 | 64 | 64 | [illegible] | 2 2 1 | - | - |
| 12 | 64/అ/ఆ2/1 | పట్టా | మెట్ట | 0-12 | వెంకటప్ప తండ్రి గోవిందు | 64 | 64 | 64 | 64 | | - | పైప్ లైన్ | - |
| 13 | 64/ఆ/అ/1 | పట్టా | మెట్ట | 0-11 | పుట్టపాక్ తిప్పన్న తండ్రి ఎంకప్ప | 64 | 64 | 64 | 64 | మామిడి వేప టేకు | 29 1 2 | బోర్ | - |
| 14 | 64/అ/1 | పట్టా | మెట్ట | 0-20 | చెన్నారం విజయ లక్ష్మి భర్త మహిపాల్ రెడ్డి | 64 | 64 | 64 | 64 | - | - | - | - |
| 15 | 65/అ/2 | పట్టా | మెట్ట | 0.01 | బడలి మల్లప్ప తండ్రి బుగ్గప్ప | 65 | 65 | 65 | 65 | - | - | - | - |
| 16 | 65/అ/3 | పట్టా | మెట్ట | 0.01 | బాలరాజు తండ్రి బుగ్గప్ప | 65 | 65 | 65 | 65 | - | - | - | - |
| 17 | 66/ఉ/2 | పట్టా | మెట్ట | 0.26 | పట్టాదారుడు :- గొల్ల ఆశప్ప తండ్రి హన్మంతు కాస్తుదారుడు :- బడలి ఆశమ్మ భర్త రాములు | 66 | 66 | 66 | 66 | - | - | - | - |
| 18 | 66/ఇ | పట్టా | మెట్ట | 0.03 | చాకలి బసప్ప తండ్రి నర్సప్ప | 66 | 66 | 66 | 66 | - | - | - | - |
| 19 | 66/అ | పట్టా | మెట్ట | 0-07 | చాకలి బాలప్ప తండ్రి నర్సప్ప | 66 | 66 | 66 | 66 | - | - | - | - |
| 20 | 66/ఈ | పట్టా | మెట్ట | 0-28 | చాకలి బలరాములు తండ్రి నర్సప్ప | 66 | 66 | 66 | 66 | - | - | - | - |
| 21 | 67/అ/ఆ | పట్టా | మెట్ట | 0.10 | గొల్ల ఉషనప్ప తండ్రి హన్మంతు | 67 | 67 | 67 | 67 | - | - | పైప్ లైన్ | - |
| 22 | 67/ఈ | పట్టా | మెట్ట | 0-05 | వెంకట్ రెడ్డి తండ్రి అనంత్ రెడ్డి | 67 | 67 | 67 | 67 | - | - | - | - |
| 23 | 67/అ/1 | పట్టా | మెట్ట | 0-16 | గొల్ల రామప్ప తండ్రి మల్లప్ప | 67 | 67 | 67 | 67 | - | - | పైప్‌లైన్, బోర్, కరెంట్ స్థంబాలు | 1 1 |
| 24 | 67/అ/అ1 | పట్టా | మెట్ట | 0-20 | కుమ్మరి లక్ష్మ ప్ప తండ్రి శరనప్ప | 67 | 67 | 67 | 67 | మేవ | 1 | పైప్ లైన్ | 1 |
| 25 | 39/అ | పట్టా | మెట్ట | 0.28 | చిన్నమ్మ భర్త నర్సప్ప | 39 | 39 | 39 | 39 | మామిడి వేప చింత | 2 1 1 | - | - |
| 26 | 38/ఋ | పట్టా | మెట్ట | 0-06 | కుమ్మరి రవికుమార్ తండ్రి కుమ్మరి బిచ్చప్ప | 38 | 38 | 38 | 38 | మామిడి | 1 | బోరు | 1 |
| 27 | 38/లు | పట్టా | మెట్ట | 0-24 | కుమ్మరి మొగులప్ప తండ్రి నర్సప్ప | 38 | 38 | 38 | 38 | చింత వేప [illegible] | 2 1 6 | [illegible] | 1 |
| 28 | 38/ఆ | పట్టా | మెట్ట | 0.07 | కుమ్మరి దేవేంద్రప్ప తండ్రి నాగప్ప | 38 | 38 | 38 | 38 | టేకు | 7 | - | - |
| 29 | 38/ఇ/అ | పట్టా | మెట్ట | 0.04 | కుమ్మరి దేవేంద్రప్ప తండ్రి నాగప్ప | 38 | 38 | 38 | 38 | - | - | - | - |
| 30 | 38/లూ/ఆ/1/2 | పట్టా | మెట్ట | 0.07 | కుమ్మరి వెంకటప్ప తండ్రి నాగప్ప | 38 | 38 | 38 | 38 | [illegible] | 6 1 | బోర్లు పైప్ లైన్ | - |
| 31 | 38/ఋ/అ /2/2 | పట్టా | మెట్ట | 0-06 | శ్రీనివాస్ తండ్రి కె.నారాయణ | 38 | 38 | 38 | 38 | మామిడి | 1 | బోర్లు పైప్ లైన్ | - |
| 32 | 37/ఉ/అ2 | పట్టా | మెట్ట | 0.05 | కుమ్మరి రవికుమార్ తండ్రి బిచ్చప్ప | 37 | 37 | 37 | 37 | - | - | - | - |
| 33 | రోడ్ | , | , | 0-01 | రోడ్ | 38 | 38 | 38 | 38 | - | - | - | - |
| 34 | 75/ఈ /1 | పట్టా | మెట్ట | 0.02 | కుమ్మరి బిచ్చప్ప తండ్రి బాలప్ప | 75 | 75 | 75 | 75 | - | - | పైప్ లైన్ | - |
| 35 | 75/ఉ/అ | పట్టా | మెట్ట | 0.21 | కుమ్మరి బిచ్చప్ప తండ్రి బాలప్ప | 75 | 75 | 75 | 75 | - | - | - | - |
| 36 | 75/ఉ/ఆ | పట్టా | మెట్ట | 0-07 | కుమ్మరి నారాయణ తండ్రి బాలప్ప | 75 | 75 | 75 | 75 | - | - | పైప్ లైన్ | - |
| 37 | 75/ఇ | పట్టా | మెట్ట | 0-13 | దేవేంద్రప్ప తండ్రి నాగప్ప | 75 | 75 | 75 | 75 | - | - | పైప్ లైన్ | - |
| 38 | 77/ఉ | పట్టా | మెట్ట | 1.00 | బర్ల బసప్ప తండ్రి యెల్లప్ప | 77 | 77 | 77 | 77 | టేకు | 2 | పైప్‌లైన్ కరెంట్ స్థంబం | - |
| 39 | 77/ఆ/ఆ | పట్టా | మెట్ట | 0.14 | మహిబూబ్ తండ్రి Md.హనీఫ్ | 77 | 77 | 77 | 77 | వేప [illegible] | 1 1 | పైప్ లైన్ | - |
| 40 | 77/ఆ | పట్టా | మెట్ట | 0.08 | బర్ల కనకప్ప తండ్రి బసప్ప | 77 | 77 | 77 | 77 | - | - | - | - |
| 41 | 76/ఉ/అ1 | పట్టా | మెట్ట | 0.03 | ఉల్లిగుండం శివానంద్ తండ్రి యెంకప్ప | 76 | 76 | 76 | 76 | [illegible] | 2 | - | - |
| 42 | 76 | , | , | 0.02 | రోడ్ | 76 | 76 | 76 | 76 | - | - | - | - |
| 43 | 80/ఆ/1 | పట్టా | మెట్ట | 0.04 | జగపతి రెడ్డి తండ్రి హన్మి రెడ్డి | 80 | 80 | 80 | 80 | - | - | పైప్‌లైన్ కరెంట్ స్థంబం | 1 |
| 44 | 79/ఉ | పట్టా | మెట్ట | 0.07 | జగపతి రెడ్డి తండ్రి హన్మి రెడ్డి | 79 | 79 | 79 | 79 | - | - | - | - |
| 45 | 79/ఉ 1/1 | పట్టా | మెట్ట | 0.10 | వెంకట్ రెడ్డి తండ్రి హన్మి రెడ్డి | 79 | 79 | 79 | 79 | - | - | పైప్ లైన్ | - |
| 46 | 79/రూ | పట్టా | మెట్ట | 0.02 | ఎన్.వెంకటప్ప తండ్రి నర్సప్ప | 79 | 79 | 79 | 79 | మామిడి వేప వేప విప్ప | 1 1 2 2 | రాతి పలక | 80 అడుగులు |
| 47 | 79/ఋ/1 | పట్టా | మెట్ట | 0.02 | ఎన్.రాములు తండ్రి చిన్న నర్సప్ప | 79 | 79 | 79 | 79 | వేప విప్ప మామిడి [illegible] | 2 2 1 1 | - | - |
| 48 | 79/అ | పట్టా | మెట్ట | 0.18 | రఘుపతి రెడ్డి తండ్రి ఆశి రెడ్డి | 79 | 79 | 79 | 79 | - | - | పైప్ లైన్ | - |
| 49 | 81/అ/2/1 | పట్టా | మెట్ట | 0.06 | సైదమ్మ భర్త సందప్ప | 81 | 81 | 81 | 81 | విప్ప [illegible] చింత | 1 1 1 | పైప్ లైన్ | - |
| 50 | 81/ఆ 1 | పట్టా | మెట్ట | 0-08 | నీలమొల్ల బుగ్గప్ప తండ్రి ఆశన్న | 81 | 81 | 81 | 81 | - | - | - | - |
| 51 | 81/లు/అ /1 | పట్టా | మెట్ట | 0.17 | నీలమొల్ల నర్సప్ప తండ్రి నర్సప్ప | 81 | 81 | 81 | 81 | [illegible] | 2 2 1 | పైప్ లైన్ | - |
| 52 | 81/ఋ | పట్టా | మెట్ట | 0.13 | శ్రీనివాస్ తండ్రి బుగ్గప్ప | 81 | 81 | 81 | 81 | [illegible] | 1 1 | - | - |
| 53 | 81/ఐ/1 | పట్టా | మెట్ట | 0-06 | బుర్ర లక్ష్మ మ్మ భర్త నర్సప్ప | 81 | 81 | 81 | 81 | - | - | - | - |
| 54 | 87/లు/అ /1/1 | పట్టా | మెట్ట | 0.09 | మనెమ్మ భర్త భీమప్ప | 87 | 87 | 87 | 87 | - | - | - | - |
| 55 | 87/ఋ/ఆ | పట్టా | మెట్ట | 0.02 | యేసురత్నం తండ్రి మాణిక్యప్ప | 87 | 87 | 87 | 87 | - | - | - | - |
| 56 | 90/ఋ/ఆ | పట్టా | మెట్ట | 0.05 | బొప్పాలి రాజప్ప తండ్రి బుగ్గప్ప | 90 | 90 | 90 | 90 | - | - | - | - |
| 57 | 90/1 | పట్టా | మెట్ట | 0.08 | దొడ్డి వెంకటప్పా తండ్రి బుగ్గప్ప | 90 | 90 | 90 | 90 | - | - | పైప్ లైన్ | - |
| 58 | 89/ఎ/ఇ | పట్టా | మెట్ట | 0.06 | యెర్ర పెద్ద నర్సప్ప తండ్రి తమ్మన్న | 89 | 89 | 89 | 89 | - | - | - | - |
| 59 | 89/ఎ/ఆ | పట్టా | మెట్ట | 0.06 | యెర్ర చిన్న నర్సప్ప తండ్రి తమ్మన్న | 89 | 89 | 89 | 89 | - | - | - | - |
| 60 | 89/ఈ1/1 | పట్టా | మెట్ట | 0.06 | యెర్ర నర్సప్ప తండ్రి కర్రెప్ప | 89 | 89 | 89 | 89 | - | - | - | - |
| 61 | 89/ఎ/అ | పట్టా | మెట్ట | 0.10 | యెర్ర శాంతమ్మ భర్త మొగులప్ప | 89 | 89 | 89 | 89 | - | - | - | - |
| 62 | 89/ఈ2 | పట్టా | మెట్ట | 0.06 | అంజప్ప తండ్రి యెర్ర భీమప్ప | 89 | 89 | 89 | 89 | - | - | - | - |
| 63 | 89 | పట్టా | మెట్ట | 0.13 | పట్టాదారుడు :- హరి జన్ నర్సప్ప తండ్రి బసప్ప కాస్తుదారుడు :- మహేంద్రమ్మ భర్త సిద్దప్ప | 89 | 89 | 89 | 89 | - | - | - | - |
| 64 | 88/ఆ | [illegible] | మెట్ట | 0.11 | సంధ్య భర్త అంజనెయులు | 88 | 88 | 88 | 88 | - | - | - | - |
| 65 | 88/8 | [illegible] | మెట్ట | 0.08 | యెర్ర నర్సమ్మ భర్త హన్మన్న | 88 | 88 | 88 | 88 | [illegible] | 2 1 | - | - |
| 66 | 88/13 | [illegible] | మెట్ట | 0.06 | యెర్ర సుశీలమ్మ భర్త తమప్ప | 88 | 88 | 88 | 88 | - | - | - | - |
| 67 | 88/11 /1 | [illegible] | మెట్ట | 0.06 | యెర్ర కిష్టమ్మ భర్త నర్సప్ప | 88 | 88 | 88 | 88 | - | - | - | - |
| 68 | 88/11 /2 | [illegible] | మెట్ట | 0.10 | యెర్ర అంజప్ప తండ్రి నర్సప్ప | 88 | 88 | 88 | 88 | - | - | - | - |
| 69 | 5/ఇ | [illegible] | మెట్ట | 0.12 | కావలి చిన్న నర్సప్ప తండ్రి నర్సప్ప | 5 | 5 | 5 | 5 | - | - | - | - |
| 70 | 5/ఋ 2/1 | [illegible] | మెట్ట | 0-08 | శేకర్ తండ్రి చిన్న నర్సప్ప | 5 | 5 | 5 | 5 | - | - | - | - |
| 71 | 5/ఉ | [illegible] | మెట్ట | 0-01 | కిష్టమ్మ భర్త ఈడిగి బాలప్ప | 5 | 5 | 5 | 5 | - | - | - | - |
| 72 | 5/ఆ | [illegible] | మెట్ట | 0.03 | సాయమ్మ భర్త పెద్ద నర్సప్ప | 5 | 5 | 5 | 5 | - | - | - | - |
| మొత్తం | | | | ఎ.17.17 గుంటలు | | | | | | | | | |

30/2013 చట్టంలోని u/s 15 అందించిన విధంగా ఆసక్తి గల వ్యక్తుల అభ్యంతరాలను విన్న తర్వాత మరియు తగిన విచారణ తర్వాత ఈ ప్రకటన చేయబడింది. భూసేకరణ వల్ల ఎలాంటి కుటుంబాలు పునరావాసం పొందే అవకాశం లేదు.

ఈ భూమి కింద ఉన్న బొగ్గు, ఇనుప రాయి, స్లేట్ లేదా ఇతర ఖనిజాల గనులు లేదా పేర్కొన్న భూమిలోని ఏదైనా నిర్దిష్ట భాగం తప్ప, భూమిని సేకరించే ఉద్దేశ్యంతో ప్రాజెక్ట్ నిర్మాణ దశలో తవ్వడానికి లేదా తొలగించడానికి లేదా ఉపయోగించాల్సిన గనులు మరియు ఖనిజాల భాగాలు తప్ప, అవసరం లేదు.

నారాయణపేటలోని భూ సేకరణ అధికారి &రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో ఏదైనా పని రోజున భూమి యొక్క ప్రణాళికను తనిఖీ చేయవచ్చు. పునరావాసం మరియు పునస్థాపన యొక్క సారాంశం శూన్యం.

సం/- భూసేకరణ అధికారి& రాజస్వ మండలాధికారి నారాయణపేట
సం/- అదనపు కలెక్టర్(రెవెన్యూ) నారాయణపేట
సం/- జిల్లా కలెక్టర్ నారాయణపేట

DIPR RO NO. 312/LA/PP/Advt/Pub/2025-26

ప్రజాపక్షం
బుధవారం, 25 జూన్

# రైతు చుట్టూ రాజకీయాలు

తెలంగాణ రాష్ట్రంలో రైతు చుట్టూ రాజకీయాలు సాగుతున్నాయి. వ్యవసాయాన్ని పండగ చేసిందెవరు? నువ్వా–నేనా అని కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య సవాళ్లు–ప్రతి సవాళ్లు నడుస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి సంవత్సరంలోనే ఎన్నికల వాగ్దానం మేరకు రూ.2 లక్షల వరకు వ్యవసాయ రుణమాఫీ రూ.20,600 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసి సాటిలేని రికార్డు నెలకొల్పింది. రైతుకు పెట్టుబడి సహాయం 'రైతు భరోసా' (పాత రైతు బంధు) తొలి కిస్తి ఎకరాకు రూ.6వేల చొప్పున 9 రోజుల్లో 9వేల కోట్ల రూపాయలను 70 లక్షల రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన ఘనతను రేవంత్ రెడ్డి ప్రభుత్వం మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా విజయోత్సవంగా పాటించింది. జిల్లా, మండల కేంద్రాల్లో రైతు సభలు నిర్వహించి తమ ప్రభుత్వం రైతుల కోసం 18 మాసాల్లో రూ.1.04లక్షల కోట్లు ఖర్చు చేసిన వైనాన్ని వివరిస్తూ కాంగ్రెస్ పార్టీకి రైతుల మద్దతు కోరింది. ఇది ఓర్వలేని బిఆర్ఎస్ ముఖ్య నేత హరీశ్ రావు కాంగ్రెస్ వైఫల్యాలంటూ ఒక దండకం చదివి, విజయోత్సవ సభలకు ముందు ముఖ్యమంత్రి రైతులకు క్షమాపణ చెప్పాలన్నారు. రైతు సంక్షేమం కోసం పుట్టిన పార్టీ తమ బిఆర్ఎస్ మాత్రమేనన్నారు. అయితే రూ.1 లక్ష రుణమాఫీని రైతులందరికీ అమలు చేయడానికి రెండేళ్లకు పైగా సమయం తీసుకుని కూడా పూర్తి చేయని ఘనత కూడా కెసిఆర్‌దే. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ రుణమాఫీ ఖాతాలకు వడ్డీ కింద రూ.8 వేలు కట్టినట్లు కాంగ్రెస్ చెబుతుంది. దాన్ని బిఆర్ఎస్ ఖండించలేదు. పంట బీమాను గొప్పగా ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసిన ఘనత కూడా కేసీఆర్‌దే. వరి వేయవద్దు–వరిపైరు వేస్తే ఉరి వేసుకున్నట్లే అని ప్రవచించిందీ ఆయనే. తొమ్మిదేళ్ల పరిపాలనలో ఆయన అవసరం కొద్దీ ఆపద్ధర్మంగా అట్టహాసంగా ప్రారంభించి మధ్యలో వదిలేసిన పథకాలు చాలానే ఉన్నాయి. అందులో హుజురాబాద్ ఉప ఎన్నికలో ఈటెల రాజేంద్రను ఓడించే ధ్యేయంతో ప్రకటించిన 'దళిత బంధు' ప్రత్యేకించి పేర్కొనదగింది. దళితుణ్ణి ముఖ్యమంత్రిని చేసి తాను మార్గదర్శిగా ఉంటానన్న వాగ్దానాన్ని, దళితులకు మూడెకరాల భూ పంపిణీని ఆదిలోనే తుంగలో తొక్కిందీ ఆయనే కదా!

బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర అప్పులను దాదాపు రూ.8 లక్షల కోట్లకు చేర్చి ఖాళీ ఖజానాను అప్పుల భారంతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి అప్పగించింది. అధికారం కోసం పలు డిక్లరేషన్లతో ప్రజలకు అలవిమాలిన వాగ్దానాలు చేసిన కాంగ్రెస్ పార్టీ వాటి అమలుకు నానా అవస్థలు పడుతూ ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నది. ముఖ్యంగా వ్యవసాయరంగానికిచ్చిన ప్రాధాన్యత ఎన్నదగినది. సంవత్సరంలోనే రైతు రుణమాఫీకి దాదాపు రూ.21 వేల కోట్లు ఖర్చు చేయడం తలకు మించిన భారం. దాన్ని ఎవరైనా మెచ్చుకోవాల్సిందే. అయితే రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతున్న బిఆర్ఎస్, బిజెపిలు ప్రభుత్వాన్ని ఆడిపోసుకోవడం, ఏ పథకం చేబట్టినా మోకాలడ్డటం, దుష్ప్రచారం చేయడం దిన కార్యక్రమంగా పెట్టుకున్నాయి. కేసీఆర్ అపర భగీరథునిగా రూ.1 లక్ష కోట్ల అప్పు తెచ్చి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజీ బిఆర్ఎస్ అధికారంలో ఉండగానే దెబ్బతినడం, అవినీతి ఆరోపణలు చుట్టుముట్టడం ఆ పార్టీకి పెద్ద మైనస్ అయింది. బుకాయింపులతో నెట్టుకు రాలేకపోయింది. ఇప్పుడు అందరూ జస్టిస్ ఘోష్ విచారణ కమిషన్ నివేదిక కోసం ఆసక్తితో ఎదురుచూస్తోంది.

కాంగ్రెస్ పార్టీ అదృష్టం కొద్దీ, కాళేశ్వరం నీరు అందుబాటులోకి రాకపోయినా గత వ్యవసాయ రుతువులో రెండు పంటకాలాల్లో దిగుబడులు రికార్డు సృష్టించాయి. వరి ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణను దేశానికి తలమానికంగా నిలిపాయి. ఆ ఉత్పత్తి మొత్తాన్ని ప్రభుత్వం విజయవంతంగా కొనుగోలు చేయడమే గాక, సన్న బియ్యం పంటకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ ప్రకటించింది. రైతుల మోములో చిరునవ్వులు పండించింది. వ్యవసాయం దండగ కాదు పండగ అని నిరూపించింది. కాబట్టి రైతు భరోసా చెల్లింపులో మరో రికార్డు నెలకొల్పిన రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి 'విజయోత్సవం' జరుపుకునే అర్హత ఉంది. ఈ సందర్భంగా తెలంగాణ రైతాంగానికి, రాష్ట్ర ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలియజేద్దాం!

# బనకచర్లతో రెండు రాష్ట్రాల మధ్య చిచ్చుపెడుతున్న కేంద్రం



ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణానది జలాల పంపిణీపై తాగాదా నడుస్తుంటే సమస్యను పరిష్కరించకపోగా.. ఇప్పుడు బనకచర్ల ద్వారా గోదావరి నీటి తరలింపునకు ఎపి చేస్తున్న కుట్రలకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో మరో తాగాదాకు తెర లేపుతున్నది.

2014లో అమలులోకి వచ్చిన ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం రెండు రాష్ట్రాల మధ్య నీటివినియోగానికి సంబంధించి ఏవైనా ప్రాజెక్టులు ప్రారంభించడానికి కేంద్ర అనుమతులతో పాటు అపెక్స్ కౌన్సిల్ అంగీకారం తప్పనిసరి. రెండవది, ఈ లింక్ ప్రాజెక్టు వల్ల గోదావరిలో ప్రవాహం తగ్గి తెలంగాణలోని ములుగు, భూపాలపల్లి, మణుగూరు ప్రాంతాలలో పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంతో వరద ముప్పు పెరిగే అవకాశం ఉంది. మూడవది, కృష్ణా జలాలపై ఇప్పటికి అన్యాయం జరుగుతుంటే, మరింత నీటిని డైవర్ట్ చేయడం అన్యాయమని తెలంగాణ అభిప్రాయం. నాల్గవది, కేంద్రం నిష్పక్షపాతంగా వ్యవహరించకపోవడం వల్లే ఎపికి కొంత ధైర్యం వచ్చినట్లు.. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటి పారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావు ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా తప్పు పట్టారు. స్పష్టమైన వైఖరి ప్రకటించారు. ఇది తెలంగాణ రాష్ట్ర హక్కులపై దాడిగా పేర్కొంటూ కేంద్రానికి పలుమార్లు విజ్ఞప్తులు చేశారు. ఇప్పటికీ కేంద్ర జల వనరుల మంత్రికి, గోదావరి నది నిర్వహణ మండలికి, జలశక్తి మంత్రిత్వ శాఖకు లేఖలు పంపారు.

> ఉమ్మడి ఎపి రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలలో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతోందని తెలంగాణ ప్రజలు ఉద్యమించి తెలంగాణ రాష్ట్రం సాధించుకున్నప్పటికీ.. గత దశాబ్ద కాలంగా కృష్ణా, గోదావరి నదీ జలాల పంపిణీలో నేటికీ అసమానతలు కొనసాగుతూనే ఉన్నాయి. రాష్ట్రాల విభజన చట్టంలో పొందుపరచుకున్న ప్రధాన నీటి పంపకాలను నేటికీ పరిష్కరించకపోవడం.. పరిష్కారానికి పెద్దన్న పాత్ర వహించవలసిన కేంద్ర ప్రభుత్వం పక్షపాతిగానే వ్యవహరించుతున్నది. కృష్ణా జలాలపైన కృష్ణానది మేనేజ్మెంట్ బోర్డు, గోదావరి జలాలపైన గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు ఉన్నప్పటికీ ప్రధాన నీటి కేటాయింపులు నేటికీ పరిష్కారం కాకుండా కొనసాగుతున్న పరిస్థితి.

కృష్ణా జలాల వినియోగంపై వివాదం కొనసాగుతుండగానే.. గోదావరి జలాలను బనకచర్ల ద్వారా రాయలసీమ ప్రాంతం నీటి అవసరాలు తీర్చటం లక్ష్యంగా కృష్ణా నదిపై ఉన్న సంజీవయ్య సాగర్(వెలుగోడు జలాశయం) వద్ద నుండి నీటిని ఎత్తిపోసి ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు సాగునీటిగా వినియోగించాలనే ఉద్దేశంతో రూపొందించబడింది. ఈ ప్రాజెక్టు ద్వారా నెల్లూరు, ప్రకాశం, కడప జిల్లాలో కొత్తగా 7.4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడంతోపాటు, ఇప్పటికే సాగులో ఉన్న 22.6 లక్షల ఎకరాలకు స్థిరీకరణ చేయనున్నారు.

**పోలవరం-బనకచర్ల ఎత్తిపోతల పథకం:**

మూడు దశల్లో గోదావరి–బనకచర్ల అనుసంధానం చేపట్టనున్నట్లు ఎపి ప్రభుత్వం ప్రతిపాదనలో పేర్కొంది. మొదటి దశలో పోలవరం నుంచి కృష్ణా నదికి జలాలు మళ్లిస్తారు. ఇందుకోసం పోలవరం కుడి కాలువ సామర్థ్యాన్ని పెంచుతారు. ప్రస్తుతం కుడి కాలువ సామర్థ్యం 17,500 క్యూసెక్కులు ఉండగా, దాన్ని 38,000 క్యూసెక్కులకు పెంచుతారు. కొత్తగా 25 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో పోలవరం కుడి కాలువ వరకు సమాంతరంగా వరద కాలువ త్రవ్వుతారు. రెండో దశలో కృష్ణానది నుంచి నాగార్జున సాగర్ కుడి కాలువలో 80వ కిలోమీటర్ వద్ద నీటిని కలుపుతారు. ఈ కాలువను, 80 కిలోమీటర్ల నుంచి 96.5 కిలోమీటర్ల వరకు సామర్థ్యాన్ని పెంచి జలాలను తరలిస్తారు. మూడో దశలో బొల్లాపల్లి రిజర్వాయర్ నుంచి నల్లమల అరణ్యం మీదుగా బనకచర్ల రెగ్యులేటర్‌కు తరలిస్తారు. ఇందుకోసం నల్లమల అడవుల్లో 26.8 కిలోమీటర్ల మేర సొరంగం ద్వారా నీటిని మళ్లిస్తారు.

మొత్తంగా తొలిదశ పనులకు రూ.13,511 కోట్లు, రెండోదశ పనులకు రూ.28,560 కోట్లు, మూడోదశ పనులకు రూ.38,041 కోట్లు మొత్తంగా రూ.80,112 కోట్ల వ్యయం అవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందుకోసం 48 వేల ఎకరాల భూ సేకరణ జరుపుతున్నారు. ఇందులో 17 వేల ఎకరాల అటవీ భూమి కూడా ఉంది. ఈ బనకచర్ల ప్రాజెక్టులో నీటిని ఎత్తిపోసేందుకు 4 వేల మెగావాట్ల విద్యుత్తు అవసరమని ప్రభుత్వం ఆ నివేదికలో పేర్కొంది.

దీనికి ఎపి ప్రభుత్వం చేస్తున్న వాదనలు ప్రతి సంవత్సరం గోదావరి నది నుండి సగటున 3000 టిఎంసీల నీరు వరదల సమయంలో సముద్రంలో కలుస్తున్నవని.. ఇందులో 200 టీఎంసీలను వరద సమయంలో మళ్లించాలనేది ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశంగా ఎపి ప్రభుత్వం చెప్తున్నది. ఈ మేరకు కేంద్ర జలశక్తి శాఖకు ఏపీ ప్రభుత్వం నివేదిక ఇచ్చింది. దీనికి ప్రధానమంత్రి కృషి సంచాయ యోజన (పిఎంకెఎస్‌వై), యాక్సిలరేటర్ ఇరిగేషన్ బెనిఫిట్స్ ప్రోగ్రాం (ఏఐబిపి) కింద సహాయం అందించాలని కోరుతూ కేంద్రానికి చంద్రబాబు విజ్ఞప్తి చేశారు. ఇంట్రా స్టేట్ లింక్ (రాష్ట్ర పరిధిలో అనుసంధానం) ప్రాజెక్టు కింద నిధులు ఇవ్వాలని కోరారు. దీనిపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో కూడా సీఎం చర్చించారు.

**సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధం**

నదీ జలాలను పంచుకునే విషయంలో సంబంధిత రాష్ట్రాల మధ్య పరస్పర అవగాహన ఉండాలి. జలాల సమాచారం పారదర్శకంగా ఉండాలి. జల వివాదాలను పరిష్కరించడానికి సమగ్ర విధానాన్ని అనుసరించాలి. కానీ, వీటన్నింటినీ పట్టించుకోకుండా కేంద్రంలో బలం ఉంది కదా అని, కేంద్రానికి ఏపీ మద్దతు ఉందని, ఏ విధంగానైనా అనుమతులు పొందాలని, అదేవిధంగా నిధులు రాబట్టుకోవాలని ఏపీ ప్రయత్నాలు మొదలుపెట్టింది. పర్యావరణ అనుమతులు, కేంద్ర జల కమిషన్(సిడబ్ల్యూసి), గోదావరి నది నిర్వహణ మండలి(జిఆర్ఎంబి), రెండు రాష్ట్రాల సమన్వయ సంస్థ అయిన అపెక్స్ కౌన్సిల్ నుండి ఎలాంటి అంగీకారం లేకుండానే ఏపీ ఈ ప్రాజెక్టును చేపట్టింది. దీనిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరాలను చెప్పింది.



బనకచర్లపై ఎపి, కేంద్రం కొత్త ఎత్తుగడ కేంద్ర ప్రభుత్వం నదుల అనుసంధానాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. దీనిపై ఇప్పటికే ఆరు మీటింగులు నిర్వహించినా సభ్య రాష్ట్రాల మధ్య అంగీకారం కుదరడం లేదు. తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తుంది. ఎపి ఇప్పటికే గోదావరి నీళ్లను (పోలవరం నుంచి) తరలించేందుకు నిర్మించిన పట్టిసీమ నుంచి లింక్ కెనాల్ ప్రాజెక్టును చేపట్టాలని ప్రతిపాదిస్తూ వస్తున్నది. ఈ నేపథ్యంలోనే గోదావరి, సోమశిల, కావేరి లింకుతో కొత్త కుట్రలకు ఎపి, కేంద్రం పాల్పడుతున్నాయన్న వాదన బలంగా వినిపిస్తున్నది. అయితే, దానికన్నా ముందు జిబి లింకును పూర్తి చేస్తే.. తొలి దశలో జీబీ లింకు ద్వారానే తమిళనాడుకు నీటిని అందించవచ్చు అన్న ప్రతిపాదన కేంద్రం ముందుకు ఏపీ పెట్టినట్లు.. జిబి లింకుతో బనకచర్ల వరకు నీటిని తీసుకెళ్లే అవకాశం ఉంది కాబట్టి.. అక్కడి నుంచి ఎలాగూ సోమశిలకు నీటిని తరించవచ్చునని, అక్కడి నుంచి కావేరికి లింకు చేసుకోవచ్చన్న ప్రతిపాదనను కేంద్రం వద్ద పెట్టినట్లు సమాచారం. ఈ రెండు ప్రాజెక్టులను పూర్తి చేస్తే ఇటు ఎపి రాయలసీమకు నీటిని దొడ్డిదారిలో తలించేందుకు రెండు వైపులా అవకాశాలు ఏర్పడుతాయి. దీనికి నిధులను కూడా కేంద్రం నుంచి రాబట్టవచ్చుననే గోదావరి బనకచర్ల (జిబి) లింకు ప్రాజెక్టును ఎపి ప్రతిపాదించినట్లయింది.

1980లో ఏర్పడిన గోదావరి జలాల పంపిణీ విచారణ ట్రిబ్యునల్ (జిడబ్ల్యుడిటి) తీర్పు ప్రకారం, ఏ ఒక్క రాష్ట్రం కూడా ఇతర రాష్ట్ర అంగీకారం లేకుండా గోదావరి నీటిని వేరే బేసిన్‌కు తరలించలేదు. ఇది న్యాయపరంగా మాత్రమే కాదు, సాంకేతికంగా, పర్యావరణపరంగా కూడా తీవ్ర పరిణామాలను కలిగించే అంశం. ఎత్తిపోతల ద్వారా 250 మీటర్ల ఎత్తువరకు నీటిని తరలించాలి. అందుకోసం విద్యుత్ వినియోగం, పారిశ్రామిక నిర్మాణం, బ్యాక్ వాటర్ ప్రభావం వంటి అంశాలు వివరంగా పరిశీలించాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు డిపిఆర్ గానీ, పర్యావరణ ప్రభావము వంటి కీలక నివేదికలు అందుబాటులో లేవు. ఇక కేంద్రం పాత్ర విషయానికి వస్తే ఇది ఇప్పటికీ స్పష్టత ఇవ్వకుండా రెండు రాష్ట్రాలకు మధ్య వివాదాన్ని పెంపొందించేలా వ్యవహరిస్తుంది. రెండు రాష్ట్రాలు ఒకే నదిని పంచుకుంటున్నప్పుడు కేంద్రం నిష్పక్షపాత ధోరణితో మెలగాల్సిన, వ్యవహరించాల్సిన అవసరం ఉంది. కానీ ప్రస్తుతం కనిపిస్తున్న పరిణామాలు రాజకీయ పక్షపాతం, ప్రాంతీయ ఒత్తిళ్లకు లోనవుతున్నట్టు అనిపిస్తుంది. తెలంగాణ ప్రయోజనాలకు గండి కొట్టేలా గోదావరి జలాలను దోచుకెళ్లేందుకు వ్యూహం పన్నుతున్నాయి.

**రెండురాష్ట్రాలకు సమన్యాయంగా ఉండాలి**

కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలు అమలు చేయకుంటే రెండు రాష్ట్రాలకు మధ్య సంఘర్షణ కొనసాగే అవకాశం ఉంది. జలాలపై సమన్వయ, పారదర్శకత, న్యాయబద్ధమైన వాటా నిర్ణయాలు కేంద్రం ద్వారా తీసుకోవడం అత్యవసరం. రాష్ట్రాలు పరస్పరం నమ్మకం కలిగి పరిష్కారం మార్గాలను అన్వేషించాల్సిన అవసరం అనివార్యంగా ఉన్నది. బనకచర్లపై ఎపి సీఎం చంద్రబాబు తీరు సరికాదు. వృధాగా పోతున్న వరద జలాలను ఉపయోగించుకోవాలనుకుంటే.. ముందు తెలంగాణ ప్రభుత్వంతో చర్చించాలి, తెలంగాణకు నీటి వాటాను తేల్చి.. ప్రాజెక్టులకు అభ్యంతరాలు చెప్పకుండా.. రెండు రాష్ట్రాలు సమన్వయంతో సమస్యలు పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్లాలి.. తెలంగాణ ప్రభుత్వం పొరుగు రాష్ట్రంతో వివాదాలు కోరుకోవడం లేదని, 'ఇరు రాష్ట్రాల మధ్య నీటి పంచాయతీలు వద్దనేది తమ విధానం' అని.. ఏపీ ముఖ్యమంత్రి తెలంగాణతో చర్చలకు రావాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరుకుంటున్నారు.. ఇచ్చిపుచ్చుకునే విధంగా ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నారు.. స్వాగతిద్దాం!

# స్థానిక స్వపరిపాలన పట్ల తగని నిర్లక్ష్యం

ప్రజాస్వామ్య వికేంద్రీకరణ లక్ష్యంతో గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు, మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్‌ల ఎన్నికలు స్థానికంగా ప్రభుత్వ పాలనను బలోపేతం చేయడానికి జరుగుతాయి. ఈ స్థానిక ఎన్నికల నేపథ్యం రాజ్యాంగంలోని 73వ, 74వ సవరణలపై ఆధారపడి ఉంది. 1992లో ఈ సవరణల ద్వారా గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థలకు రాజ్యాంగ హోదా లభించింది, వీటి ద్వారా స్థానిక స్వపరిపాలన, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు చట్టబద్ధమైన వేదిక ఏర్పడింది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఈ సంస్థలు రాష్ట్ర చట్టాలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించబడ్డాయి. పంచాయతీ రాజ్ చట్టం, మున్సిపల్ చట్టాల ద్వారా ఎన్నికల నిర్వహణ, రిజర్వేషన్లు, అధికారాలు నిర్దేశించబడ్డాయి. ప్రస్తుతం తెలంగాణలో 12,769 గ్రామ పంచాయతీలు, ఐదు వేలకు పైగా ఎంపిటిసి, ఐదు వందలకు పైగా జెడ్పిటిసి స్థానాలు, 129 మున్సిపాలిటీలు, 13 మున్సిపల్ కార్పొరేషన్‌లు ఉన్నాయి.

గత ఏడాది జరగాల్సిన స్థానిక ఎన్నికలు పలు కారణాల రీత్యా వాయిదా పడుతూ వచ్చాయి. ఆయా స్థానాల్లో ఇంకా రిజర్వేషన్లు ఖరారు కావాల్సి ఉంది. కాంగ్రెస్ పార్టీ అధికారాన్ని చేపట్టిన తర్వాత జరిగే మొదటి స్థానిక ఎన్నికలు ఇవి. గత ఏడాదిన్నర పాలనకు రిఫరెండంగా అధికార పార్టీ భావిస్తూ ఉంటే, ప్రభుత్వంపై వ్యతిరేకత తమకు అనుకూలంగా ఉంటుందని ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు భావిస్తూ ఉన్నాయి. అన్ని పార్టీలకు స్థానిక ఎన్నికలు కీలకంగా మారాయి.

రాష్ట్రంలో ప్రధానంగా కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి మధ్య త్రిముఖ పోటీ నెలకొంది. ఎంఐఎం ప్రస్తుతానికి పాత బస్తీకే పరిమితమైనప్పటికీ ముస్లిం ఓటు బ్యాంక్ గణనీయంగా ఉన్న మున్సిపాలిటీ, మున్సిపల్ కార్పొరేషన్లలో ఈ మూడు ప్రధాన పార్టీల గెలుపోటముల్ని ప్రభావితం చేసే స్థాయిలో ఉంది. 2023 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ 64 సీట్లతో అధికారంలోకి రాగా, బీఆర్ఎస్ 39 సీట్లతో ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. బిజెపి 8 సీట్లకి పరిమితమైనప్పటికీ, 2024 లోక్‌సభ ఎన్నికల్లో 8 సీట్లు గెలుచుకొని బలీయమైన శక్తిగా ఎదిగింది. స్థానిక ఎన్నికలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పార్టీల బలాబలాల్ని పరీక్షించే అవకాశంగా చెప్పవచ్చు. గ్రామ పంచాయతీల ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగవు కాబట్టి వ్యక్తిగత ప్రభావం, స్థానిక సామాజిక సమీకరణాలు కీలకంగా మారతాయి, అయితే ఎంపిటిసి, జెడ్పిటిసి, మున్సిపాలిటీల ఎన్నికలు పార్టీ గుర్తులపై జరగడం వల్ల పార్టీల రాజకీయ ఆధిపత్యాన్ని ప్రతిబింబిస్తాయి.

గత ఏడాదిన్నర నుండి కాంగ్రెస్ ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్ని అమలు చేస్తూ ఉంది. దాదాపు 21 వేల కోట్లతో 25 లక్షల మంది రైతులకు ఏకకాలంలో రుణ మాఫీ, మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం, రూ.500 కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు భరోసా కింద ఏడాదికి రెండు విడతల్లో ఎకరానికి రూ.12,000, రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు మొదలైన పథకాలు తమకు ఎన్నికల్లో లబ్ధి చేకూరుస్తాయని కాంగ్రెస్ పార్టీ విశ్వసిస్తుంది. జనగణన, బిసిలను 42శాతం రిజర్వేషన్‌ల చట్టం, ఎస్‌సి వర్గీకరణ అదనపు బలంగా భావిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు హామీల అమలులో జాప్యం, లగచర్ల ఘటన, హైడ్రా, మూసీ రివర్‌ఫ్రంట్ వంటి కార్యక్రమాల వల్ల ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందంటూ బిఆర్ఎస్ చెప్తోంది, గతంలో అమలు చేసిన రైతుబంధు, కల్యాణలక్ష్మి వంటి పథకాలతో తన రికార్డును ప్రచారం చేస్తూ, కాంగ్రెస్ హామీల అమలు వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. బీజేపీ, జాతీయ స్థాయిలో దృఢమైన నాయకత్వం, వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాలతో గ్రామీణ ప్రాంతాల్లో పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తోంది.

పార్టీల బలాబలాల విషయానికొస్తే, కాంగ్రెస్ గ్రామీణ ప్రాంతాల్లో బలంగా ఉంది. 2023 శాసనసభ ఎన్నికల్లో సాధించిన స్థానాలు దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. బీఆర్ఎస్ గత పదేళ్ల పాలనలో వివిధ కుల వృత్తులకు చేదోడుగా ఆర్థిక సాయం అందించడం, వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల వల్ల గ్రామ స్థాయిలో బలమైన ఓటు బ్యాంకును సంపాదించుకుంది, కానీ 2023లో అధికారం కోల్పోవడం, అవినీతి ఆరోపణలు పార్టీ ప్రతిష్టను దెబ్బతీశాయి. అసెంబ్లీ ఎన్నికల తదనంతరం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క ఎంపి సీటును కూడా గెలువలేకపోయింది. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీకి కూడా దూరంగా ఉంది. నేటికీ కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్ వంటి కేసులపై విచారణ కొనసాగుతూనే ఉంది. ఇటీవలి కాలంలో జరిగిన పార్టీ రజతోత్సవం గులాబీ శ్రేణుల్లో కొంత జోష్ నింపిందని చెప్పవచ్చు. బీజేపీ ఉత్తర తెలంగాణలో బలపడుతున్నప్పటికీ, గ్రామస్థాయిలో సంస్థాగత బలం పరిమితంగానే ఉంది. కులగణన సర్వేతో పాటు 42% బిసి రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్ చేసిన ప్రయత్నాలు బిసి ఓటర్లను ఆకర్షించే అవకాశం ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణ అవసరం వల్ల ఇది అమలు కాకపోవడంతో రాజకీయంగా ఎవరి వాదనలు వారు వినిపిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీల మధ్య ప్రధాన పోటీ ఉంటే, పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీల మధ్య త్రిముఖ పోటీ ఉంది. స్థానికంగా సామాజిక సమీకరణాలు, ఓటర్ల మనోగతం, పార్టీల వ్యూహాలపై ఫలితాలు ఆధారపడతాయి. ఈ ఎన్నికలు తెలంగాణ రాజకీయ పార్టీల భవిష్యత్తును నిర్దేశించే కీలక ఘట్టంగా నిలువనున్నాయి.

– డాక్టర్.అశోక్ మంద
9959046499

# అందుబాటులోకి మొబైల్ లైబ్రరీలు

స్మార్ట్‌ఫోన్‌లు ఒకప్పుడు పుస్తకాలంత సర్వసాధారణంగా మారిన ఈ యుగంలో, మొబైల్ లైబ్రరీ యాప్‌లు ఒక శక్తివంతమైన మార్పుగా ఆవిర్భవించాయి. జ్ఞాన సంపదను నేరుగా మన జేబుల్లోకి తీసుకొస్తున్నాయి. ఈ డిజిటల్ వేదికలు, ఎప్పుడైనా, ఎక్కడైనా యాక్సెస్ చేయగలిగే సామర్థ్యంతో ఉన్నాయి. మనం సాహిత్యం, పరిశోధన, లేదా ఏ ఇతర అభ్యాసంతో ఎలా సంబంధం కలిగి ఉంటామో అలాగే మార్చివేస్తున్నాయి. ఇకపై లైబ్రరీ అనే స్వరూపం, ఉనికి భౌతిక గోడలకు మాత్రమే పరిమితం కాకుండా, ఒక్క ట్యాప్‌తో ఎనలేని పుస్తకాలు, ఆడియోబుక్‌లు, అనేక విద్యా సంబంధిత వనరులను పాఠకులు అన్వేషించవచ్చు. ఈ సాంకేతికత, సాహిత్య సమ్మేళనం కేవలం సౌలభ్యం మాత్రమే కాదు. ఇది జ్ఞానానికి ప్రజాస్వామ్య యాక్సెస్‌ను ప్రోత్సహించే లక్షణం. జీవితకాల అభ్యాస సంస్కృతిని పెంపొందించే విప్లవం.

మొబైల్ లైబ్రరీ యాప్‌ల ఆకర్షణ వాటి అసమానమైన యాక్సెసిబిలిటీలో ఉంది. సాంప్రదాయ లైబ్రరీలు నిర్దిష్ట పని గంటలు ప్రత్యేక స్థలాలలో పనిచేస్తాయి. కానీ ఈ యాప్‌లు 24/7 అందుబాటులో ఉంటాయి. బిజీగా ఉన్న ప్రొఫెషనల్స్, విద్యార్థులు, పరిశోధకులు, సాధారణ రీడర్స్ రాత్రి, పగలు సమయంలో చదివే వారి షెడ్యూల్‌లకు అనుగుణంగా ఎప్పుడంటే అప్పుడు అందుబాటులో ఉంటాయి. రద్దీగా ఉన్న రైలులో ప్రయాణిస్తున్నా లేదా డాక్టర్ కార్యాలయంలో వేచి ఉన్నా, ఒక లైబ్రరీ యాప్ ఖాళీ క్షణాలను జ్ఞాన సమృద్ధి అవకాశాలుగా మార్చగలదు. ఉదాహరణకు, ఓవర్‌డ్రైవ్ అభివృద్ధి చేసిన 'లిబ్బీ యాప్', స్థానిక పబ్లిక్ లైబ్రరీ కార్డ్‌తో ఈబుక్‌లు, ఆడియోబుక్‌లను అరువుగా తీసుకోవడానికి అనుమతిస్తుంది. న్యూయార్క్‌లోని ఒక పాఠకుడు సబ్‌వేలో ప్రయాణిస్తూ 'చిమమండా ఎన్‌గోజీ అడిచీ' నవలను చదవగలడు, అదే సమయంలో భారతదేశంలోని గ్రామీణ ప్రాంతంలోని ఒక విద్యార్థి తన ఫోన్‌లో విద్యా జర్నల్‌లను యాక్సెస్ చేయగలడు. భౌగోళిక, ఆర్థిక అంతరాలను తగ్గిస్తూ. సాధారణ సౌలభ్యానికి మించి, మొబైల్ లైబ్రరీ యాప్‌లు భౌతిక లైబ్రరీల సేకరణలకు సమానమైన, కొన్నిసార్లు వాటిని అధిగమించే విస్తృత వనరులను అందిస్తాయి. 'హూప్లా', 'స్క్రిబ్డ్' వంటి ప్లాట్‌ఫారమ్‌లు బెస్ట్‌సెల్లర్‌ల నుండి అస్పష్టమైన విద్యాగ్రంథాల వరకు, 'కామిక్స్', 'షీట్ మ్యూజిక్', 'పాడ్‌కాస్ట్‌ల'తో సహా మిలియన్ల కొద్దీ శీర్షికలను అందిస్తాయి. సాధారణ పాఠకుల నుండి పరిశోధకుల వరకు అందరికీ విలువైనది ఏది కావాలో దానిని అడిగిందే తడవుగా 'అక్షయ పాత్ర'లా అందిస్తుంది. ఉదాహరణకు, చరిత్ర పరీక్షకు సిద్ధమవుతున్న ఒక ఉన్నత పాఠశాల విద్యార్థి జోస్టర్ (JSTOR) యాప్ ద్వారా ప్రాథమిక మూల డాక్యుమెంట్‌లను డౌన్‌లోడ్ చేయగలడు. అదే సమయంలో ఒక తల్లిదండ్రులు లాంగ్ డ్రైవ్ సమయంలో తమ బిడ్డను అలరించడానికి 'లిబ్బీ'పై పిల్లల ఆడియోబుక్‌ను స్ట్రీమ్ చేయవచ్చు. అందుబాటులో ఉన్న కంటెంట్ యొక్క విస్తృత సమగ్రతను ప్రోత్సహిస్తుంది. ఈ యాప్‌లను విద్య, వినోదానికి అనివార్య సాధనాలుగా మారుస్తుంది.

అంతేకాకుండా, మొబైల్ లైబ్రరీ యాప్‌లు భౌతిక పుస్తకాలు అందించలేని ఫీచర్ల ద్వారా చదివే అనుభవాన్ని మెరుగుపరుస్తాయి. అనుకూలీకరించదగిన టెక్స్ట్ సైజులు, సర్దుబాటు చేయగల బ్యాక్‌గ్రౌండ్ రంగులు, అంతర్నిర్మిత నిఘంటువులు దృష్టి లోపం లేదా భాషా అడెక్కులు ఉన్న పాఠకులకు యాక్సెసిబిలిటీని ప్రోత్సహిస్తాయి. 'కిండిల్' మరియు 'గూగుల్‌ప్లే బుక్స్' వంటి యాప్‌లు పాఠకుల అభిరుచులకు తగిన భాగాలను 'హైలైట్' చేయడానికి, 'నోట్స్' తీసుకోవడానికి, వారి పురోగతిని ఫోన్, ట్యాబ్, లేదా ఈరీడర్‌లలో సమకాలీకరించడానికి అనుమతిస్తాయి.

మొబైల్ లైబ్రరీ యాప్‌ల సాంస్కృతిక ప్రభావం వ్యక్తిగత పాఠకులను అధిగమిస్తుంది. జ్ఞానాన్ని సార్వత్రికంగా యాక్సెస్ చేయగలిగేలా చేయడం ద్వారా, ఈ యాప్‌లు విద్య, ప్రచురణలలో సాంప్రదాయ గేట్‌కీపింగ్‌ను సవాలు చేస్తాయి. అవి అట్టడుగు స్వరాలను సాధికార పరుస్తాయి, స్వీయప్రచురిత రచయితలకు అలాగే ఓపెన్‌యాక్సెస్ విద్యా రచనలకు వేదికలను అందిస్తాయి. ఇవి బుక్‌స్టోర్ షెల్ఫ్‌లకు ఎప్పటికీ చేరకపోవచ్చు. ఒక గ్రామంలోని రచయిత వాట్‌ప్యాడ్‌పై తమ కథను ప్రచురించి, ప్రపంచవ్యాప్త ప్రేక్షకులను చేరుకోవచ్చు, అదే సమయంలో ఒక పరిశోధకుడు రీసెర్చ్‌గేట్‌పై తమ ఆవిష్కరణలను పంచుకోవడం ద్వారా అంతర్జాతీయ సహకారాన్ని ప్రేరేపించవచ్చు.

సారాంశంగా, మొబైల్ లైబ్రరీ యాప్‌లు కేవలం సాధనాలు మాత్రమే కాదు. అవి జ్ఞానానికి హద్దులు లేని భవిష్యత్తుకు గేట్‌వేలుగా భావించాలి. అవి చదవడం యొక్క శాశ్వత ఆనందాన్ని భర్తీ చేయకుండా, సాంకేతికత దానిని మెరుగుపరచగలదనే వాగ్దానాన్ని సాకారం చేస్తాయి. ఈ విప్లవాన్ని స్వీకరించడం ద్వారా, మానవ పురోగతికి మూలస్తంభమైన లైబ్రరీ రాబోయేతరాల కోసం శక్తివంతంగా,యాక్సెస్ చేయగలిగేలా ఉండేలా మనం నిర్ధారిస్తాము.

– డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్
9849328496

# స్వచ్ఛత లేని మాంసం అమ్మకాలు

తెలంగాణ రాష్ట్రం ఇటీవలి కాలంలో మాంసం ఉత్పత్తి, వినియోగంలో దేశంలో అగ్రస్థానంలో నిలిచిన విషయం గర్వకారణం కావచ్చు. కానీ, ఆ వెనక భయంకరమైన ఆరోగ్య సమస్యలు, నియమాల ఉల్లంఘన ప్రభుత్వ యంత్రాంగం వైఫల్యం ఉంది. సాంప్రదాయిక ఆహారంలో భాగంగా మాంసం వినియోగం తెలంగాణ ప్రజల జీవనశైలిలో భాగమైంది. ముఖ్యంగా వారంతపు సెలవులు, పండుగలు, లేదా కుటుంబ సమావేశాల సమయంలో మాంసాహారం తప్పనిసరి అయిపోయింది. దీనివల్ల మాంసం ఉత్పత్తిలో రాష్ట్రం మిగతా రాష్ట్రాలను దాటి ముందంజ వేసింది. కానీ, ఈ విస్తృత వృద్ధికి తగిన నియంత్రణలు, నిబంధనలు, నిఘా లేకపోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయి.

**అనుమతి లేని కబేళాలు**

ఒక సమాజం ఆరోగ్యంగా ఉండాలంటే ఆహార భద్రత అత్యంత కీలకం. అనుమతి లేకుండా నడుస్తున్న కబేళాలు శుద్ధి ప్రమాణాలను పాటించకపోవడం, పశువులను అసహజంగా లేదా అనారోగ్యంగా ఉన్నప్పటికీ మాం సంగా మార్చడం వంటి ప్రవర్తనలు ప్రజారోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలు లేదా జంతు సంరక్షణ శాఖల, పశు సంవర్ధక శాఖల అనుమతులు లేకుండానే చాలామంది వ్యాపారులు మాంసాన్ని ఉత్పత్తి చేసి, స్థానిక మార్కెట్లలో అమ్ముతున్నారు. ఈ కబేళాల్లో శుభ్రతకు సంబంధించి కనీస ప్రమాణాలు పాటించడం లేదు. నదుల పక్కన, వ్యవసాయ భూముల్లో, ఇళ్ల మధ్యలో ఉన్న ప్రాంతాల్లో కూడా ఈ కబేళాలు నడుస్తుండటం చూడవచ్చు. ఈ స్థానాల్లోనే వ్యర్థ నీరు వదిలేయడం వల్ల నీటి కాలుష్యం, వాసన, దోమల పెరుగుదల, వ్యాధుల వ్యాప్తికి కారణమవుతున్నాయి.



> **గ్రామీణ ప్రాంతాల్లో అసహ్య పరిస్థితులు**
> మహానగరాల్లోని కొన్ని మాంసం మార్కెట్లలో పరిస్థితులు కొంతమేర పర్యవేక్షణలో ఉన్నా, గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి భయంకరంగా ఉంది. మాంసాన్ని చిన్నపాటి దుకాణాల్లో, బండ్లపై, లేదా శుభ్రత లేని పాత చెక్కలపై కోసి విక్రయించడం జరుగుతోంది. తరచుగా వీరు చేత్తో మాంసం హ్యాండిల్ చేస్తుంటారు, చేతుల శుభ్రత, ఫ్లై కంట్రోల్, రిఫ్రిజిరేషన్ వంటి నిబంధనలేమీ పాటించరూ. చుట్టుపక్కల పశువుల మలవిసర్జన అన్నీ కలిసివచ్చి స్థానిక వాతావరణాన్ని కలుషితం చేస్తున్నాయి.

**నియంత్రణ యంత్రాంగం లోపం**

అధికారికంగా మండల తహసీల్దార్లు, గ్రామాధికారులు, జంతు ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖ అధికారులు ఈ వ్యవస్థపై నిఘా పెట్టాల్సిన బాధ్యత కలిగి ఉన్నారు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో వీరు ఎక్కడ కనిపించరు. ప్రజలు చేసిన ఫిర్యాదులు పట్టించుకోకుండా వదిలేయడం, లేదా తనిఖీలు జరగకపోవడం వల్ల ఈ వ్యవస్థ పూర్తిగా వ్యాపారుల చేతుల్లోకి వెళ్లిపోయింది. గ్రామాల్లో పలువురు వ్యాపారులు సొంతంగా ఏ నియమాలూ పాటించకుండా, మున్సిపల్ లైసెన్స్ లేకుండా మాంసాన్ని విక్రయిస్తున్నారు. దీనివల్ల ప్రజలకు ఆరోగ్య ప్రమాదం తలెత్తడమే కాకుండా, అఫీషియల్ ట్యాక్స్, రెవెన్యూ ప్రభుత్వం కోల్పోతున్నది.

**ప్రజారోగ్యం మీద ప్రభావం**

శుభ్రత లేకుండా అమ్మబడుతున్న మాంసం ద్వారా ప్రజల్లో పలు ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా ఆహారంతో వ్యాప్తిచెందే వ్యాధులు (food –borne illnesses) టైఫాయిడ్ హెపటైటిస్, ఫుడ్ పాయిజనింగ్, చర్మ వ్యాధులు, జీర్ణ సంబంధిత ఇబ్బందులు, బ్యాక్టీరియా, వైరల్ ఇన్ఫెక్షన్లు ఈ సమస్యలు గ్రామీణ వైద్యశాఖలపై ఒత్తిడిని పెంచుతూ, కుటుంబాలపై ఆర్థిక భారం మోపుతున్నాయి.

**తక్షణ చర్యలు**

ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం, స్థానిక పాలనాధికారులు, ప్రజలు కలిసి కొన్ని కీలక చర్యలు తీసుకోవాలి. ప్రతి కబేళాకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండేలా ప్రభుత్వ నిబంధనలను కఠినంగా అమలు చేయాలి. నిర్దేశిత ప్రదేశాల్లో మాత్రమే మాంసం ఉత్పత్తి జరగాలి. వ్యవసాయ భూముల్లో లేదా నివాస ప్రాంతాల్లో నడుస్తున్న అక్రమ కబేళాలను తక్షణం మూసివేయాలి. ప్రతి గ్రామంలో ప్రత్యేక మాంసం మార్కెట్లు ఏర్పాటు చేసి, శుభ్రత ప్రమాణాలకు లోబడేలా నిబంధనలు రూపొందించాలి. అక్కడ పనిచేసే విక్రయదారులకు శిక్షణ ఇవ్వాలి – చేతులు శుభ్రంగా ఉంచడం, కట్టుబాట్లను పాటించడం, మాంసాన్ని సరైన పద్ధతిలో నిల్వ చేయడం మొదలైనవి. గ్రామాధికారులు, తహసీల్దార్లు, జిల్లా జంతు ఆరోగ్య శాఖాధికారులకు నియమిత విధులు నిర్దేశించాలి. వారి పనితీరును మానిటర్ చేయడానికి ప్రత్యేక గ్రీవెన్స్ సెల్‌లు ఏర్పాటు చేయాలి. ప్రతి నెలా తనిఖీలు చేయడం, నివేదికలు సమర్పించడం తప్పనిసరి చేయాలి. గ్రామీణ ప్రజలకు మాంసం వినియోగంలో శుభ్రత అవసరం, అనురక్షిత మాంసం వలన కలిగే ప్రమాదాలు, ప్రభుత్వ అధికారులతో ఎలా సంప్రదించాలో వంటి విషయాల్లో అవగాహన కల్పించాలి. దీనికోసం గ్రామస్థాయిలో ఆరోగ్య శిబిరాలు, అవగాహన సదస్సులు, మొబైల్ వెహికల్స్ ద్వారా సమాచార ప్రచారం చేయాలి. అనుమతి లేని మాంసం కబేళాలను, శుభ్రత లేని మార్కెట్లను నియంత్రించచడానికి ఒక రాష్ట్ర స్థాయి హెల్ప్‌లైన్ నంబర్ లేదా మొబైల్ యాప్ ఏర్పాటు చేయాలి. దీనివల్ల ప్రజలు నేరుగా అధికారులకు సమాచారం అందించగలుగుతారు.

– కమలహాసన్ తుమ్మ
9505618252

# జాతీయం

NATIONAL & GENERAL NEWS

## ఆర్‌జెడి జాతీయ అధ్యక్షుడిగా లాలూ తిరిగి ఎన్నిక



**పాట్నా :** రాష్ట్రీయ జనతా దళ్ (ఆర్‌జెడి) వ్యవస్థాపకులు లాలు ప్రసాద్‌ను పార్టీ జాతీయ అధ్యక్షుడిగా తిరిగి ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆర్‌జెడి ప్రకటించింది. విలేకరుల సమావేశంలో పార్టీ సంస్థాగత ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామచంద్ర పుర్బే మాట్లాడుతూ ప్రసాద్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారని, పరిశీలనలో నామినేషన్ పత్రాలు సక్రమంగా ఉన్నాయని తెలిపారు. జూలై 5న పార్టీ జాతీయ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించనున్న సమయంలో అధికారిక ప్రకటన వెలువడుతుందని, అక్కడ ప్రసాద్‌కు ఎన్నికల సర్టిఫికెట్ కూడా అందజేస్తారని పుర్బే తెలిపారు. అయితే ప్రసాద్‌ను తిరిగి ఎన్నుకోవడం 28 ఏళ్ల ఆర్‌జెడిని ఒక కుటుంబం నియంత్రిస్తోందని నిరూపించిందని బిహార్‌లోని ఎన్‌డిఎ కూటమి పేర్కొంది.

తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూ సేకరణ)
నాగర్‌కర్నూల్ జిల్లా

G2/770/2025 Dt: 13.06.2025
Gaz. No.81/2025

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1) ప్రకారము

**ఫారం. 6, ప్రాథమిక ప్రకటన**

నాగర్‌కర్నూల్ జిల్లా **తాడూర్** మండలంలోని **యాదిరెడ్డిపల్లి** గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన **ఎ.3.38½ గుంటల** భూమి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం క్రింద ప్రజా ప్రయోజనార్థం అనగా **డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 28 (MJR-1/MIR-3)** నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి **ఎ॥లు 3.38½ గు॥** భూమి **డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 28 (MJR-1/MIR-3)** నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము: యాదిరెడ్డిపల్లి మండలం: తాడూర్ జిల్లా: నాగర్ కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./సబ్ డి. నెం. | పట్టా/ఇనాం etc., | [illegible] | [illegible] | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు [illegible] | [illegible] | నిర్మాణములు [illegible] | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 34 | పట్టా | మెట్ట | 0.20 | తలకొండపల్లి ఊపేంద్ర తండ్రి చంద్రయ్య (0.20)<br>తలకొండపల్లి శ్రీశైలం తండ్రి చంద్రయ్య<br>ఉప్పరి వెంకయ్య తండ్రి నర్సయ్య | 27 | VB | 34 | 21 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 35 | పట్టా | మెట్ట | 0.02 | కోడిగంటి సురేందర్ రెడ్డి తండ్రీ మాసిరెడ్డి (0.02)<br>ఏదుల ముత్యాలమ్మ భర్త శ్రీరాములు<br>ఏదుల శ్రీరాములు తండ్రి రాంచంద్రయ్య<br>పి. పెద్ద యల్లయ్య గౌడ్ తండ్రి చిన్న రాములు<br>తోగరి చెన్నమ్మ భర్త చెన్నయ్య<br>కోడిగంటి ధర్మారెడ్డి తండ్రి సురేందర్ రెడ్డి | 46 | 32 | 28 | 34 | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 32 | పట్టా | మెట్ట | 0.20 | తలకొండపల్లి పెద్ద వెంకటయ్య తండ్రి జంగయ్య (0.05)<br>తలకొండపల్లి చిన్న వెంకటయ్య తండ్రి జంగయ్య (0.06)<br>తలకొండపల్లి శ్రీరాములు తండ్రి చంద్రయ్య (0.09)<br>బుద్దారపు తీర్పతయ్య తండ్రి నారాయణ<br>బుద్దారపు నరేంధర్ తండ్రి మైబూస్<br>వుద్దారపు మైబూస్ తండ్రి నారాయణ<br>గోపిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి తండ్రి చంద్రశేఖర్రెడ్డి | 28 | 33 | 32 | 26 | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 33 | పట్టా | మెట్ట | 0.20 | వుద్దారపు మైబూస్ తండ్రి నారాయణ (0.16)<br>బుద్దారపు పెద్ద తిర్పతయ్య తండ్రి నారాయణ (0.04)<br>తలకొండపల్లి జంగయ్య తండ్రి రామయ్య<br>చాకలి పర్వతాలు తండ్రి రంగయ్య<br>తలకొండపల్లి మల్లేష్ తండ్రి రాములు<br>తలకొండపల్లి పర్వతాలు తండ్రి ఆంజనేయులు<br>తలకొండపల్లి మల్లేష్ తండ్రి ఆంజనేయులు<br>చాకలి బాలస్వామి తండ్రి నారాయణ<br>తలకొండపల్లి శివలీల భర్త శ్రీశైలం<br>చాకలి ముత్తయ్య తండ్రి వెంకయ్య<br>తలకొండపల్లి వెంకయ్య తండ్రి ముత్తయ్య<br>బుద్దారపు తీర్పతయ్య తండ్రి నర్సయ్య<br>బుద్దారపు వెంకటయ్య తండ్రి నర్సయ్య<br>బుద్దారపు నరేంధర్ తండ్రి మైబూస్<br>తలకొండపల్లి గోవిందు తండ్రి ముత్తయ్య | 31 | 34 | 35 | 27 | లేవు | లేవు | లేవు | లేవు |
| 5 | 27 | చౌతా పట్టా | మెట్ట | 0.35 1/2 | బుద్దారపు పెద్ద తిర్పతయ్య తండ్రి నారాయణ (0.04)<br>బుద్దారపు వెంకటయ్య తండ్రి నర్సయ్య (0.06)<br>బుద్దారపు చిన్న తిర్పతయ్య తండ్రి నర్సయ్య (0.06)<br>చిలికేశ్వరం ఉస్సేన్ తండ్రి సాయన్న (0.191/2)<br>చాకలి తిర్పతయ్య తండ్రి సాయిలు<br>చాకలి బాలస్వామి తండ్రి నారాయణ<br>బుద్దారం సాయిరాం తండ్రి బాలస్వామి<br>బుద్దారపు బాలమ్మ భర్త తిర్పతయ్య<br>చిలికేశ్వరం నారామ్మ భర్త వెంకటేష్<br>బుద్దారపు రాములు తండ్ర కృష్ణయ్య<br>వుద్దారపు మైబూస్ తండ్రి నారాయణ | 9 | 22 | 27 | 25 | లేవు | లేవు | లేవు | లేవు |
| 6 | 26 | చౌతా పట్టా | మెట్ట | 0.34 | చిలికేశ్వరం ఉస్సేన్ తండ్రి సాయన్న (0.14)<br>చీలికేశ్వరం నారమ్మ భర్త వెంకటేష్ (0.20)<br>వుద్దారపు మైబూస్ తండ్ర నారాయణ<br>మహ్మద్ ఖాజ తండ్రి మహబూబ్లి<br>చాకలి తిర్పతమ్మ భర్త సాయిలు<br>బుద్దారపు తీర్పతయ్య తండ్రి నారాయణ<br>యం యన్ వి సుద్దాకర్ తండ్రి మూర్తి కొండయ్య<br>గోవర్ధన్ రెడ్డి జీ తండ్ర జనార్దన్ రెడ్డి<br>బుద్దారపు నరేంధర్ తండ్రి మైబూస్ | 11 | 24 | 26 | 13 | లేవు | లేవు | లేవు | లేవు |
| 7 | 25 | పట్టా | మెట్ట | 0.27 | చేగూరి మణెమ్మ భర్త ఆంజనేయులు (0.27)<br>యండి మజీదా బేగం భర్త ఖాజా<br>తలకొండపల్లి మల్లేష్ తండ్రి ఆంజనేయులు<br>పట్టపర్ల మస్తాన్ గౌడ్ తండ్రి ఎల్లయ్య గౌడ్<br>గోవిందు రవింధర్ తండ్రి ఆంజనేయులు<br>చేగూరి కమలమ్మ భర్త కృష్ణయ్య<br>పట్టపర్ల పార్వతమ్మ భర్త మస్తాన్ గౌడ్<br>సురేష్ ముచ్చర్ల తండ్రి తిర్పతయ్య<br>నాజామోద్దీన్ తండ్రి ఉస్సేన్<br>పట్టపర్ల గజ్జలమ్మ భర్త నర్సింహ్మగౌడ్<br>చేగూరి కమలమ్మ భర్త ఆంజనేయులు<br>చేగూరి సంతోష్ తండ్రి కృష్ణయ్య<br>ఉప్పరి శేఖరయ్య తండ్రి జంగయ్య | 26 | 24 | 10 | 24 | లేవు | లేవు | లేవు | |
| మొత్తం : 3.38 1/2 | | | | | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12 లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు, ప్రత్యేక ఉపకలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్ కర్నూల్, మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవిలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా **ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్** గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకోనవచ్చును.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో సేకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్ కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉందును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ G.O.Ms.No. 51, తేది.25.07.2017 ద్వారా భూసేకరణ, నష్ట పరిహారము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము, 2013 లోని అధ్యాయము- II మరియు అధ్యాయము-III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్-1,యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ | సం/- అదనపు కలెక్టర్ నాగర్‌కర్నూల్ | సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO NO. 296/LA/PP/Advt/Pub/2025-26

## ఖతార్‌లోని భారతీయులకు కీలక అడ్వైజరీ

**న్యూఢిల్లీ:** ఖతార్‌లోని అమెరికా వైమానిక స్థావరం అల్‌ఉదీద్‌పై ఇరాన్ క్షిపణుల దాడులతో భారత్ అప్రమత్తమైంది. ఖతార్‌లోని తమ పౌరులకు కీలక అడ్వైజరీ జారీ చేసింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఖతార్‌లోని భారతీయులు జాగ్రత్తగా, సురక్షితంగా ఉండాలని సూచించింది. స్థానిక అధికారులు అందించే సూచనలు, మార్గదర్శకాలను పాటించాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఖతార్‌లోని భారత రాయబార కార్యాలయం వేదికగా పోస్టు పెట్టింది.

తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూ సేకరణ)
నాగర్‌కర్నూల్ జిల్లా

G2/766/2025 Dt: 13.06.2025
Gaz. No.82/2025

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1) ప్రకారము

**ఫారం. 6, ప్రాథమిక ప్రకటన**

నాగర్‌కర్నూల్ జిల్లా **తిమ్మాజిపేట** మండలంలోని **ఆవంచ** గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన **ఎ.3.12 గుంటల** భూమి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం క్రింద ప్రజా ప్రయోజనార్థం అనగా **డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 42 (MINOR-ML-3)** నిమిత్తం సేకరించవలిసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి **ఎ॥లు 3.12 గు॥** భూమి **డిస్ట్రిబ్యూటరి కెనాల్ - 42 (MINOR-ML-3)** నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము: ఆవంచ మండలం: తిమ్మాజిపేట జిల్లా: నాగర్ కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./సబ్ డి. నెం. | పట్టా/ఇనాం etc., | [illegible] | [illegible] | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు [illegible] | [illegible] | నిర్మాణములు [illegible] | [illegible] |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 484 | పట్టా | మెట్ట | 1.06 | గాదె కస్పారెడ్డి తండ్రి శౌ రెడ్డి (0.09)<br>కొమ్మారెడ్డి శౌరిలు తండ్రి జైపాల్‌రెడ్డి (0.05)<br>అల్లం స్వర్ణమేరి భర్త వినోద్ రెడ్డి (0.05)<br>గాదె ఆరోగ్యమేరి భర్త కస్పారెడ్డి (0.05)<br>కొమ్మారెడ్డి జోసఫ్ రెడ్డి తండ్రి సంసన్ రెడ్డి (0.22)<br>గాదె ప్రణయ్ కుమార్ తండ్రి కస్పారెడ్డి<br>తుమ్మ సురేందర్ రెడ్డి తండ్రి మర్రెడ్డి<br>సలివింద్ల దీలీప్కుమార్ తండ్రి ఆనంద్ రెడ్డి<br>బాట | 483 | VB | 471 | 485 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 483 | పట్టా | మెట్ట | 0.03 | వస్పరి వెంకటయ్య తండ్రి బాలయ్య (0.03)<br>సిద్దపురం చంద్రయ్య తండ్రి మల్లయ్య<br>సంభ బీరయ్య తండ్రి పెద్ద నీలయ్య<br>సంభ మహేష్ తండ్రి పెద్ద నీలయ్య<br>సాదె లింగమ్మ భర్త రాంలింగయ్య<br>సదె రవి తండ్రి రామేశ్వర్<br>బొగాండ్ల బీరమ్మ భర్త బీరయ్య<br>బొగాండ్ల చంద్రమ్మ భర్త జంగయ్య<br>సాదె రాజు తండ్రి సుధాకర్<br>సాదె అంజమ్మ భర్త సుధాకర్<br>బాట | 481 | 484 | 472 | 484 | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 471 | పట్టా | మెట్ట | 0.20 | కుమ్మరి ఆంజనేయులు తండ్రి వెంకటయ్య (0.02)<br>బొద్దుపల్లి నరేందర్ తండ్రి రాములు (0.02)<br>డి పురుషోత్తం తండ్రి రాములు (0:02)<br>కుమ్మరి సత్యనారాయణ తండ్రి గాలయ్య(0.04)<br>కుమ్మరి సత్యం తండ్రి నర్సింహులు (0.03)<br>కుమ్మరి బారతమ్మ భర్త భాస్కర్ (0.02)<br>కుమ్మరి నర్సమ్మ భర్త నర్సింహులు (0.05)<br>మాదవి భర్త కుమ్మరి నారాయణ<br>కుమ్మరి నారాయణ తండ్రి నర్సింహులు<br>కుమ్మరి రాఘవేందర్ తండ్రి రాములు<br>కుమ్మరి లక్ష్మి నారాయణ తండ్రి వెంకటయ్య<br>బొద్దుపల్లి అజయ్ తండ్రి రవీందర్<br>కుమ్మరి లక్ష్మీ నారాయణ తండ్రి వెంకటయ్య | 472 | 470 | 468 | 484 | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 472 | పట్టా | మెట్ట | 0.23½ | బలాదూర్ రఘు తండ్రి జంగయ్య (0.06)<br>కుమ్మరి వనజ భర్త సత్యనారాయణ (0.06)<br>రాచర్ల సత్యనారాయణ వర్మ భర్త శవయ్య వర్మ(0.11 1/2)<br>బాల్బరి లోకమ్మ భర్త జంగయ్య | 473 | 471 | 467 | 483 | లేవు | లేవు | లేవు | లేవు |
| 5 | 467 | పట్టా | మెట్ట | 0.21 | ఏరువ సుజాత భర్త విజయ రెడ్డి (0.21)<br>గాదె చిన్నపురెడ్డి తండ్రి సామ్సన్ రెడ్డి<br>గాదె జోసఫ్ రెడ్డి తండ్రి చిన్నపురెడ్డి<br>గాదె చిన్నపురెడ్డి తండ్రి ఇన్నారెడ్డి | 466 | 468 | - | 472 | లేవు | లేవు | లేవు | లేవు |
| 6 | 468 | పట్టా | మెట్ట | 0.18½ | గాదె మర్రెడ్డి తండ్రి శౌరెడ్డి (0.18 1/2)<br>కొమ్మారెడ్డి సాంసన్‌రెడ్డి తండ్రి మర్రెడ్డి<br>తుమ్మ రేణుక భర్త సురేంధర్ రెడ్డి<br>సలివింద్ల దీలీప్‌కుమార్ తండ్రి ఆనందరెడ్డి | 467 | 469 | - | 471 | లేవు | లేవు | లేవు | లేవు |
| మొత్తం : 3.12 | | | | | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19 (1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12 లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు, ప్రత్యేక ఉపకలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్ కర్నూల్, మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏవిధమైన లావాదేవిలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణ పై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేది నుండి 60 (అరువది) దినములలోగా **ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్** గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకోనవచ్చును.

భూసేకరణ తల పెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో సేకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్ కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉందును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ G.O.Ms.No. 51, తేది.25.07.2017 ద్వారా భూసేకరణ, నష్ట పరిహారము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము, 2013 లోని అధ్యాయము- II మరియు అధ్యాయము-III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్-1,యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ | సం/- అదనపు కలెక్టర్ నాగర్‌కర్నూల్ | సం/- జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO NO. 285/LA/PP/Advt/Pub/2025-26

# 9న సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు

వామపక్షాల ప్రకటన




**న్యూఢిల్లీ:** కార్మికుల ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను అణచివేస్తూ కార్పొరేట్ అజెండాలో భాగంగా లేబర్ కోడ్‌ల అమలునకు వ్యతిరేకంగా వచ్చే నెల 9న జరగబోయే సార్వత్రిక సమ్మె జయప్రదానికి వామపక్షాలు పిలుపునిచ్చాయి. కేంద్ర కార్మిక సంఘాలు (సీటీయూలు), కార్మిక సమాఖ్యలు, సంఘాల పిలుపు మేరకు ఈ సమ్మె జరగనుంది. ఇందుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ సీపీఐ, సీపీఎం, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్‌పిస్‌పీ), ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ (ఏఐఎఫ్‌బీ) ప్రధాన కార్యదర్శులు డి.రాజా, ఎంఎ బేబీ, దీపాంకర్ భట్టాచార్య మనోజ్ భట్టాచార్య, జి.దేవరాజన్ మంగళవారం సంయుక్త ప్రకటన చేశారు. నయాఉదారవాద అజెండాతో కార్మికుల హక్కులను హరిస్తున్నారని, ఇందుకోసమే లేబర్ కోడ్‌లు తెచ్చారని విమర్శించారు. దేశ వనరులను ప్రైవేటుకు దారాదత్తం చేసేందుకు బీజేపీ ప్రభుత్వం దూకుడుగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. రక్షణ, కమ్యూనికేషన్ వంటి కీలక రంగాలను ప్రైవేటుకు అప్పగించేస్తోందని వ్యాఖ్యానించారు. కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు యత్నిస్తున్నదన్నారు. జులై 9న సార్వత్రిక సమ్మెకు మద్దతుగా కార్మికకర్షకుల డిమాండ్లను పునరుద్ఘాటించారు. సార్వత్రిక సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం)తో పాటు వ్యవసాయ కార్మికుల సంఘాలు సంఘీభావం తెలిపాయి. పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కార్మికులకు, కర్షకులకు నాయకులు పిలుపునిచ్చారు. విభజించి పాలించు సిద్ధాంతాన్ని ఆచరించే పాలకుల ప్రయత్నాలను తిప్పికొట్టడంతో కార్మికుల ఐక్యతను మరింత పెంచేదిగా కర్షకుల సంఘీభావం దోహదమవుతుందని వెల్లడించారు. సమ్మె జయప్రదానికి జనసమీకరణ కోసం తమ పార్టీల శాఖలకు పిలుపునిచ్చారు.

## 'మహా' అసెంబ్లీ ఎన్నికల్లో 'ఓట్ల దొంగతనం'

మెషిన్--రీడబుల్ డిజిటల్ ఓటరు జాబితాలతో పాటు

సిసిటివి ఫుటేజీ విడుదల చేయాలి : రాహుల్‌గాంధీ డిమాండ్



**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అక్రమాలు జరిగాయని ప్రతిపక్షనేత రాహులగాంధీ మరోమారు ఉద్ఘాటించారు. అయితే విడిగా జరిగిన లోపాలు కాదని, ఓట్ల దొంగతనం జరిగిందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో మెషిన్‌–రీడబుల్ డిజిటల్ ఓటరు జాబితాలతో పాటు సిసిటివి ఫుటేజీని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికలకు, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు మధ్య కేవలం ఆరునెలల్లోనే బిజెపి నాయకుడు, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రాతినిధ్యం వహిస్తున్న నాగ్‌పూర్ సౌత్ వెస్ట్‌లో 29,219 మంది కొత్త ఓటర్లను చేర్చుకున్నారని పేర్కొన్న మీడియా నివేదికను లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఎక్స్‌లో పంచుకున్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో ఓటర్ల జాబితా కేవలం 5 నెలల్లో 8 శాతం పెరిగిందని, కొన్ని బూత్‌లలో 20–50 శాతం పెరుగుదల కనిపించిందన్నారు. తెలియని వ్యక్తులు ఓటు వేసినట్లు బిఎల్‌ఓలు నివేదించాయని గాంధీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. చిరునామా లేని వేలాది మంది ఓటర్లను మీడియా బయటపెట్టగా, ఎన్నికల సంఘం మాత్రం నిశబ్బందా ఉందని విమర్శించారు. కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. అయితే ఓటర్ల చేర్పు విడిగా జరిగిన లోపం కాదని, ఇది ఓటు దొంగతనమన్నారు. దీనిని కప్పిపుచ్చుకోవడమంటే ఒప్పుకోలేనన్నారు. అందుకే మెషిన్‌–రీడబుల్ డిజిటల్ ఓటరు రోల్స్ సిసి ఫుటేజ్‌లను వెంటనే విడుదల చేయాలని మేము డిమాండ్ చేస్తున్నామని గాంధీ అన్నారు. కాగా, భారత ఎన్నికల సంఘం ఇప్పటికే తెలియజేసినట్లుగా మహారాష్ట్రలోని ప్రధాన ఎన్నికల కార్యాలయం ఎక్స్‌లో పోస్టు చేసింది. అన్ని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో ఓటర్ల జాబితాను పంచుకుంటున్నట్లు తెలిపింది. అయితే 2024 మహారాష్ట్ర ఎన్నికల్లో రిగ్గింగ్ ఆరోపణలపై ఎన్నికల కమిషన్ రాహుల్‌గాంధీకి అధికారికంగా లేఖ రాయగా, ప్రతిపక్షనేత స్పందించారు.

## మహారాష్ట్ర ఎన్నికలపై కోర్టుకు వెళ్లొచ్చు

రాహుల్‌గాంధీకి ఎన్నికల సంఘం సూచన




**న్యూఢిల్లీ :** మహారాష్ట్ర అసెంబ్లీ (2024) ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై ఎన్నికల సంఘం అధికారికంగా స్పందించింది. అన్ని ఎన్నికలు చట్టాల ప్రకారం కచ్చితంగా జరుగుతాయని, అభ్యర్థులు ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సమస్యలతో ఇప్పటికే కోర్టును ఆశ్రయించారని పేర్కొంది. కాంగ్రెస్ నాయకుడికి ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే, అతను అధికార యంత్రాంగానికి లేఖ రాయవచ్చని, అన్ని అంశాలపై చర్చించడానికి ఇసి కూడా ఆయనను వ్యక్తిగతంగా కలవడానికి సిద్ధంగా ఉందని పోల్ ప్యానెల్ తెలిపింది. మొత్తం పోల్ కసరత్తులో రాజకీయ పార్టీలు నియమించిన బూత్‌స్థాయి ఏజెంట్లతో సహా వేలాది మంది సిబ్బంది పాల్గొంటారని పేర్కొంది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఒక ప్రముఖ దినపత్రికలో ప్రచురించబడిన ఒక వ్యాసంలో మహారాష్ట్ర ఎన్నికలలో 'మ్యాచ్ ఫిక్సింగ్' జరిగిందని ఆరోపించారు. ఈ కథనానికి ప్రతిస్పందనగా, ఈనెల 12న ఇసి రాహుల్ గాంధీకి ఒక ఇమెయిల్ పంపింది. మొత్తం ఎన్నికల ప్రక్రియ అసెంబ్లీ నియోజకవర్గ స్థాయిలో వికేంద్రీకృత పద్ధతిలో నిర్వహించబడుతుందని అందులో పేర్కొంది. ఇందులో 1,00,186 మందికి పైగా బూత్ స్థాయి అధికారులు, 288 మంది ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు, 139 మంది జనరల్ పరిశీలకులు, 41మంది పోలీస్ పరిశీలకులు, 71 మంది వ్యయ పరిశీలకులు మరియు ప్యానెల్ నియమించిన 288 మంది రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారని అది తెలిపింది. అంతేకాకుండా, మహారాష్ట్ర అంతటా కాంగ్రెస్‌కు చెందిన 28,421 మందితో సహా జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీలు 1,08,026 మంది బూత్ స్థాయి ఏజెంట్లను నియమించాయని గుర్తు చేసింది. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏదైనా సమస్య ఐఎన్‌సి (కాంగ్రెస్) అభ్యర్థులు సమర్థ న్యాయస్థానం (బాంబే హైకోర్టు)లో దాఖలు చేసిన ఎన్నికల పిటిషన్ల ద్వారా ఇప్పటికే లేవనెత్తబడి ఉంటుందని మేము భావిస్తున్నాము' అని ఇసి గాంధీకి తెలిపింది. ఏదైనా నిర్దిష్ట నియోజకవర్గ ఫలితాలు ప్రకటించిన 45 రోజుల్లోపు ఒక రాష్ట్రంలోని హైకోర్టులో ఎన్నికల పిటిషన్ దాఖలు చేయవచ్చు. 'అయితే, మీకు ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే, మీరు మాకు లేఖ రావచ్చు. అన్నిసమస్యలను చర్చించడానికి కమిషన్ పరస్పరం అనుకూలమైన తేదీ, సమయంలో మిమ్మల్ని వ్యక్తిగతంగా కలవడానికి కూడా సిద్ధంగా ఉంది' అని పోల్ అథారిటీ జోడించింది

# భారత్ దౌత్యపర చర్యలు తీసుకోవాలి

బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ



**కోల్‌కతా :** ఇజ్రాయెల్–ఇరాన్ వివాదంపై పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆందోళన వ్యక్తం చేశారు. భారత దేశం వైరుధ్యాలను ఆపడానికి దౌత్యపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అసెంబ్లీలో పర్యావరణ సమస్యలపై జరిగిన చర్చ సందర్భంగా బెనర్జీ మాట్లాడుతూ 'ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో యుద్ధం ప్రారంభమైంది. ఇటువంటి ఘర్షణలు వాయు, నీటి కాలుష్యానికి కారణమవుతున్నాయి. దీనిని ఆపడానికి మనం చర్యలు తీసుకోవాలి' అని అన్నారు.

'దౌత్యపరంగా, శాంతియుతంగా, యుద్ధం ఆగిపోయేలా మనం చొరవ తీసుకోవాలి. భారత ప్రభుత్వం పరిధిలోకి వచ్చే బాహ్య వ్యవహారాలు, దౌత్యపరమైన అంశాలపై మాట్లాడే అధికారం నాకు లేదు. ఈ ప్రపంచంలోని ఆందోళన చెందుతున్న పౌరురాలిగా ఇది నా వ్యక్తిగత అభిప్రాయం' అని ఆమె అన్నారు. పశ్చిమ్ మెదినిపూర్ జిల్లాలోని ఘటల్‌లో వరద పరిస్థితిని ప్రస్తావిస్తూ, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్ (డివిసి) మైథాన్, పంచెట్ ఆనకట్టల వద్ద త్రవ్వకాల కార్యకలాపాలను నిర్వహించడంలో విఫలమైందని బెనర్జీ విమర్శించారు. చాలా సంవత్సరాలుగా డ్రెడ్జింగ్ చేపట్టలేదని, ఇప్పుడు డివిసి కేవలం ఒక లక్ష క్యూసెక్కుల నీటిని మాత్రమే నిల్వ చేయగలదని, డ్రెడ్జింగ్ క్రమం తప్పకుండా చేసి ఉంటే, సామర్థ్యం నాలుగు లక్షల క్యూసెక్కులు ఉండేదని, దీంతో దక్షిణ బెంగాల్‌లో వరదలను నివారించవచ్చని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేయకుండానే వర్షం సమయంలో డివిసి ఆనకట్టల నుండి పెద్ద మొత్తంలో నీటిని విడుదల చేస్తోందని ఆమె ఆరోపించారు. పర్యావరణ సమస్యలపై కేంద్రం రాష్ట్రాలపై ఆంక్షలు విధిస్తోందన్నారు. పర్యావరణ సమస్యలతో సహా ప్రతిదానిపైనా మార్గదర్శకాలను విధించాలని చూస్తున్నారని, కేంద్రం సిఫార్సు చేయగలదు, కానీ రాష్ట్రాలపై తన నిర్ణయాలను బుల్డోజ్ చేయకూడదన్నారు. రాష్ట్రాలు తమ సొంత చట్టాలను రూపొందించుకునే స్వయంప్రతిపత్తి కలిగి ఉండాలని మమత పేర్కొన్నారు. కాలుష్యాన్ని ఎదుర్కోవడానికి సొంత చొరవల ద్వారా రాష్ట్రం ముందుందని ఆమె అన్నారు. 'బీహార్, ఢిల్లీ, కొన్ని ఇతర రాష్ట్రాలను చూడండి. వాటి కాలుష్య స్థాయి చాలా ఎక్కువగా ఉంది' అని ఆమె పేర్కొన్నారు. బెంగాల్ 'సేవ్ ఎన్విరాన్‌మెంట్' చొరవలో భాగంగా, నీటి వనరులను సంరక్షించడానికి 4.5 లక్షల చెరువులను తవ్వాలని రాష్ట్రం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. 'ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడటం గురించి జాగ్రత్తగా ఉండాలి. లేకుంటే మనకు ఇష్టమైన గ్రహం ఒక రోజు ఉనికిలో ఉండదు' అని పర్యావరణంపై చర్చ సందర్భంగా ఆమె అన్నారు. ఉత్తర బెంగాల్ వరదల గురించి ఆమె మాట్లాడుతూ, భూటాన్, నేపాల్, సిక్కింలలోని పరీవాహక ప్రాంతాలలో భారీ వర్షాల కారణంగా తీస్తా వంటి నదులు పొంగిపొర్లుతున్నాయని, విధ్వంసం సృష్టిస్తున్నాయని ఆమె అన్నారు. ఇండోభూటాన్ నదీ కమిషన్‌లో బెంగాల్ ప్రాతినిధ్యం కోసం తాము పదేపదే కోరానా కేంద్రం స్పందించలేదన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా ప్రమాదంపై బెనర్జీ కూడా ఆందోళన వ్యక్తం చేశారు. దాని పేరు చెప్పకుండానే ప్రజలు విమానాలు, రైళ్లు ఎక్కడానికి భయపడుతున్నారన్నారు. దేశంలోని ఇతర ప్రాంతాలలో వంతెనలు కూలిపోవడాన్ని కూడా ఆమె ప్రస్తావించారు. 'అన్ని వంతెనల ఆరోగ్య ఆడిట్ కోసం తాము కోరాము' అని అన్నారు.

## ఉగ్రవాదాన్ని ఉపేక్షించొద్దు

ఎస్‌సిఒ సదస్సులో అజిత్ దోవల్



**బీజింగ్:** ఏ రూపంలోనూ ఉగ్రవాదాన్ని ఉపేక్షించరాదని జాతీయ భద్రత సలహాదారు (ఎన్‌ఎస్‌ఏ) అజిత్ దోవల్ అన్నారు. సరిహద్దు ఆవలి ఉగ్రవాదానికి పాల్పడేవారికి మద్దతిచ్చే వారు నేరస్తులే అవుతారని, వారిని చట్ట ప్రకారం శిక్షించేందుకు కలిసి రావాలని చైనా రాజధాని బీజింగ్‌లో జరిగిన షాంఘై కోఆపరేటివ్ ఆర్గనైజేషన్(ఎస్‌సీఓ) భద్రతా సదస్సులో పిలుపునిచ్చారు. లష్కరే తయ్యిబా (ఎల్‌ఈటీ), జైషే మహమ్మద్ (జేఈఎం), అల్‌ఖైదా, ఐసిస్ సహా వాటి అనుబంధ ఉగ్రసంస్థలతో పొంచివున్న ముప్పుపై భారత్ తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్లు దోవల్ తెలిపారు. జమ్మూకశ్మీర్, పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో ఉగ్రవాదులు, ఉగ్రవాద మౌలికవసతులే లక్ష్యంగా ఆపరేషన్ సిందూర్‌ను భారత్ చేపట్టిందన్నారు. భారత్ ఎప్పుడు ఆచితూచి వ్యవహరిస్తుందని చెప్పారు. ఉగ్రవాదంపై పోరులో ద్వంద్వ వైఖరి వద్దని, ఐరాస గుర్తించిన ఉగ్రసంస్థలు, వాటి పాక్సీల నిర్వీర్యానికి నిర్ణయాత్మక చర్యలు అవసరమని అజిత్ దోవల్ నొక్కిచెప్పారు. సరిహద్దు ఆవలి ఉగ్రవాదం సహా అన్ని రూపాల్లో జరిగే ఉగ్రవాద చర్యలు మానవాళిపై నేరాలేనని అన్నారు. ఉగ్రవాదాన్ని పెంచిపోషించే వారిని చట్ట ప్రకారం శిక్షించాలని పిలుపునిచ్చారు.

'ఆపరేషన్ సింధు' మిషన్‌లో భాగంగా...

# మరికొందరు భారతీయులు న్యూఢిల్లీకి చేరిక

ఇరాన్ నుంచి 292మంది..

ఇజ్రాయెల్ నుంచి 292 మంది తరలింపు

పర్షిన్ గల్ఫ్ దేశం నుంచి ఇప్పటివరకు

2,295మందిని వెనక్కి తీసుకొచ్చిన భారత్



**న్యూఢిల్లీ :** భారతదేశం మంగళవారం ఇరాన్ నుంచి 292మంది పౌరులను, ఇజ్రాయెల్ నుంచి 366మంది జాతీయులను తరలించింది. ఇరాన్‌లోని మూడు అణు స్థావరాలపై అమెరికా బాంబుదాడి తర్వాత ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు చోటుచేసుకున్న నేపథ్యంలో భారతదేశం ఈ చర్యలు చేపట్టింది. ఇరాన్ నుంచి తరలింపునకు గురైన మొదటి బ్యాచ్‌తో భారతదేశం ఇప్పటివరకు పర్షియన్ గల్ఫ్ దేశం నుండి 2,295మంది భారతీయులను తిరిగి వెనక్కి తీసుకొచ్చింది. అమ్మాన్ నుంచి 161మంది భారతీయులను ఒక చార్టర్డ్ విమానంలో ఇండియా వెనక్కి తీసుకువచ్చింది. మంగళవారం ఆ విమానం భారత్‌లో ఉదయం 8: 20గంటలకు ల్యాండ్ అయ్యింది. భారతీయులను ఇజ్రాయెల్ నుంచి భూ సరిహద్దుల క్రాసింగ్ ద్వారా జోర్డాన్‌కు తరలించారు. కాగా మరొక 165మందితో భారతీయులతో కూడిన బృందాన్ని అమ్మాన్ నుంచి సి17 మిలిటరీ రవాణా విమానం ద్వారా వెనక్కి తీసుకొచ్చారు. విమానాశ్రయం వద్ద వారికి కేంద్ర మంత్రి ఎల్.మురుగన్ స్వాగతం పలికారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మాట్లాడుతూ ఇరాన్‌లోని మషాద్ నుంచి 292మంది భారతజాతీయులను ఒక ప్రత్యేక విమానంలో తరలించామని, ఆ విమానం ఇక్కడకు 3 : 30గంటలకు చేరుకున్నదని చెప్పారు. ఆయన మాట్లాడుతూ ఇరాన్‌ఇజ్రాయెల్ మధ్య శతృత్వం తీవ్రతరమైన నేపథ్యంలో భారతదేశం 'ఆపరేషన్ సింధు' తరలింపు మిషన్‌ను ప్రారంభించిందన్నారు. 2,295 మంది భారత జాతీయులను ఇరాన్ నుంచి ఇప్పటివరకు తీసుకువచ్చామని రణ్‌ధీర్ జైస్వాల్ తెలిపారు. గత రాత్రి ఒక ప్రత్యేక విమానంలో ఇరాన్ నగరం మషాద్ నుంచి 290మంది భారత జాతీయులు, ఒక శ్రీలంకన్‌ను తరలించడం జరిగిందన్నారు.ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య శతృత్వం మరింత పెరిగి భీకర యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో ఇరు దేశాల నుంచి భారత జాతీయులను వెనక్కి తీసుకువచ్చేందుకు 'ఆపరేషన్ సింధు'ను భారతదేశం ప్రారంభించింది. వారం రోజుల నుంచి శతృత్వం ప్రారంభమైన నాటి నుంచి ఇజ్రాయెల్, ఇరాన్ దేశాలు వాటి నగరాలపై పరస్పరం సైనిక, వ్యూహాత్మక క్షిపణులు, డ్రోణులను ప్రయోగించాయి. ఆదివారం ఉదయం ఇరాన్ దేశానికి చెందిన మూడు ప్రధాన అణు స్థావరాలపై అమెరికా బాంబుల వర్షం కురిపించడంతో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్రతరమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారతదేశం తన జాతీయులను ఛార్టర్డ్ విమానాల ద్వారా తరలించే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇరానియన్ నగరం మషాద్, ఆర్మేనియన్ రాజధాని యెరెవాన్, తుర్క్‌మెనిస్థాన్ రాజధాని అష్గాబాత్ ద్వారా బుధవారం నుంచి తరలింపు చర్యలు చేపట్టింది. మషద్ నుంచి మూడు ఛార్టర్ విమానాలను తరలించడానికి వీలుగా ఇరాన్ శుక్రవారం తన గగనతలంపై ఆంక్షలు ఎత్తివేసింది. కాగా 290మంది భారతీయులతో కూడిన మొదటి విమానం గత శుక్రవారం రాత్రి న్యూఢిల్లీలో ల్యాండ్ అయ్యింది. 310మంది భారతీయులతో కూడిన రెండవ విమానం శనివారం మధ్యాహ్నం న్యూఢిల్లీకి చేరుకుంది. కాగా మరొక విమానం గురువారం అర్మేనియన్ రాజధాని నగరం నుంచి భారతదేశానికి చేరుకుంది. ఒక ప్రత్యేక తరలింపు విమానం అష్గాబాత్ నుంచి శనివారం ఉదయానికి న్యూఢిల్లీలో ల్యాండ్ అయ్యింది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎస్‌డిజి ర్యాంకులలో భారత్‌కు 99వ స్థానం
### వందలోపు ఇదే మొదటిసారి

**న్యూఢిల్లీ :** సుస్థిర అభివృద్ధి లక్ష్యాల(ఎస్‌డిజి) ర్యాంకులలో భారతదేశం తొలిసారిగా టాప్ 100లో నిలిచింది. మొత్తం 167 దేశాల జాబితాలో భారత్ 99వ ర్యాంక్ సాధించింది. యుఎన్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ సొల్యూషన్స్ నెట్‌వర్క్ రూపొందించిన ఎస్‌డిఆర్ నివేదికలో ఎస్‌డిజి 2025 సూచిలో భారత్ 67 పాయింట్లు పొందగా, చైనా 49వ ర్యాంకు 74.4 పాయింట్లు, అమెరికా 44వ ర్యాంకు 75.2 పాయింట్లు సాధించాయి. మన పొరుగుదేశాలలో భూటాన్ 70.5 పాయింట్లతో 74వ స్థానం, నేపాల్ 68.6 పాయింట్లతో 85వ స్థానం, భూటాన్ 70.5 పాయింట్లతో 74వ స్థానం, బంగ్లాదేశ్ 63.9 పాయింట్లతో 114వ స్థానం దక్కించుకున్నాయి. తీరప్రాంత పొరుగుదేశాలలో మాల్దీవులు 53, శ్రీలంక 93వ స్థానాలలో నిలిచాయి.

## రైతు భరోసా పంపిణీ విజయవంతగా పూర్తి
### 9 రోజుల్లో 1.46 కోట్ల ఎకరాలకు రూ.8744.13 కోట్లు జమ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైతు భరోసా పథకం కింద అన్నదాతలకు పంట సహాయం నిధులను పంపిణీ విజయవంతంగా పూరైంది. రాజేంద్ర నగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో రైతు నేస్తం వేదికగా గత మంగళ వారం ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేతుల మీదగా ప్రారంభమైన రైతు భరోసా నిధుల జమా కార్యక్రమం 15 ఎకరాలకు పైఉన్న రైతులందరి ఖాతాలలోకి ఎకరానికి 6 వేల చొప్పున రూ.459.47 కోట్లను జమ చేయడం ద్వారా మంగళవారంతో రైతు భరోసాను విజయవంతంగా పూర్తి చేశారు. కేవలం 9 రోజుల్లోనే మొత్తం 69.40 లక్షల మంది రైతులకు సంబంధించిన కోటి 46 లక్షల ఎకరాలకు గాను 8744.13 కోట్ల రైతు భరోసా నిధులు జమ చేశారు.

జిల్లా వారిగా జమ చేసిన రైతు భరోసా నిధుల వివరాలు:

| జిల్లాలు | రైతులు | నిధులు |
|---|---|---|
| ఆదిలాబాద్ | 1,61,545 | 3,31,52,00,836 |
| కుమురం భీం | 1,34,031 | 2,52,95,97,530 |
| మంచిర్యాల | 1,52,621 | 1,98,96,63,519 |
| నిర్మల్ | 1,89,116 | 2,69,70,53,949 |
| నిజామాబాద్ | 2,73,142 | 3,17,31,64,035 |
| కామారెడ్డి | 3,04,485 | 3,06,96,23,412 |
| కరీంనగర్ | 1,90,606 | 2,07,12,04,857 |
| పెద్దపల్లి | 1,51,925 | 1,61,63,12,018 |
| జగిత్యాల | 2,25,973 | 2,44,04,05,670 |
| రాజన్న సిరిసిల్ల | 1,26,648 | 1,49,82,54,012 |
| మెదక్ | 2,62,791 | 2,21,58,80,189 |
| సంగారెడ్డి | 3,59,915 | 4,23,62,12,928 |
| సిద్దిపేట | 3,20,783 | 3,56,19,27,862 |
| వరంగల్ | 1,56,769 | 1,62,80,04,916 |
| హన్మకొండ | 1,44,560 | 1,53,19,45,180 |
| మహబూబాబాద్ | 2,12,280 | 2,68,71,24,904 |
| ములుగు | 79,653 | 99,39,75,308 |
| జయశంకర్ భూపాలపల్లి | 1,16,207 | 1,39,90,62,630 |
| జనగామ | 1,81,454 | 2,34,07,47,281 |
| ఖమ్మం | 3,38,712 | 4,28,58,45,198 |
| భద్రాద్రి కొత్తగూడం | 1,78,380 | 3,18,69,40,241 |
| రంగారెడ్డి | 2,83,709 | 3,24,53,79,768 |
| వికారాబాద్ | 2,76,537 | 3,63,10,35,377 |
| మేడ్చల్ మల్కాజిగిరి | 25,120 | 23,62,87,183 |
| మహబూబ్ నగర్ | 2,15,535 | 2,44,01,22,687 |
| నారాయణపేట | 1,79,688 | 2,61,47,87,270 |
| నాగర్ కర్నూల్ | 3,01,584 | 4,16,73,62,496 |
| వనపర్తి | 1,76,449 | 2,06,70,27,164 |
| జోగులాంబ గద్వాల | 1,69,736 | 2,63,66,08,963 |
| నల్లగొండ | 5,27,669 | 7,18,67,40,416 |
| సూర్యాపేట | 2,87,887 | 3,67,40,86,035 |
| యాదాద్రి భువనగిరి | 2,34,038 | 3,07,37,26,076 |
| **మొత్తం** | **69,39,54** | **887,44,13,09,910** |



## ఎన్‌ఎస్‌పిసి పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నేషనల్ గ్రీన్ కోర్ తయారుచేసిన 'నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ పోటీ (ఎన్‌ఎస్‌పిసి) 2025' పోస్టర్‌ను పర్యావరణ, అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండాసురేఖ మంగళవారం ఆవిష్కరించారు. వాతావరణ మార్పుల పర్యవసానాల నుండి రక్షణకు విద్యార్థులలో పర్యావరణ నైపుణ్యాలు, పర్యావరణ అనుకూల జీవనశైలిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా కొండా సురేఖ తెలిపారు. మొక్కలు నాటటం పెంచడం, నీటి సంరక్షణ పొదుపు, తడి పొడి వ్యర్థాల వేరుచేసే అలవాట్లను విద్యార్థులలో అలవరచాల్సిన అవసరం ఉంది అని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోస్టర్ ని విడుదల చేస్తూ మాట్లాడుతూ రాష్ట్రం లోని అన్ని విద్యా సంస్థలు ఈ పోటీలో పాల్గొన వలసిందిగా పిలుపునిచ్చారు. ఈ పోటీకి జూలై 1 నుండి ఆగస్టు 21 వరకు రిజిస్ట్రేషన్ అందుబాటులో ఉంటుంది. ఈ పోటీకి కేంద్ర విద్యా, పర్యావరణ మంత్రిత్వ శాఖల సహాయ సహకారం ఉంది. ఫలితాలు ఆగస్టు 30న ప్రకటించబడతాయి.

## పార్లమెంటరీ నివేదికలను విమర్శించొద్దు
### నిర్మాణాత్మక పద్ధతిలో తీసుకోండి
### ప్రభుత్వాలకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా విజ్ఞప్తి

**ముంబయి :** పార్లమెంటరీ కమిటీ నివేదికల తీరుతెన్నులను విమర్శించకుండా వాటిని ప్రభుత్వం నిర్మాణాత్మక పద్ధతుల్లో పరిగణనలోకి తీసుకోవాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా కోరారు. పార్లమెంటు, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టసభల అంచనా కమిటీల జాతీయ సదస్సు ముగింపు సమావేశంలో మంగళవారంనాడు మాట్లాడుతూ, పార్లమెంటరీ కమిటీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండకుండా, ప్రభుత్వానికి ఒక మార్గదర్శకంగా ఉండాలని ఈ చర్చల సందర్భంగా ఒక బలమైన అభిప్రాయం రూపుదిద్దుకుందని ఓం బిర్లా అన్నారు. ''ప్రభుత్వం కూడా ఈ పార్లమెంటరీ కమిటీల నివేదికలను కార్యాచరణలో అమలు చేయడానికి వీలుగా తీవ్రంగా పరిగణించాలి, నిర్మాణాత్మక పద్ధతుల్లో వ్యవహరించాలి. అధికారులు కూడా ఈ నివేదికలను చిత్తశుద్ధితో పరిగణనలోకి తీసుకోవాలి, తీసుకున్న చర్యల నివేదికను సకాలంలో సమర్పించాలి'' అని కోరారు. పార్లమెంటరీ కమిటీలలో సభ్యులుగా ఉన్నవారంతా ప్రజాసేవలో గొప్ప అనుభవం ఉన్నవారేననీ, అందువల్ల చర్చల సందర్భంగా వారంతా తమ అనుభవాలను రంగరించి నివేదికల రూపకల్పనకు దోహదపడాలని అన్నారు. ''ప్రజలజీవనాడికి ప్రతిబింబంగా ప్రజాస్వామ్యాన్ని మన దేశ మూలవిరాట్టులు అర్థం చేసుకుని రూపొందించారు, ప్రభుత్వం నుండి ప్రజలు ఏం ఆశిస్తున్నారో అర్థం చేసుకుని ప్రజాస్వామ్యాన్ని రూపొందించారు'' అని బిర్లా చెప్పారు. అందువల్ల ప్రజలకు చట్టసభలలో ప్రాతినిధ్యం వహించే సభ్యులు ప్రజల ఆశయాలు, వారి అంచనాలు, కోరికలను అర్థం చేసుకుని వారి స్వరాన్ని తమ గొంతులో వినిపించి అవన్నీ అమలయ్యేందుకు భరోసా ఇవ్వాలని, అందుకు తగిన కృషి చేయడం చట్టసభల్లో సభ్యుల బాధ్యతనీ చెప్పారు.''పరిపాలనలో బ్రహ్మాండమైన బాహాటత్వ విధానం ప్రభుత్వాలు అత్యుత్తమస్థాయిలో పనిచేయడానికి దారితీయగలవు, అది కేంద్రం కావచ్చు, రాష్ట్ర ప్రభుత్వం కావచ్చు'' అన్నారు. పార్లమెంటు అంచనాల కమిటీ ఏర్పడి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రెండు రోజులపాటు జరిగిన ఈ సదస్సును నిర్వహించారు.

### వ్యవసాయాన్ని పండుగగా మార్చింది
# సిఎం సారథ్యంలోని 'ప్రజాప్రభుత్వమే'
### రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ



**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి :** వ్యవసాయాన్ని పండుగగా మార్చింది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రజా ప్రభుత్వమేనని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి రాజనర్సింహ అన్నారు. మంగళవారం అందోల్ వ్యవసాయ క్లస్టర్ సంగుపేట గ్రామంలోని రైతు వేదికలో నిర్వహించిన రైతు పండుగ సబంరాలలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి అధికారులను, రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో తొమ్మిది రోజుల్లో 9వేల కోట్లు రైతు భరోసా నిదులురైతుల ఖాతాలలో జమ చేసి రైతులకు అండగా నిలిచామన్నారు. జిల్లాలో 3,75,932 మంది రైతుల ఖాతాలలో రూ. 425.17 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. 18 నెలల కాలంలో రాష్ట్రంలో 80 వేల కోట్ల రూపాయలు వ్యవసాయఅబివృద్ధికి కేటాయించారన్నారు. సంగారెడ్డి జిల్లాలో 3,12879 మంది రైతుల ఖాతాలలో రూ.383.48 కోట్ల రూపాయలు ఎకరాలకు ఆరువేల చొప్పున పెట్టుబడి డబ్బులు రైతు భరోసా పథకం కింద జమ చేసినట్లు తెలిపారు. జిల్లాలో భరోసా 96 శాతం మంది రైతులకు అందజేసినట్లు త్వరలో మిగిలిన ఐదు శాతం మంది రైతులకు కూడా రైతు భరోసా అందించనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో రైతు భరోసా పథకం కింద లబ్ది పొందిన రైతులు రైతు భరోసా డబ్బులను వినియోగించుకొని నాణ్యమైన ఎరువులను ,విత్తనాలను ప్రభుత్వ గుర్తింపు పొందిన లైసెన్స్ డీలర్ల వద్ద కొనుగోలు చేసి బంగారు పంటలు పండించాలని ఈ సందర్భంగా జిల్లాలోని రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జోగిపేట మార్కెట్ కమిట చైర్మన్ జగన్మోహన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్, ఆర్డీఓ పాండు సంబందిత శాఖల అధికారులు రైతులు ,రైతు సంఘనాయకులు ప్రజాప్రతినిదులు తదితరులు పాల్గొన్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని..
## బిజెపి డిమాండ్ చేయడం బిసిలను మోసం చేయడమే
### బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బిజెపి డిమాండ్ చేయడం బిసిలను మోసం చేయడమే అని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బిసి రిజర్వేషన్లు 42 శాతం పెంచే అధికారం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ఉన్నప్పటికీ, రిజర్వేషన్లు పెంచకుండా ఒకవైపు బిసిలకు అన్యాయం చేస్తూ ఇంకొకవైపు బిజెపి నేతలు రాష్ట్రంలో 42 శాతం బిసి రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు తక్షణమే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. బిసిల విషయంలో బిజెపి ద్వంద ప్రమాణాలు పాటిస్తుందని జాజుల శ్రీనివాస్ గౌడ్ మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తీవ్ర స్థాయిలో విమర్శించారు. ఇటీవల కేంద్ర మంత్రి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి, బిజెపి ఫ్లోర్ లీడర్ మహేశ్వర్ రెడ్డిలు మాట్లాడుతూ తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కూడా పెంచాలని డిమాండ్ చేస్తూ మాట్లాడుతున్నారని, వాస్తవానికి రిజర్వేషన్లు పెంచే అధికారం కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి ఉన్నప్పటికీ బిసిలను తప్పుదోవ పట్టించడానికి పదేపదే బిసి రిజర్వేషన్ల పెంపు అంశం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బిసి రిజర్వేషన్ల ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి జులై మొదటి వారంలో రాష్ట్రవ్యాప్తంగా జాతీయ రహదారులను దిగ్భంధిస్తామని, రాష్ట్రంలో ఎక్కడికక్కడ బిసి ద్రోహుల పార్టీ కార్యాలయాలను ముట్టడించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతామని శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు.

## డ్రగ్స్ అమ్మకాలతో ఊడిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఉన్నత చదువులతో బిటెక్ పూర్తి.. చదివిన చదువుతో సాఫ్ట్వేర్ ఉద్యోగం.. సాఫ్ట్వేర్ ఉద్యోగంతో జీవితాన్ని స్వార్ధకతకు నిదర్శనంగా మలుచుకోవాల్సిన పరిస్థితుల్లో వ్యక్తి అంచలంచలు గా ఎదగాల్సిన స్థితిలో డ్రగ్స్ అలవాటు పడి అమ్మకాలకు దిగి నిలువునా కటకటాల పాలైన సాఫ్ట్వేర్ ఉద్యోగి కథనం ఇది. సాఫ్ట్వేర్ ఉద్యోగంతో వస్తున్న లక్షల జీతాలు సరిపోవంటూ డ్రగ్స్ అమ్మకాలకు దిగడంతో చేస్తున్న ఉద్యోగం ఊడింది. ఒకటికి రెండుసార్లు ఎక్సైజ్ సిబ్బందికి పట్టుబడి కటకటాలు లెక్కించాల్సిన పరిస్థితి ఇరుక్కున్నాడు. వివరాల్లోకి వెళితే.. ప్రకాశం జిల్లా దర్శి ప్రాంతానికి చెందిన వి. వెంకట జగదీశ్వర్ రెడ్డి (25) బీటెక్ చదివి బెంగళూరులో కాట్నీవెల్ అనే సాఫ్ట్వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తూ బెంగళూరులో డ్రగ్స్ కి అలవాటు పడ్డాడు.బెంగళూరుకు చెందిన సైఫ్ షరీఫ్ అనే వ్యక్తి వద్ద రూ. 1500 ఒక గ్రాము చొప్పున ఎండిఎం ఏ డ్రగ్స్ ను కొనుగోలు చేసి హైదరాబాదులో రూ. ఐదువేల నుంచి 8 వేల వరకు గ్రామ చొప్పున అమ్మకాలు జరుపుకుంటున్నాడు. ఈ మధ్యనే ఎండిఎం డ్రగ్స్ అమ్మకాలు జరుపుతూ ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడి జైలుకు వెళ్లి వచ్చి కండిషన్ మెయిల్ పై జీవిస్తున్నాడు. మళ్లీ ఎండిఎం డ్రగ్స్ తో మంగళవారం డిటిఎఫ్ శంషాబాద్ టీంకు పట్టుబడి మరో మారు కటకటాలకు వెళ్లాల్సి వచ్చింది. తాజాగా మంగళవారం రాజేంద్రనగర్ మండలం మైలార్ దేవులపల్లిప్రాంతం మైఫిల్ హోటల్ సమీపంలో డ్రగ్స్ ను తీసుకు వెళ్తుండగా డిటిఎఫ్ సిఐ ప్రవీణ్ కుమార్ ఆయన సిబ్బంది కలిసి పట్టుకున్నారు. నిందితుడి వద్ద 23.3 ఎండిఎం ఏ డ్రగ్స్ పట్టుకున్నారు. సెల్ ఫోను, నిందితుడు వద్ద ఉన్నటువంటి బైకును కూడా స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్స్ ను పట్టుకున్నటువంటి ప్రవీణ్ కుమార్ బృందాన్ని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ దశరథ్, శంషాబాద్ ఎక్సైజ్ సూపరింటెడెంట్ కృష్ణప్రియలు అభినందించారు.

## సిఎం రేవంత్ రెడ్డి చిల్లర బుద్ధిని మరోసారి ప్రదర్శించారు : హరీశ్‌రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రభుత్వ కార్యక్రమంలో ప్రత్యేక రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్‌పైన రేవంత్ రెడ్డి సంస్కారం లేకుండా మాట్లాడి, తన చిల్లర బుద్ధిని మరోసారి ప్రదర్శించారని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. తెలంగాణ కు శనిలా, శాపంలా మారిన రేవంత్ రెడ్డి 'ఉల్టా చోర్ కొత్వాల్‌కు డాంటే' అనే రీతిలో పదేళ్ల కెసిఆర్ పాలనలో సాధించిన అద్భుత ప్రగతిని, తక్కువ చేసి చూపి రాష్ట్ర ప్రజలను అవమానించారని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుంటే, ఎటూపాలుపోక నిరాశ నిస్పృహలతో,ప్రతి రోజూ అబద్దాలు, బూతులతో రేవంత్ రెడ్డి నెట్టు కొస్తున్నారని మండిపడ్డారు.స్థానిక ఎన్నికల నేపథ్యంలోనే విధి లేని పరిస్థితుల్లో 'రైతుభరోసా' వేసి తానే రైతులకు ఛాంపియన్ అనే బిల్డప్ ఇస్తే రేవంత్ రెడ్డిని ఎవరు నమ్ముతారని ప్రశ్నించారు. పదేళ్ల కెసిఆర్ పాలన లో తెలంగాణ ఎడారి గా మారితే, ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ ఎలా అవుతుందని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కనీసం ఒక చెక్ డ్యామ్ కట్టారా?,ఒక కాలువనైనా తవ్వారా?, అని ప్రశ్నించారు.

### ఎవరు త్యాగాలు చేసినా కీర్తించడం
## తెలంగాణ వారసత్వ సంస్కృతి



### ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం.కోదండరామ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** త్యాగాలకు కులం, మతం, ప్రాంతీయత ఉండబోదని, ఎవరు త్యాగాలు చేసినా కీర్తించడం తెలంగాణ వారసత్వ సంస్కృతి అని టిజెఎస్ అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్ అన్నారు. పీర్ల పండుగకు ప్రభుత్వసెలవు ప్రకటించడమే కాదని, సంపూర్ణంగా సహకరించాలని కోరారు. ఈ విషయాన్ని తాను రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, తన వంతు కృషి చేస్తానని హామీనిచ్చారు. 'మొహరం పీర్ల పండుగ' నిర్వాహకుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం సోమాజిగూడలోని హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం జరిగింది. టిఎఫ్‌టియు రాష్ట్ర అధ్యక్షులు కాచం సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య వక్తలుగా టిజెఎస్ అధ్యక్షుడు, ఎంఎల్‌సి ప్రొఫెసర్ ఎం.కోదండరామ్,మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్, ప్రముఖ రచయిత కవులు మాస్టర్‌జి,టిఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్, మొహరం నిర్వాహకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గట్టన్న, శ్రీధర్ , సాజిదా సిఖిందర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోదండరామ్ మాట్లాడుతూ భూమి, ప్రజల కోసం ప్రాణలు అర్పించిన వారి త్యాగానికి గుర్తుగా పీర్ల పండుగ నిర్వహించుకోవడం తెలంగాణలో ఆనవాయితీ అని వివరించారు. ప్రజల ఐక్యతతోనే ఏ డిమాండ్‌నైనా సాధించుకోవచ్చని, పీర్ల పండుగను రాష్ట్ర పండుగగా నిర్వహించుకునేందుకు అందరూ కలిసి కృషి చేయాలని కోదండరామ్ పిలుపునిచ్చారు. కాచం సత్యనారాయణ మాట్లాడుతూ పీర్ల పండుగ సబ్బండ వర్గాలు నిర్వహించే తెలంగాణ సాంస్కృతిక చిహ్నం అని, ఈ పండుగ నిర్వహణకు ప్రభుత్వం తగిన నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడినప్పుడే మొహరంను రాష్ట్ర పండుగగా గుర్తించకపోవడం ఒక విషాదంగా ఆయన అభివర్ణించారు. బతుకమ్మ, బోనాల తరహా పీర్ల పండుగకు ప్రభుత్వం తగిన గుర్తింపు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ పీర్ల పండుగకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇచ్చేలా తన వంతు కృషి చేస్తామని హామీనిచ్చారు. పీర్ల పండుగ తెలంగాణలో ఒక విశిష్టత కలిగిన పండుగగా అని అన్నారు. సకల కులాలు,సబండ ప్రజలు ప్రత్యక్ష, పరోక్ష భాగస్వాములయ్య పండుగ మొహరం అని అన్నారు. టిఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ మాట్లాడుతూ పీర్ల పండుగ తెలంగాణ ప్రాంత ఆత్మీయ పండుగగా ప్రజలు చెప్పకుంటున్నారన్నారు. కాగా ఈ సమావేశంలో డప్పు,సన్నాయి కళాకారుల ప్రదర్శన ఆలరించింది.ఈ సమావేశంలో టిఎఫ్‌టియు నాయకులు పి విజయకుమార్, నాయకులు బాల కృష్ణ, ముజీబ్, చారి, గోపాల్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మలివిడత భూ సమీకరణ
### అమరావతి కోసం మరో 44వేల ఎకరాలు
### ఎపి రాష్ట్ర మంత్రి మండలి కీలక నిర్ణయాలు

**అమరావతి :** అమరావతి రాజధానిలో మౌలిక సౌకర్యాల కల్పన కోసం మలివిడత భూ సమీకరణ చేయాలని రాష్ట్ర మంత్రిమండలి నిర్ణయించింది. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఒకే రకమైన రూల్స్‌తో ల్యాండ్ పూలింగ్ విధానంలో మరో 44వేల ఎకరాల సేకరణకు కీలక నిర్ణయం తీసుకుంది. స్వర్ణాంధ్ర పీ4పై త్వరలో కమిటీలు ఏర్పాటు చేయడానికి ఆమోదం తెలిపింది. వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో మొత్తం 42 అంశాలకు ఆమోదం తెలిపారు. అజెండా అంశాల అనంతరం రాజకీయ అంశాలపై చర్చించారు. రాజధాని అమరావతిలో చేపడుతున్న మలివిడత భూ సమీకరణపై మంత్రిమండలిలో చర్చించారు. తొలివిడత భూ సమీకరణకు వర్తించిన నిబంధనలే..మలివిడత భూ సమీకరణకు వర్తింపచేయాలని నిర్ణయించారు. అనంతరం మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వెల్లడించారు.

ప్రపంచ స్థాయి సంస్థలను, విద్యను, వైద్యాన్ని, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్ చేయాలని భావించిందన్నారు. యూనిఫాం ఫ్రేమ్‌వర్క్‌తో ల్యాండ్ పూలింగ్ చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఎన్‌జీటీ సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు వాటర్ బాడీస్ పరిరక్షించే విధంగా నిబంధనలను రూపొందించడం జరిగిందని, ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ల్యాండ్ పూలింగ్ చేయాలనే నిర్ణయం తీసుకోవడంతో పాటు రైతులకు మెరుగైన ప్యాకేజీ అందించాలని మంత్రి వర్గం నిర్ణయించినట్లు మంత్రి పేర్కొన్నారు.

## ఐక్యత దిశగా టిజిఎస్ ఆర్‌టిసి కార్మికసంఘాలు


**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఐక్యత దిశగా టిజిఎస్ ఆర్‌టిసి కార్మిక సంఘాలు వడివడిగా ముందుకు కదులుతున్నాయి. టిజిఎస్ ఆర్‌టిసిలో కార్మిక సంఘాల నాయకులు ఒక్కతాటిపైకి వచ్చేందుకు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఒకే వేదిక నుంచి పోరాటాలు సాగిస్తేనే కార్మికుల న్యాయమైన హక్కులు సాధిస్తామనే నమ్మకంతో సంఘాల నాయకులు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఇప్పటి వరకు సంస్థలో కార్మిక సంఘాల ఐక్య కార్మిక సంఘాలు( జెఎసి)లు రెండు ఉండేవి. రెండు జెఎసిలను రద్దు చేస్తున్నట్లు సంఘాల ప్రతినిధులు వెల్లడించారు. హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం టిజిఎస్ ఆర్‌టిసి కార్మిక సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గతంలో ఏర్పడిన జెఎసి 1, జెఎసి 2లను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. జూలై 2వ తేదీన ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు హాజరుకావాలని అన్ని కార్మిక సంఘాలు నిర్ణయించాయి. ఆ సమావేశంలో భవిష్యత్ కార్యాచరణపై విధివిధానాలపై చర్చిస్తామని కార్మిక సంఘాలు ప్రకటించాయి. ఈ సమావేశంలో ఈయు ఎఐటియుసి, టిఎంయు 1, టిఎంయు 2, ఎస్‌డబ్ల్యూఎఫ్ సిఐటియు, టిజెఎంయు, ఎస్‌డబ్ల్యూయు ఐఎన్‌టియుసి, ఎన్‌ఎంయు, బికెయు, బిడబ్ల్యూయు, కెఎస్ బిఎంఎస్, కెపి ఐఎన్‌టియుసి, ఎస్‌టిఎంయు సంఘాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

### ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలపై
## జిల్లా డిఇఒకు ఎందుకీ మమకారం
### ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్




**ప్రజాపక్షం/కాప్రా :** మామూళ్ల మత్తులో ఉన్న జిల్లా విద్యా శాఖ యంత్రాంగం ప్రభుత్వ పాఠశాలలను పట్టించుకోకుండా ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలకు బహిరంగంగానే మద్దతు పలుకుతున్నారని, ఈ విషయంలో జిల్లా కలెక్టర్‌తో పాటు విద్యా శాఖ ఉన్నతాధికారులు నిష్పాక్షిత విచారణ జరిపించాలని ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్ డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్, సాయిలు, అక్షర్‌లతో కల్సి ఆయన మాట్లాడుతూ ఇటీవలే కుషాయిగూడ పారిశ్రామిక ప్రాంతంలో సెయింట్ ఆన్స్ పేరిట వెలిసిన కార్పొరేట్ సంస్థకు అవసరమైన పూర్తి స్థాయిలో అనుమతులు లేవన్నారు. తమ డిమాండ్, ధర్నా ఫలితంగా పాఠశాలను సీజ్ చేస్తున్నామంటూ వచ్చిన కాప్రా మండల విద్యా శాఖాధికారి తూతూ మంత్రంగా రెండు గేట్లకు గాను ఒక దానికి తాళాలు వేసి పరోక్షంగా మరో గేట్ ద్వారా కార్యాకలాపాలు చేసుకోమని చెప్పారన్నారు.

## సీనియర్ ఫోటోజర్నలిస్టు భాషా ఆకస్మిక మృతి



**హైదరాబాద్ :** సీనియర్ ఫోటోజర్నలిస్టు షేక్ హబూబ్ భాషా (56) ఆకస్మిక మృతిపై తెలంగాణ రాష్ట్ర ఫోటో జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు అనుమల్ల గంగాధర్, కార్యదర్శి కె.ఎన్.హరి, కార్యవర్గ సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. 1969 సంవత్సరంలో కర్నూల్ పట్నంలో జన్మించిన భాషా, ఫోటో జర్నలిస్టుగా 2002లో హైదరాబాద్‌లో తన కెరీర్ మొదలు పెట్టారు. హైదరాబాద్ మిర్రర్, వార్త, ఆంధ్రప్రభ, సూర్య, మన తెలంగాణ పత్రికల్లో తన కెమెరాతో అద్భుతమైన చిత్రాలను అందించారు. పనిలో ఎప్పుడూ రాజీ పడలేదు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దగ్గర ఫోటోగ్రాఫర్‌గా తన సేవలందించారు. కొంత కాలంగా కిడ్నీ సమస్యలతో బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నారు. శనివారం ఆకస్మికంగా అనారోగ్యానికి గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతి చెందారు. భాషాకు భార్య, ఇద్దరు పిల్లలు కుమార్తె షహనాజ్ (22), కుమారుడు షోయబ్ (21) వున్నారు. ఆయన అంత్య క్రియలు బుధవారం ఉదయం అంబర్పేటలో జరగనున్నాయి.

## 'బ్లాక్‌మ్యాజిక్'పై వెనక్కి తగ్గిన కేరళ

**కొచ్చి:** కేరళలోని వామపక్ష ప్రభుత్వం... 'బ్లాక్‌మ్యాజిక్ బ్యాన్' అంశంపై వెనక్కి తగ్గింది. చేతబడి, క్షుద్ర పూజలు లాంటి అమానవీయ ప్రక్రియలను నిషేధించాలనే చట్టాన్ని రూపొందించడం లేదని హైకోర్టుకు ప్రభుత్వం స్పష్టం చేసింది. తమ విధానంలో భాగంగా రాష్ట్ర కేబినెట్ ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్లు ప్రభుత్వం తెలిపింది. బ్లాక్‌మ్యాజిక్‌ను బ్యాన్ చేసే చట్టాన్ని తయారు చేస్తున్నారా అన్న అంశంపై కేరళ హైకోర్టులో ప్రభుత్వం ఈ మేరకు అఫిడవిట్ దాఖలు చేసింది. చట్టం చేయలేని పక్షంలో.. చేతబడి, క్షుద్ర పూజల్లాంటి వాటిని కంట్రోల్ చేసేందుకు ఎటువంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలని కోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది.

## నిరుపేదల చికిత్సలకు సిఎంఆర్‌ఎఫ్ వరం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ఆర్థికంగా డబ్బుతో కూడిన శస్త్ర చికిత్సలకు నోచుకోలేని వారికి సిఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగకరమని, అవసరమైన వారు దీనికోసం తనను సంప్రదించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. మౌలాలి డివిజన్‌కు చెందిన చంద్రకళకు రూ.21వేలు, సునీతకు రూ.21వేలు, మోహన్‌కు రూ.21వేలు, వినాయకనగర్ డివిజన్‌కు చెందిన ఇందిరకు 60వేల రూపాయల చెక్కులను కార్పొరేటర్ సునీత రాము యాదవ్, బిఆర్‌ఎస్ శ్రేణులు జగదీష్, అమినుద్దీన్, భాగ్యనందరావు, ఉస్మా న్, మారుతి ప్రసాద్, వంశీలతో కల్సి ఆయన పంపిణీ చేసారు.

## జిహెచ్‌ఎంసి సిబ్బందికి స్థానికులు సహకరించాలి



**ప్రజాపక్షం/కాప్రా :** రానున్న వర్షాకాలం దృష్ట్యా రోగాల బారిన పడకుండా ఉండేందుకు గాను శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి తెలిపారు. పరిసరాల పరిశుభ్రతలో జిహెచ్‌ఎంసి సిబ్బందికి స్థానికులు సహకరించాలని ఆయన కోరారు. గురువారం కాప్రా సర్కిల్ శానిటేషన్ విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక రుతుపవన శానిటేషన్ డ్రైవ్‌ను పారంభించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ మధుసుధన్ రావు , శానిటేషన్ సూపర్‌వైజర్ సుదర్శన్, జవాన్లు యాదగిరి, ప్రభాకర్, ఎస్‌ఎఫ్‌ఎ లక్ష్మి , స్వప్న, లలిత, స్థానికులు శ్రీనివాస్, తండా వాసుగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## ట్రంప్ నిర్ణయాలు మానవాళికి హానికరం

### ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా కౌన్సిల్ సమావేశం మంగళవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవనల్‌లో పీర్ మహమ్మద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశనికి సిపిఐ రాష్ట కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, విజయలక్ష్మి హాజరైనారు. ఈ సందర్భంగా రాష్ట కార్యదర్శి మాట్లాడుతూ ఇరాన్‌పై అమెరికా దాడిని తీవ్రంగా ఖడించారు. ట్రంప్ వ్యవహార శైలి నిర్ణయాలు మానవాళికి హానికరమని ప్రతి ఒక్కరూ ఈ చర్యలను ఖండించాలని తెలిపారు. గుజరాత్‌లో విమాన ప్రమాదంలో మరణించిన వారికి సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నిర్మాణంపై జిల్లా సమస్యలను చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాల్ రెడ్డి, వెంకటేష్, అబ్దుల్లా, బషీర్ అహ్మద్, సురేష్, మునీర్, చంద్రయ్య, రవీందర్, అనంతయ్య, తదితరులు పాల్గొన్నారు.

## 5198మంది రైతుల ఖాతాల్లో రూ.5.03కోట్లు జమ



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** రైతు భరోసా పథకం ద్వారా అన్నదాతకు అండగా ఉండే లక్ష్యంగా ప్రభు త్వం ఆర్థికంగా చేయూతను అందిస్తోందని జిల్లా కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద జిల్లాలో 5198 మందికి రైతుల ఖాతాల్లో రూ.5.03 కోట్లు జమ చేయటం జరిగిందని, విడతల వారీగా వారికి నేరుగా బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేస్తుంటామన్నారు. వ్యవసాయానికి పెట్టుబడి భారాన్ని తగ్గించి వ్యవసాయోత్పత్తు లు పెంపొందించుకొనేందుకు ఈ పథకం ఉపయోగకరంగా ఉంటుందన్నారు.




## సెయింట్ ఆన్స్ స్కూల్ వద్ద ఎమ్మెల్యే ధర్నా

### స్కూల్‌ను సీజ్ చేసిన ఎంఇఒ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కుషాయిగూడలో ఏర్పాటు చేసిన నకిలీ సెయింట్ ఆన్స్ స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో స్కూల్ ముందు ధర్నాకు దిగారు. కుషాయిగూడ పారిశ్రామిక వాడ ప్రాంతంలో సెయింట్ అన్నేస్‌ను సెయింట్ అన్స్‌గా బోర్డు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న స్కూల్ గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ ఎంఎల్‌ఎతో పాటు కార్పొరేటర్లు సింగిరెడ్డి శిరీషాసోమశేఖర్‌రెడ్డి, పన్నాల దేవేందర్‌రెడ్డి, జె ప్రభుదాస్,రాష్ట్ర నాయకులు సోమశేఖర్‌రెడ్డిలు ధర్నా నిర్వహించారు. దీంతో దిగివచ్చిన ఎంఇంఒ బాపిరెడ్డి డిఇఓ విజయకుమారి ఆదేశాల మేరకు స్కూల్‌ను సీజ్ చేసి విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని ఎంఇఒ తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు,కార్యకర్తలు,విద్యార్థి సంఘాలు తదితరులు పాల్గొన్నారు.



## 8 రైతు వేదికల ద్వారా సిఎం రైతు భరోసా సభలు

**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణా సచివాలయం ఎదుట గురువారం నిర్వహించిన రైతు భరోసా సభ సందర్భంగా మేడ్చల్ జిల్లాలో ఏర్పాటు చేసిన 8 రైతు వేదిక కేంద్రాల్లో రైతు నేస్తం కార్యక్రమాలు నిర్వహించారు. శామీర్‌పేట, సింగాయిపల్లి, కీసర, యాద్గార్‌పల్లి, మూడుచింతలపల్లి, మేడ్చల్, ఘట్‌కేసర్, మండలాల్లో రైతు నేస్తం నిర్వహించగా మూడుచింతలపల్లి మండలంలోని రైతు వేదిక ద్వారా జిల్లా కలెక్టర్ మనుచౌదరి పాల్గొన్నారు. ఆయా రైతు వేదికల్లో పాల్గొన్న అధికారులు, రైతులు, జిల్లా అధికారులు, వ్యవసాయాధికారులు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టివి స్క్రీన్‌ల ద్వారా సిఎం సభను లైవ్‌లో తిలకించి ప్రసంగాన్ని విన్నారు.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపాలిటీ, మెప్మా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమీషనర్, ఎన్. వేంకటేశ్వర నాయక్ ప్రారంభించారు. ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో భాగంగా మహిళా సంఘాల సభ్యులు స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమానికి మహిళా సంఘాలు తయారు చేసిన తినుబండరాల ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాలను దుండిగల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సతీష్ కుమార్, క్రైమ్ సిఐ సతీష్ పరిశీలించారు. మహిళలు ప్రభుత్వ సహకారంతో వ్యాపారాలలో సైతం రాణి స్తూ మరొకరికి ఉపాధి కల్పిం చే విధంగా ఎదగాలన్నారు. ప్రభుత్వం మహిళా సంఘాలకు అనేక విధాలుగా కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ లక్ష్మయ్య, మెప్మా సిఓ మంజుల, ఆర్‌పిలు, మెప్మా సంఘాల సభ్యులు, వివిధ శాఖల ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

## దమ్మాయిగూడ నూతన కమిషనర్‌గా వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/దమ్మాయిగూడః** దమ్మాయిగూడ మున్సిపల్ నూతన కమిషనర్‌గా ఎన్ వెంకట్‌రెడ్డి మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు పనిచేసిన నాగమణి స్థానంలో వెంకట్‌రెడ్డిని దమ్మాయిగూడకు బదిలీ చేసింది. ఆయన బాధ్యతలు చేపట్టిన సందర్భంగా ప్రస్తుత కమిషనర్ నాగమణి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. మున్సిపల్ సిబ్బంది ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

### లైసెన్స్ లేకుండా నడిపిస్తున్న

## వ్యాపార కేంద్రాలపై చర్యలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ డిప్యూటీ కమిషనర్‌కు వినతి



**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** కుత్బుల్లాపూర్ సర్కిల్ లోని అనేక ప్రాంతాల్లో ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపార కేంద్రాలను నడిపిస్తు, అక్రమ వ్యాపారం చేస్తూ, నకిలీవి వాడుతు వినియోగదారులను మోసం చేస్తున్నారని, టాక్స్‌లు కూడా లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ ప్రజల వద్ద అధిక ధరలకు అమ్ముతున్నారని కావున అలాంటి వ్యాపార కేంద్రాలను మూసి వెయ్యాలని, అలాగే షాప్‌లను రోడ్డు పైనవరకు షెడ్డులు వెయ్యడం వల్ల, రోడ్డు పైన పార్కింగ్ వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందని అలాంటి వాటిని వెంటనే తొలగించాలని నేడు సిపిఐ కుత్బుల్లాపూర్ మండల సమితి ఆధ్వర్యంలో కుత్బుల్లాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ నర్సింహా కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఇలాంటివి తమ దృష్టిలో ఉన్నాయని అలాంటివాటిని గుర్తించి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి స్వామి, సహాయ కార్యదర్శి హరినాథ్, సిపిఐ నాయకులు నర్సింహారెడ్డి, కనకయ్య, ప్రభాకర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా కూల్చివేతలు




**ప్రజాపక్షం/దుండిగల్:** అక్రమనిర్మాణాలపై హైడ్రా అధికారులు కొరడా ఝుళించారు. దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేటలో హైరైజ్ నిర్మాణదారుడు 10 సంవత్సరాల క్రితం రోడ్డును ఆక్రమించి విల్లాలు నిర్మించడంతో అప్పట్లో విమర్శలు వెల్లువెత్తాయి. పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా సమస్యను గాలికి వదిలేశారు. విసుగెత్తిన స్థానికులు హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన అధికారులు మంగళవారం రోడ్డుకు అడ్డంగా నిర్మించిన ప్రహారీగోడను మున్సిపల్ సిబ్బందితో కలసి కూల్చివేశారు. మల్లంపేట కెవిఆర్ వెంచ ర్లో రోడ్డును ఆక్రమించి అక్రమనిర్మాణాలు చేపట్టడంతో ఫిర్యాదుల ఆధారంగా అధికారులు కూల్చివేశారు. స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఘర్షణ వాతావరణం చోటుచేసుకుంది. హైడ్రా అధికారుల చర్యలతో పాత సమస్యలు పరిష్కారం అవుతుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా అధికారులు, సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిపిఐ రాష్ట్ర మహాసభలకు ఆర్థికంగా సహకరించాలి

### దామోదర్‌రెడ్డి

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఆగస్టు 19 నుండి 22 వరకు కుత్బుల్లాపూర్‌లో జరుగనున్న సిపిఐ రాష్ట్ర మహాసభలకు పారిశ్రామికవేత్తలు, శ్రేయోభిలాషులు విరాళాల రూపంలో ఆర్థిక సహకారం అందించాలని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు దామోదర్‌రెడ్డి కోరారు. మంగళవారం యాప్రాల్‌లోని పార్టీ కార్యాలయంలో అల్వాల్ మండల కార్యదర్శి అమరావతిబాబు అధ్యక్షతన జరిగిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి 1000 మందికి పైగా పార్టీ ప్రతినిధులు హాజరు కానున్నారని, ఈ మహాసభలను కార్యకర్తలందరూ సమిష్టిగా పనిచేస్తూ భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు కె.సహదేవ్, రైతు సంఘం నేతలు జంగయ్య, ఏఐవైఎఫ్ నేతలు, తదితరులు పాల్గొన్నారు.



## యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం : స్పీకర్

**ప్రజాపక్షం/మోమిన్‌పేట్:** వికారాబాద్ నియోజకవర్గంలోని మోమిన్‌పేట్ మండలంలోని వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శాసనసభ సభాపతి ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా 70లక్షల వ్యయంతో పిడబ్లుడి రోడ్డు నుండి బాల్‌రెడ్డి గూడవరకు బి.టి రోడ్డు శంకుస్థాపన, 60లక్షలతో బాల్‌రెడ్డి గూడలో చేపట్టిన అంతర్గత రోడ్లను ప్రారంభించారు. 67లక్షలతో పిడబ్లుడి నుండి ఎన్కెపల్లి వరకు బిటి రోడ్డు పనులకు శంకుస్థాపన, మోమిన్‌పేట్ మండల కేంద్రంలో 80లక్షల వ్యయంతో నిర్మించిన డిసిసిబి భవనం ప్రారంభించారు. కేసరంలో 3.06కోట్ల వ్యయంతో చేపట్టే 33/11 కె వి విద్యుత్ సబ్ స్టేషన్‌కు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ పారిశ్రామిక పర్యాటక రంగాలను అభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తన లక్ష్యమని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో వికారాబాద్ నియోజకవర్గం అభివృద్ధి కోసం కావలసిన నిధులను మంజూరు చేస్తున్నామన్నారు. ప్రభుత్వం వచ్చా క మొదట రోడ్లను బాగు చేస్తున్నానని ఆయన తెలిపారు.

ఇప్పటివరకు 600కోట్ల రూపాయలు రోడ్లకోసం మంజూరు అయ్యాయని తెలిపారు. గల్లి గల్లీకి ప్రతి గ్రామం లో 60లక్షల నుండి కోటి రూపాయలతో సిసిరోడ్లు వేయిస్తున్నట్లు తెలిపారు. ఊర్లకు వెళ్లే తారు రోడ్లను కూడా అధిక నిధులను కేటాయిస్తూ పనులు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఓల్టేజి సమస్య పరిష్కరంకోసం నూతన విద్యుత్ ఏర్పాటు చేయడం జరుగుతుంది అని అన్నారు. రైతులు సంతోషంగా పంటలు పండించే విధంగా సహకార సంఘాలు తోడ్పాటు అందించాలని దీనితో పాటుగా ఎరువులు, విత్తనాలను కూడా సకాలంలో అందిస్తే రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని తెలిపారు. మోమిన్‌పేట్ బ్రాంచి బ్యాంక్ ఏడాదికి 165 కోట్ల రూపాయల వ్యాపారంతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ప్రథమ స్థానంలో ఉన్నందుకు స్పీకర్ అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్తయ్య, జనరల్ మేనేజర్ ప్రభకర్‌రెడ్డి, డిసిసిబి డైరెక్టర్ కిషన్‌నాయక్, అంజిరెడ్డి, మొగులయ్య, పిఎసిఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, రామచంద్రరెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, బ్యాంక్ మేనేజర్ నారాయణరెడ్డి, ఆర్టిఎ సభ్యులు జాఫర్, మార్కెట్ కమిటి చైర్మన్ మహేందర్‌రెడ్డి, మండల ప్రత్యేక అధికారి సదానందం, పంచాయతీరాజ్ ఇఇ ఉమేష్ కుమార్, మాధవ రెడ్డి, ఎంపీడిఓ విజయలక్ష్మి , తహసీల్దార్ రవీందర్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

**రైతు భరోసా విజయోత్సవ, వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న స్పీకర్, కలెక్టర్**

బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి రైతు భరోసా విజయోత్సవాల్లో భాగంగా మోమిన్‌పేట్ మండల రైతువేదిక నుండి రైతులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో స్పీకర్ ప్రసాద్‌కుమార్, జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ రైతులు పాల్గొని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రుల సందేశాన్ని వీక్షించారు.

## భూ కబ్జాదారులపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు

### నలుగురిపై కేసు నమోదు...వదిలిపెట్టే ప్రసక్తే లేదుః ఆర్‌ఐ ఖలీల్





**ప్రజాపక్షం/నిజాంపేట్:** కుత్బుల్లాపూర్ మండలం పరిధిలోని గాజులరామారంలో భూ కబ్జాదారులు రోజురోజుకి పేట్రేగిపోతున్నారు. ఇష్టానుసారంగా ప్రభుత్వ స్థలాలను మింగేస్తూ పబ్బం గడుపుకుంటున్నారు. ఇదేమిటని ప్రశ్నించిన వారిపై దాడులకు సైతం వెనుకడడం లేరు. దీంతో కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖలీల్ ఏకంగా ల్యాండ్ గ్రాబింగ్ కేసులను నమోదు చేయడం మొదలుపెట్టారు. కుత్బుల్లాపూర్ మండల పరిధిలోని గాజులరామారం సర్వే నంబర్లు 307, 342లలో వందలాది ఎకరాల ప్రభుత్వ స్థలం, చెరువులు, క్వారీలు ఉన్నాయి. భూ కబ్జాదారులు రాత్రికి రాత్రి భారీ టిప్పర్‌ల సహాయంతో క్వారీలను పూడ్చేసి తెల్లవారేసరికి ప్లాట్లుగా విభజించి గదులను సైతం నిర్మించడం ఇక్కడ సర్వసాధారణం.

పగలు టిప్పర్ వాహనాలను అడ్డుపెట్టి నిర్మాణాలను చేయడం, రాత్రి వేళల్లో రౌడీ మూకలను పెట్టి నిర్మాణాలను చేస్తుండడం ఇక్కడి నైజం. మండల రెవెన్యూ కార్యాలయం సమీప దూరంలోనే సర్వేనంబర్లు 307, 342లో వందలాది ఎకరాల ప్రభుత్వ స్థలం ఉంది. ఇటీవల నూతనంగా వచ్చిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖలీల్ 307, 342 సర్వేనంబర్లపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. సర్వేనంబ రు 307లోని ప్రభుత్వ స్థలం స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కి చెందినదని, సర్వేనంబరు 342 లోని ప్రభుత్వ స్థలాన్ని హెచ్‌ఎండిఎకి కేటాయించగా ప్రహరీ గోడను సైతం అట్టి సంస్థ నిర్మించింది. అయినా భూ కబ్జాదారులు ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ప్లాట్లుగా విభజించి విక్రయిస్తున్నారు. అయితే ఆర్‌ఐ ఖలీల్ ఎస్‌ఎఫ్‌సి ల్యాండ్ పై ఆరా తీయగా అట్టి సంస్థ నుండి స్థలాన్ని కాపాడాలన్న ఆలోచన ఏ అధికారికీ లేకుండా పోయింది. దీంతో ఇటీవల జరుగుతున్న నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించిన ఆర్‌ఐ ఖలీల్ కూల్చివేతలను ప్రారంభించారు. అయినా భూ కబ్జాదారులు వినకపోవడం, రాత్రికి రాత్రి నిర్మాణాలను చేపడుతుండడంతో నలుగురు భూ కబ్జాదారుల పై ల్యాండ్ గ్రాబింగ్ కేసులను నమోదు చేయాలని జగద్గిరిగుట్ట పోలీసులకు సిఫార్సు చేశారు. దీంతో భూ కబ్జాదారులైన రాజు రాజేంద్ర, నర్సింహ, శ్యాంలతో పాటు మరికొందరిపై ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదయ్యాయని ఆర్‌ఐ ఖలీల్ స్పష్టం చేశారు. దీనిపై ఆర్‌ఐ ఖలీల్‌ని సంప్రదించగా గాజులరామారంలోని సర్వేనంబర్లు 307, 342 లోని ప్రభుత్వ స్థలంపై పూర్తి విచారణ చేపట్టామని, కుత్బుల్లాపూర్ మండలాని కి వచ్చిన అనంతరం నూతనంగా నిర్మించిన నిర్మాణాలన్నింటిని కూల్చివేసి ప్రభుత్వ స్థలాన్ని కబ్జాచేసి నిర్మాణాలు చేపడుతున్న రాజు, రాజేంద్ర, శ్యాం, నర్సింహలతో పాటు మరికొందరిపై ల్యాండ్ గ్రాబింగ్ కింద 617/2025, 618/2025 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశామని ఖలీల్ తెలిపారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే సహించేది లేదని, ఎంతటి వారినైనా వదిలిపెట్టమని ఖలీల్ హెచ్చరించారు.



## రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం / కొడంగల్ :** కొద్దిగా ఆలస్యం అయినా ఇచ్చిన మాట తప్పకుండా రైతులను ఆదుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు భాందవుడని రైతులు హర్షం వ్యక్తం చేస్తు మంగళవారం మాజీ ఎంపిపి ముద్దప్ప దేశ్‌ముఖ్, పిఎసిఎస్ చైర్మెన్ కట్కం శివకుమార్, యూత్ కాంగ్రెస్ జాతీయ కోఆర్డినేటర్ కృష్ణంరాజులసమక్షంలో కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాదిన్నార కావస్తుందని ముందుగా ఒకటి రెండు ఎకరాల లోపు రైతులకు ఎకరానికి 12 వేల చొప్పున రైతు బరోసా ఇవ్వడం జరిగిందన్నారు. కాని గుట్టలు, కొండలు, భీడు భూములు, రియల్ ఎస్టేట్ వంటి భూములను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి వాటిని తొలగించి వ్యవసాయ భూములకు మాత్రమే రైతు భరోసాను వేయడం హర్షణీయమన్నారు. అనంతరం నాయకులు మాట్లాడుతు రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట నెలబెట్టుకోవడంలో తనకు సాటి ఎవ్వరు లేరని చెప్పుకొచ్చారు. కొడంగల్ నియోజకవర్గం నుంచి గెలిచి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు స్వీకరించి కొడంగల్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతు రైతులకు అండగా నిలవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కొడంగల్ మున్సిపల్ తాజా మాజీ కౌన్సిలర్ శంకర్‌నాయక్, మిఠాయి రాజు, నయ్యూం, అర్గె ఓంప్రకాశ్, యూత్ కాంగ్రెస్ తాలుక ఉపాధ్యాక్షుడు కృష్ణంరాజు, రాము, సయ్యద్ అశ్వక్, వెంకట్‌లతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**రైతులతో ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్స్ :**

తెలంగాణ రాష్ట్రంలో దాదాపు 70 లక్షల మంది రైతులకు రైతు భరోసా నిధులను విడుదల చేసి నేరుగా రైతుల ఖాతాల్లో జమచేయడంతో రాష్ట్రమంతా ఒక పండుగలా జరిగిందని అందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేరుగా రైతులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది. అందులో భాగంగానే కొడంగల్ మండల కేంద్రంలోని పర్సాపూర్ గ్రామంలోని రైతు వేదికలో జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ స్వయంగా రైతులతో కలిసి కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రైతులకు అందిస్తున్న సబ్సిడి రుణాలు, పథకాలు, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత కరెంటు వాటి ప్రయోజనాలపై అవగాహన కల్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మెన్ కట్కం శివకుమార్, తహాశీల్దార్ విజయ్‌కుమార్, ఎంపిడిఒ ఉషశ్రీ, వ్యవసాయ అధికారి తులసి, ఏఈవోలు అశ్విని, శ్రీపతిరెడ్డి, రాజు, పావని, దేవేందర్, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, సయ్యద్ అంజాద్, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌పార్టీ వల్లే పేదల సొంతింటి కల సాకారం



**ప్రజాపక్షం/ ఘట్‌కేసర్:** పేదల సొంతింటి కలను నేరవేర్చుతున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందని మేడ్చల్ నియోజకవర్గం బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ అన్నారు. మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ ఆదేశాల మేరకు మంగళవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎదులాబాద్ గ్రామంలోని ఇందిరమ్మ ఇండ్లను బిబ్లాక్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్,మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్య యాదవ్, మున్సిపల్ అధ్యక్షులు మామింఌ్ళ ముత్యాలు యాదవ్‌లు కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా మహేష్ గౌడ్,పావనిజంగయ్య యాదవ్‌లు మాట్లాడుతూ పేద ప్రజల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తీసుకువచ్చిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కీసర గుట్ట ధర్మకర్త అమర్, సహకార బ్యాంక్ డైరెక్టర్ ఉదయ్ రెడ్డి, నాయకులు, ఇందిరమ్మ కమిటి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## కన్న తల్లిని కడతేర్చిన కన్న కూతురు

### ప్రేమకు అడ్డువస్తుందని గొంతు నులిమి హత్యచేసిన మైనర్ బాలిక

**ప్రజాపక్షం/నిజాంపేట్:** ప్రేమకు అడ్డువస్తోందని ఏకంగా గొంతు నులిమి కన్న తల్లిని ఓ మైనర్ బాలిక హత్య చేసిన సంఘటన జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షాపూర్ నగర్, ఎన్‌ఎల్‌బి నగర్‌లో నివాసముండే సట్ల అంజలి (39)కి, కూతురు తేజశ్రీ పదవ తరగతి చదువుతుంది. అయితే తేజశ్రీ పగిల్ల శివ(19) అనే వ్యక్తిని ప్రేమిస్తుంది. తేజశ్రీ ప్రేమ విషయం తెలుసుకున్న తల్లి అంజలి తేజశ్రీని మందలించింది. దీంతో తన ప్రేమకు తల్లి అడ్డువస్తుందని తేజశ్రీ ప్రియుడు శివతో కలిసి తల్లి అంజలిని హత్యచేయాలని నిర్ణయించుకుంది. నిన్న రాత్రి ప్రియుడు శివ అతని తమ్ముడు పగిల్ల యశ్వంత్(18)తో కలిసి తేజశ్రీ తల్లి అంజలి గొంతు నులిమి బండరాయితో మోది హత్య చేసింది. ఈ మేరకు సమాచారం అందుకున్న జీడిమెట్ల పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిందితులైన ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ మేరకు బాలానగర్ జోన్ డిసిపి సురేశ్ కుమార్, ఎసిపితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రెండు నెలల్లో రూ.3.5 కోట్ల విలువైన 1130 మొబైల్ ఫోన్ల స్వాధీనం





**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** సాంకేతికతో కూడిన కృషి కారణంగా రాచకొండ కమిషనరేట్ పోలీసులు కేవలం రెండు మాసాల కాలంలో రూ.3.5 కోట్ల విలువైన 1130 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకోగలిగారని పోలీస్ కమిషనర్ జి.సుధీర్ బాబు తెలిపారు. ఇటీవల పెరుగుతున్న మొబైల్ ఫోన్లకు పోటీగా ఫోన్ల చోరీలు సైతం జరుగుతున్నాయని, దీనికోసం ఎల్‌బి నగర్, మల్కాజిగిరి, భువనగిరి సిసిఎస్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసామన్నారు. ఎల్‌బినగర్ జోన్‌లో 706, మల్కాజిగిరి జోన్‌లో 312, భువనగిరి జోన్‌లో 112 ఫోన్లు స్వాధీనమయ్యాయన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 3694 మొబైల్ ఫోన్లు స్వాధీనమయ్యాయని తెలిపారు. స్వాధీనమైన ఫోన్లను సరైన నిర్థారణ చేసుకొన్న మీదట ఎవరివి వారికి అప్పచెప్పామని కమిషనర్ చెప్పారు. డిసిపి క్రైమ్స్ అరవిందబాబు, ఎసిపి క్రైమ్స్ కరుణసాగర్, సిసిఎస్, ఐటి సెల్ బృందాలు విశేషంగా కృషి చేసారన్నారు. చవకగా వస్తున్నాయని ఎవరి దగ్గరా బిల్లు లేకుండా మొబైల్ ఫోన్లను కొనుగోలు చేయరాదని, కొన్ని సందర్భాల్లో పాత ఫోన్లు నేరాల్లో వినియోగించుకొని ఉంటే వాటిని కొనుగోలు చేసిన వారు ఇబ్బందుల్లో పడే అవకాశాలు ఉంటాయన్న విషయాన్ని తెలియచేస్తూ మొబైల్ ఫోన్లు కొనుగోలు చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా కమిషనర్ ప్రజలకు సూచించారు.

## ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని దివ్యాంగుడి వినతి

ప్రజాపక్షం/యాచారం : ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని మండల పరిధిలోని తాడిపర్తి గ్రామానికి దివ్యాంగుడు కట్లేల బాలయ్య ప్రభుత్వాన్ని వేడుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ నేను నిరుపేద కుటుంబానికి చెందిన తాను గత 20 ఏండ్లుగా కాళ్ళు చచ్చుబడి నడవలేని స్థితిలో ఉన్నాన్నారు. పెండ్లికి ఎదిగిన ఇద్దరు ఆడపిల్లలు, ఒక బాబు ఉన్నాడని, నా భార్య లక్ష్మమ్మ కష్టపడి మా కుటుంబాన్ని పోషిస్తుందని తెలిపాడు. నా పరిస్థితి అగమ్య గోచరంగా ఉందని అన్నారు. తాడిపర్తి గ్రామానికి వచ్చిన మొదటి లిస్టులో నా పేరుండి. ఇండ్ల మంజూరులో నాపేరు లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మాగ్రామానికి 13 ఇండ్లు మంజూరు అయ్యాయి. అందులో నా పేరు లేదని తెలిపారు. అధికారులు పరిస్థితిని అర్థం చేసుకోని దివ్యాంగుల కోటాలోనైనా ఇల్లు మంజూరు చేసి ఆదుకోవాలని బాలయ్య వేడుకున్నాడు.

## మృతుడు ఎపిఎం కుటుంబానికి గ్రాట్యుటీ



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: ఆమనగల్ మండలంలో డిఆర్‌డిఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ (ఎపిఎం)గా విధులు నిర్వర్తిస్తున్న పల్లె కృష్ణయ్య విధులు ముగించుకొని వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదం మరణించాడు. కాగా అతడి కుటుంబానికి డిపార్ట్‌మెంట్ ద్వారా రావాలసిన గ్రాట్యుటీ రూ. 4,81,753 లను మంగళవారం మృతుడు భార్య పల్లె శ్రీలత, అతడి కుమారుడికి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి గ్రాట్యుటీ చెక్కు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, డిఆర్‌ఒ సంగీత, డిఆర్‌డిఎ పిడి శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

## రంగారెడ్డి రైతులకు రైతు భరోసా వర్తించదా?

### రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి



ప్రజాపక్షం/అబ్దుల్లాపూర్‌మెట్ : రంగారెడ్డి జిల్లా రైతులకు రైతు భరోసా వర్తించకపోవడం దారుణమని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం రైతు వేదిక వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో వ్యవసాయం చేసే రైతుల ఖాతాలకు రైతు భరోసా వేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలలో వేసి ఈరంగారెడ్డి జిల్లా రైతులకు మొండి చేయి చూపించడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి జిల్లా రైతులకు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు చల్లా నారాయణరెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, ఎం.బాలయ్య, కే.నరేందర్, యాదగిరి,అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## కాలనీవాసులను బెదిరిస్తే తాటతీస్తాం

### టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : కాలనీ వాసులపై బెదిరింపులకు పాల్పడితే తాటతీస్తామని, ఎల్‌బి నగర్‌లో రౌడీయిజాన్ని కొనసాగనివ్వనని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ, ఎల్‌బి నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి మధుయాష్కీ గౌడ్ హెచ్చరించారు. దీర్ఘకాలికంగా సమస్య పరిష్కరించిన నేపథ్యంలో మధుయాష్కీగౌడ్‌ని హయత్‌నగర్ డివిజన్ కమలానగర్, ఆంధ్ర కేసరి నగర్ కాలనీవాసులు ఆహ్వానించి సన్మానించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపోటములతో సంబంధం లేకుండా తాను పుట్టిన ప్రాంతానికి సేవ చేయాలని పనిచేస్తున్నానని ఆయన పేర్కొన్నారు. తాను 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానని, ఏ ఆపద వచ్చిన తనకి నేరుగా ఫోన్ చేయాలని కాలనీవాసులకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ పిసిసి కార్యదర్శి గజ్జి భాస్కర్‌యాదవ్, డివిజన్ అధ్యక్షులు చెన్నగోని రవీందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పాశం అశోక్‌గౌడ్, నాయకులు పట్నోళ్ల మాధవరెడ్డి, భీమిడి రామకృష్ణారెడ్డి, కాలనీ అధ్యక్షులు టీవీ రావు, కార్యదర్శి సుబ్బారావు, కోశాధికారి దివాకర్, సిటిజన్ ఫోరం అధ్యక్షులు ఉపేందర్‌రెడ్డి, మహిళ అధ్యక్షురాలు పులమ్మ, మదన్‌రెడ్డి, సారంగం, ఈద్దకోట వెంకటేశ్వర్లు, వేణు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పల్లెల్లో రైతు భరోసా సంబరాలు



ప్రజాపక్షం/షాద్‌నగర్: మంగళవారం షాద్‌నగర్ నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, కేశంపేట, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రాలతోపాటు పల్లెల్లో రైతు భరోసా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో అన్నదాతలు పెద్ద ఎత్తున పాల్గొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. షాద్‌నగర్ వ్యవసాయశాఖ ఇన్‌చార్జి ఏడిఏ నిశాంత్ కుమార్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు. కేశంపేట మండల కేంద్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్జర్ల గ్రామంలోని రైతు వేదిక వద్ద సిఎం, డిప్యూటీ సిఎం, వ్యవసాయశాఖ మంత్రి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, గూడ వీరేష్, జగదీశ్వర్, కరుణాకర్, భాస్కర్ రైతులు పాల్గొన్నారు.

**కొందుర్గు:** కొందుర్గు మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం రైతు సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ చిట్టెం దామోదర్‌రెడ్డి, ఎంపిడిఓ అనూరాధ, వ్యవసాయాధికారి సురేష్‌రెడ్డి, ఏఈఓ జయమాలిని, పంచాయితీ కార్యదర్శి సురేశ్, ఏఈఓ వాసవి, మాజీ సర్పంచ్ బండిమీది పెంటయ్య, రైతులు రాయికంటి రామస్వామి, సిద్దు గౌడ్, టి గోపాల్, శ్రీనివాస్‌రెడ్డి, రాయికంటి పల్లయ్య పాల్గొన్నారు.

## గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలు



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: గ్రంథాలయాలు ఆధునిక దేవాలయాలని మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రంథాలయ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శివయ్య, కాంగ్రెస్ పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు రాణి, శ్రావణ్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శంకరయ్య, కమ్మరి శ్రీను, బాలరాజులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్‌గా సత్యనారాయణరెడ్డి



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్‌గా సత్యనారాయణరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు, నాయకుల సహకారంతో ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను ముందుకు తీసుకుపోవడానికి కృషి చేస్తానని సత్యనారాయణరెడ్డి తెలిపారు.

## రహదారులు నీటమునగకుండా

# అన్నిశాఖలతో హైడ్రా సమన్వయం

### ట్రాఫిక్ పోలీసులతో హైడ్రా సమావేశం



ప్రజాపక్షం/హైదరాబాద్ : రహదారులు నీట మునగకుండా చూడడమే లక్ష్యం కావాలని హైడ్రా కమిషనర్ ఎవి రంగనాథ్ అన్నారు. సమస్య ఎలా పరిష్కారం అవుతుందనే అంశంపై స్పష్టమైన అవగాహన ఉండాలని సూచించారు. ఇందుకు సంబంధించిన శాఖలన్ని సమన్వయంతో పని చేస్తే సమస్యను చాలా వరకు పరిష్కారం చేయగలమన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే జిహెచ్‌ఎంసితో కలిసి పని చేస్తున్న హైడ్రా, మంగళవారం ట్రాఫిక్ పోలీసు ఉన్నతాధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసింది. జాయింట్ సిపీలు గజరావు భూపాల్, జోయల్ డేవిస్, హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వి.పాపారావుతో పాటు హైడ్రా, ట్రాఫిక్ పోలీసు విభాగాలకు సంబంధించిన అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. వరద నీట మునిగిన ప్రాంతాలలో తలెత్తుతున్న సమస్యలను అధికారులు వివరించారు. రెండు గంటలు పాటు వర్షం పడితే ఒక మీటరు ఎత్తున నీరు చెరువుల్లో చేరుతోందని. ఇంతే మొత్తం నీరు బయటకు వెళ్లాలంటే వారం రోజులు పడుతోందన్నారు. ఈ నేపథ్యంలో వరదను నిలువరించే చెరువుల నీటి మట్టంపైనా అధ్యయనం చేయాల్సిన అవసరాన్ని హైడ్రా కమిషనర్ సూచించారు.

### నీట మునుగుతున్న ప్రాంతాలు 349

నగరంలో హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ కమిషనరేట్ల పరిధిలో మొత్తం 349 ప్రాంతాలలో వరద ముప్పు ఉందని గుర్తించారు. వర్షం సమాచారం తెలియగానే ఈ ప్రాంతాలలో సంబంధిత శాఖ అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రంగనాథ్ సూచించారు. ఈ ప్రాంతాలకు దగ్గరలో చెరువులు, నాలాలు అనుసంధానమై ఉన్నాయా లేదా అనేది పరిశీలించాలన్నారు. వరద కాలువలు ఎక్కడైనా కుంచించుకుపోయినా, పూడుకు పోయినా ఆ సమాచారం ఇస్తే వెంటనే పునరుద్ధరించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ క్రమంలోనే సిటీ ట్రాఫిక్‌లోని ప్యాట్నీ, చికోటి గార్డెన్స్, చింతలబస్తీల మీదుగా సాగే వరద కాలువలను విస్తరిస్తున్నామన్నారు.

### ముఠూరుజోన్లో మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు

51 హైడ్రా డిజాస్టర్ రెస్పాన్స్ బృందాలకు 150 మాన్సూన్ ఎమర్జెన్సీ బృందాలు కూడా మూడు రోజుల్లో తోడవుతున్నాయని రంగనాథ్ తెలిపారు. సర్కిల్ వారి సిహెచ్‌ఎంసి సిబ్బందితో కలిసి ఈ బృందాలు పని చేస్తాయన్నారు. వీటికి జలమండలి, ట్రాఫిక్, ఇరిగేషన్, విద్యుత్ శాఖలకు చెందిన సిబ్బంది కూడా తోడయితే, నగరానికి వరద ముప్పు చాలావరకు తగ్గించవచ్చునన్నారు. 50 మేజర్ సమస్య ఉన్న ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారానికి తొలుత ప్రయత్నిస్తున్నామన్నారు. వర్ష సమాచారంతో పాటు, సమస్యల పరిష్కారానికి తీసుకునే చర్యలు సమన్వయంతో సాగేందుకు వీలుగా వాట్సాప్ గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. బ్రేక్‌డౌన్ అవుతున్న వాహనాలను పక్కకు తీయడానికి తగిన వాహనాలను ప్రాంతాలవారీ సమకూర్చుకోవాలని ట్రాఫిక్ విభాగం జాయింట్ సిపీలు కోరారు. నగరంలో ఏ ప్రాంతాల్లో వరద ముప్పు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయో వివరించారు.

### చెరువులు, నాలాలు కబ్జాకు గురైతే.. 8712406899 కు సమాచారమివ్వండి

#### నగర ప్రజలకు హైడ్రా విజ్ఞప్తి

నగరంలో గొలుసుకట్టు చెరువుల పునరుద్ధరణకు హైడ్రా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో మొదటి విడతగా నగరంలోని 6 చెరువుల పునరుద్ధరిస్తోంది. నగరానికి వరద ముప్పు తప్పించాలంటే గొలుసుకట్టు చెరువులు కీలక పాత్ర పోషిస్తాయి. వర్షం పడితే వరద నీరు రహదారులు, నివాస ప్రాంతాలను ముంచెత్తకుండా, నేరుగా చెరువుల్లోకి చేరేలా హైడ్రా చర్యలు తీసుకుంటోంది. చెరువులు, నాలాలు పరిరక్షించడం ఎంతో అవసరమని అందరూ గ్రహించాలని సూచిస్తోంది. చెరువులు, నాలాల ఆక్రమణలకు గురికాకుండా చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో నగర ప్రజల భాగస్వామ్యాన్ని కోరుతోంది. మీ పరిధిలో చెరువులు, నాలాలు కబ్జాకు గురవుతుంటే ఆ సమాచారాన్ని హైడ్రా వాట్సాప్ నెంబరు 8712406899 కు పంపించాలని హైడ్రా ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఫొటోలతో పాటు ప్రాంతాలను తెలియజేసే లోకేషన్‌ను షేర్ చేయాలని అధికారులు కోరారు. కమిషనర్ హైడ్రా పేరిట ఉండే ట్విట్టర్(ఎక్స్), ఇన్‌స్టాగ్రామ్, ఫేస్ బుక్‌లలో కూడా సమాచారం అందజేయాలని కోరారు. 7207923085 నెంబరు ద్వారా నేరుగా హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్‌కి కూడా సమాచారం పంపాలని తెలిపారు.

## నేటి నుంచి జిహెచ్‌ఎంసిలో క్రీడలు

ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసి టీట్ జర్నలిస్టులు, కార్పొరేటర్లు, జిహెచ్‌ఎంసి ఉద్యోగులకు ఈనెల 25వ తేదీ నుండి 30 వరకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు అదనపు కమిషనర్(క్రీడలు ) డాక్టర్ యాదగిరి రావు తెలిపారు. ఈ క్రీడాపోటీలు నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ప్రారంభిస్తారన్నారు. ముగింపు సందర్భంగా పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేస్తారన్నారు.

**ఆటల వివరాలు..** చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లేగ్రౌండ్‌లో ఉదయం 08:00 గంటలకు మేయర్, డిప్యూటీ మేయర్, జిహెచ్‌ఎంసి కమిషనర్ ప్రారంభోత్సవం చేయనున్నారు. కబడ్డీ, వాలీబాల్ ఆటలు ఉదయం 08:30 గంటలకు ప్రారంభమవుతాయి. ఉదయం 8:30 గంటల నుండి ఉదయం 9 గంటల వరకు అల్పాహారం, ఉదయం 10 గంటలకు నాగోల్‌లోని ఫతుల్లాగూడలోని డీఆర్‌ఎస్ శిక్షణ కేంద్రంలో క్రికెట్ ప్రారంభమవుతుంది. ఉదయం 10 గంటలకు ఉప్పల్ స్టే గ్రౌండ్‌లో షటిల్ బ్యాడ్మింటన్ ప్రారంభమవుతుంది. ఉదయం 11 గంటలకు చెస్, క్యారమ్స్, టెన్నీకాయిట్ ఆటలు విక్టరీ ప్లే గ్రౌండ్‌లో ప్రారంభమవుతాయి. మధ్యాహ్నం ఒంటి గంట నుండి 2 గంటల వరకు భోజనం. మధ్యాహ్నం 2 గంటల నుండి విక్టరీ ప్లే గ్రౌండ్‌లో అథ్లెటిక్స్ పరుగు పందెం, మధ్యాహ్నం 3 గంటలకు విక్టరీ ప్లే గ్రౌండ్‌లో మ్యూజికల్ చైర్, లెమన్ స్పూన్ ఆటలు ఉంటాయని, సంబంధిత మైదానాల్లో అల్పాహారం, భోజనం, స్నాక్స్ అందించబడతాయని యాదగిరి రావు తెలిపారు.

## ప్రశాంతంగా మొహర్రం బీబీకా ఆలం ఊరేగింపు

### అధికారులు, మతపెద్దల సమావేశంలో సివి ఆనంద్ సూచన



ప్రజాపక్షం/హైదరాబాద్ : మొహర్రం బీబీ కా ఆలం ఊరేగింపును ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అన్నిశాఖల అధికారుల సమన్వయంతో పోలీస్ శాఖ ముందస్తుగా అన్ని చర్యలు చేపట్టిందని పోలీసు కమిషనర్ సివి ఆనంద్ తెలిపారు. జూలై మొదటి వారంలో జరగనున్న మొహర్రం సందర్భంగా మంగళవారం సాలార్జంగ్ మ్యూజియంలో షియా కమ్యూనిటీ మత పెద్దలు, ఇతర సభ్యులు, జిహెచ్‌ఎంసి, ఆర్‌టిఏ, వాటర్‌వర్క్స్, విద్యుత్, వైద్య, ఆరోగ్యం, అగ్నిమాపక, నెహ్రూ జూలాజికల్ పార్క్, తెలంగాణ వక్ఫ్ బోర్డుతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సివి ఆనంద్ మాట్లాడుతూ మొహర్రం సంతాప ఊరేగింపులో పాల్గొనే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన వాహనాల పార్కింగ్ సదుపాయాలు కల్పిస్తామని, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు చేపడతామని తెలిపారు. రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో పాటు, ఇంటెలిజెన్సు దూరంగా ఉంచటానికి పోలీస్ ప్లాటూన్లు మరియు షీ టీం బృందాలను, హైదరాబాద్ సిటీ పోలీస్ స్టేషన్లోని క్రైమ్ టీమ్‌ను ఇక్కడ మోహరిస్తామని వివరించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈసారి ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూస్తామని తెలిపారు. సమావేశంలో కమ్యూనిటీ సభ్యులు లేవనెత్తిన అనేక సమస్యలను ఇతర విభాగాల అధికారుల సమన్వయంతో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.ఈ ఊరేగింపుకు వచ్చే ఏనుగుకు మంచి విశ్రాంతి లభించేలా ఊరేగింపుకు 23 రోజుల ముందే దానిని తీసుకురావాలని ఆయన సూచించారు. ఊరేగింపు సమయంలో ప్రజలు ఏనుగు దగ్గరకు రాకుండా, ఏనుగు చుట్టూ తగిన సురక్షిత స్థలం ఉండేలా చూస్తూ ఊరేగింపు సాగాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించాలని, పశువైద్యుడు మరియు ట్రాంక్విలైజర్ అందుబాటులో ఉండాలని నిర్వాహకులకు సూచించడం జరిగింది. ఈ సమావేశంలో డిసిపి స్నేహ మెహ్రా, ఎంఎల్‌సి మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, ఎంఎల్‌ఏ జాఫర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరితగతిన కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు

### జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్



ప్రజాపక్షం/హైదరాబాద్ :అసంపూర్తిగా మిగిలిపోయిన కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పనులు త్వరితగతిన పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకురావాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. కమిషనర్ చార్మినార్ జోన్‌లో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్విమ్మింగ్ పూల్‌కు వాటర్ కనెక్షన్ కొరకు జలమండలి అధికారులకు కమిషనర్ ఫోన్ చేశారు. వాటర్ కనెక్షన్, షటిల్ బ్యాడ్మింటన్ ఆట స్థలం పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. పనులు పూర్తి చేసిన వెంటనే స్పోర్ట్స్ సెక్షన్‌కు హ్యాండ్ ఓవర్ చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ వెంకన్న, అదనపు కమిషనర్( క్రీడలు) డాక్టర్ యాదగిరి రావు, జోనల్ ఎస్‌సి మహేశ్వర్ రెడ్డి, చీఫ్ ఇంజినీర్ సహదేవ్ రత్నాకర్, ప్రాజెక్ట్ ఈఈ కె.ఎల్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## జిహెచ్‌ఎంసిలో విగ్రహాలు తొలగింపు

ప్రజాపక్షం/హైదరాబాద్ : జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయ ఆవరణలో విగ్రహాలు తొలగించారు. దాదాపు దశాబ్దంన్నరగా ముసుగులు వేసి ఉన్న మూడు విగ్రహాలను సోమవారం రాత్రి గుట్టుచప్పుడు కాకుండా అక్కడి నుంచి తరలించారు. దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి మరణించిన అనంతరం 2009లో అప్పటి మేయర్ బండ కార్తీకరెడ్డి నిర్ణయం మేరకు జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో ఆయన విగ్రహం ఏర్పాటు చేశారు. అవిష్కరణ జరగక ముందే, అందుకు పోటీగా జిహెచ్‌ఎంసిలో అప్పటి టిడిపి ఫ్లోర్‌లీడర్‌గా ఉన్న సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మహాత్మాగాంధీ, డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విగ్రహాలు రాత్రికి రాత్రి ఏర్పాటు చేయించారు. మేయర్ కార్యాలయ ప్రధాన ద్వారం వైపు పక్క పక్కనే మూడు విగ్రహాలు ఉండడంతో ఆవిష్కరణ జరగలేదు. అప్పటి నుంచి మూడు విగ్రహాలు ముసుగుతోనే ఉన్నాయి. విగ్రహాల ఏర్పాటుపై కొందరు కోర్టుకు వెళ్లారు. గతేడాది జిహెచ్‌ఎంసిలోని వివిధ ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమైన మేయర్ గద్వాల్ విజయలక్ష్మి విగ్రహాల విషయంలో ఏలా ముందుకు వెళ్లాలో సూచించాలని పేర్కొన్నారు. భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేసిన సంఘాలు. ఏం చేయాలన్న దానిపై స్పష్టత ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ప్రధాన కార్యాలయం గేట్లు మూసివేశారు. సంస్థలోని విజిలెన్స్, స్థానిక పోలీసుల బందోబస్తు మధ్య విగ్రహాల తొలగింపు ప్రక్రియను పూర్తి చేశారు.

## మిస్టర్ ఇండియా-25 టైటిల్ గెలవడం సంతోషం

### రాకేష్ ఆర్ని



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : మిస్టర్ ఇండియా - 2025 టైటిల్ గెలువడం తనకెంతో ఆనందంగా ఉన్నదని మహబూబ్‌నగర్ జిల్లా నవపేట మండలం ధర్మల్లి గ్రామానికి చెందిన రాకేశ్ ఆర్ని తెలిపారు. నిరంతర కృషి, తల్లిదండ్రులు, మిత్రుల సంపూర్ణ సహకారం వల్ల తాను ఈ విజయాన్ని సాధించానని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఫిట్‌నెస్ అంటే కేవలం శరీరానికి మాత్రమే కాదని, మనస్సు కూ అవసరమన్నారు. తన ఫిట్‌నెస్, ఆత్మవిశ్వాసం, సామాజిక అవగాహన తోనే తాను ఈ పోటీలకు సన్నద్ధమయ్యాయని తెలిపారు. త్వరలోనే ఫిట్‌నెస్, మానసిక అభివృద్ధిపై ప్రత్యేక శిక్షణ క్యాంపులు, అవగాహన కార్యక్రమాలు ప్రారంభిస్తానని చెప్పారు. యువత కష్టపడి పని చేస్తే ఏదైనా సాధ్యమేనని తెలిపారు. తెలంగాణ నుంచి మన దేశానికి ప్రాతినిధ్యం వహించి మిస్టర్ ఎలైట్ గ్లోబల్ పోటీల్లో పాల్గొనడమే తన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

## రాజకీయ చైతన్యంతోనే సమాజం అభివృద్ధి




ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్ : మహిళల్లో రాజకీయ చైతన్యం వస్తేనే సమాజం అభివృద్ధి సాధిస్తుందని బిసి సేన మండల అధ్యక్షులు జక్కుల జలజ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామంలో బిసిసేన మహిళా కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జలజ మాట్లాడుతూ మహిళలు ఒంటింటికే పరిమితం కాకుండా రాజకీయ చైతన్యంతో అన్నిరంగాల్లో రాణించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో ఉంటుందని, అన్ని విషయాలపై అవగాహన పెంచుకొని ముందుకు రావాలని సూచించారు. బిసి మహిళలు పూర్తిగా వెనుకబాటుతనంలోనే ఉన్నారని, చైతన్యంతో ముందుకు వచ్చి అన్ని రంగాల్లో దూసుకువెళ్ళాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు కత్తి చంద్రశేఖర్ అప్ప, జిల్లా నాయకుడు మేకల వెంకటేష్, అసెంబ్లీ మహిళా అధ్యక్షురాలు బాస వరలక్ష్మీ, నందిగామ మండల ఉపాధ్యక్షులు నర్సింలు, చౌదరిగూడ మండల అధ్యక్షుడు ప్యాట ఐయ శ్రీకాంత్, పట్టణ అధ్యక్షురాలు భాగ్యలక్ష్మీ, మండల ఉపాధ్యక్షురాలు ప్రవంతి రాజ్, మహిళలు పాల్గొన్నారు.

## వానాకాలం పంటకు రూ.267.28 కోట్లు రైతు భరోసా

ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: 2025 సంవత్సరం వానాకాలం పంటకు సంబంధించి జిల్లాలో మొత్తం 2,37,069 మంది రైతులకు 267.28 కోట్లు రూపాయలు రైతు భరోసా కింద రైతు ఖాతాలలో జమ చేయడం జరిగిందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమంలో భాగంగా ప్రవేశ పెట్టిన "రైతు భరోసా" పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది వేల కోట్ల రూపాయలను రైతుల ఖాతాలలో జమ చేసిన సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం హైదరాబాద్ లో నిర్వహిస్తున్న "రైతు భరోసా సంబరాలు" కార్యక్రమంలో సిఎం ఎనుముల రేవంత్ రెడ్డి రైతులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం కొత్తగూడ గ్రామంలో నిర్వహించిన రైతు భరోసా విజయోత్సవ సంబరాలు ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 2025 సంవత్సరం వానాకాలానికి సంబంధించి జిల్లాలో రైతు భరోసా కింద మొత్తం 237069 మంది రైతులకు రూ.267.28 కోట్లు ఖాతాలలో జమ చేయడం జరిగిందని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహ రావు, ఉద్యాన శాఖ అధికారి సురేష్, ఆర్‌డిఒ జగదీశ్వర్, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సామ్రాజ్యవాద దాడులు ఖండిద్దాం

### సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య



ప్రజాపక్షం/కొత్తూరు : సామ్రాజ్యవాద దాడులను ఖండిద్దామని సిపిఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఐ కొత్తూరు, నందిగామ మండలాల మహాసభలు కొత్తూరు మండల పరిధిలోని జెపి దర్గాలో మామిడి శేఖర్‌రెడ్డి, గద్దం జగదీష్ అధ్యక్షతన మహాసభలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాలమాకుల జంగయ్య మాట్లాడుతూ ఇజ్రాయిల్ పాలస్తీనా, గాజానగరంపై అమెరికా సహకారంతో నిర్విరామంగా దాడులు చేస్తూ అమాయక ప్రజలను చంపుతున్నారని, ప్రపంచ శాంతి కోసేవారు ఈ దాడులను ఖండించాలన్నారు. సిపిఐ పార్టీ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా దేశవ్యాప్తంగా శతాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తుందని, ఈ నేపథ్యంలోనే మండల కేంద్రాల్లో మహాసభలను నిర్వహించడం జరుగుతుందన్నారు. రానున్న కాలంలో రంగారెడ్డి జిల్లాలో నిరుపేదలకు గుర్తించి ప్రభుత్వ భూముల్లో, భూదాన్ భూముల్లో ఇళ్ళ స్థలాల కోసం గుడిసెలు వేయించి పోరాటాలు చేసేందుకు సిపిఐ కార్యకర్తలు సిద్ధంగా ఉంటాయని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు, కె.రామస్వామి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఆందోళన, పోరాటాలను నిర్వహించేందుకు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

**నూతన కమిటీల ఎన్నిక...** కొత్తూరు మండల సిపిఐ మండల కార్యదర్శిగా ఎండి షటిల్, సహాయ కార్యదర్శిగా ఎం.శేఖర్‌రెడ్డితోపాటు 15మంది కార్యవర్గం కౌన్సిల్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నందిగామ మండల కార్యదర్శిగా గద్దం జంగయ్య, సహాయ కార్యదర్శులుగా రాఘవేందర్, గద్దం జగదీష్‌తో పాటు 9మంది కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మహాసభలో మహిళా సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మంజుల, ఇన్‌సాఫ్ సంఘం జిల్లా అధ్యక్షుడు మార్వుల్, మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సక్రునాయక్, మండల కార్యదర్శులు ఎండి షకీల్, గద్దం జంగయ్య, సంజీవ్‌కుమార్, జంగయ్య, అజ్మతలి, మహ్మద్ హుస్సేన్ తాహెర్ పాల్గొన్నారు.

# క్రీడ




## రింకూ సింగ్ పెళ్లి వాయిదా!



భారత క్రికెటర్ రింగూ సింగ్.. సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్.. ఇటీవల నిశ్చితార్థం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే ఆ ఇద్దరి పెళ్లి నవంబర్ 19వ తేదీన జరగాల్సి ఉంది. కానీ ఆ పెళ్లి వాయిదా పడినట్లు తెలుస్తోంది. ఇటీవల లక్నోలో చాలా గ్రాండ్‌గా ఎంగేజ్మెంట్ సెర్మనీ జరిగింది. ఆ వేడుకకు మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్, నటి జయా బచ్చన్, భువనేశ్వర్ హాజరయ్యారు. ఓ హిందీ పత్రిక ప్రకారం.. నవంబర్‌లో క్రికెట్ షెడ్యూల్ బిజీగా ఉన్న కారణంగా.. రింకూ తన పెళ్లిని వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. ఇరువురికి చెందిన కుటుంబాలు ఆ వాయిదాకు అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో రింకూ, సరోజ్ పెళ్లి జరిగే అవకాశాలు ఉన్నాయి. తుది తేదీని త్వరలో ప్రకటించనున్నారు.

## సెప్టెంబర్‌లో నాలుగో సీజన్ వేలం..

### రీటైన్‌కు ఆరుగురికే అవకాశం!

ఐపిఎల్ తర్వాత క్రికెటర్లపై కోట్లు కుమ్మరించే దక్షిణాఫ్రికా టీ20 లీగ్ నాలుగో సీజన్ వేలానికి రంగం సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 9న మెగా వేలానికి సన్నాహకాలు చేస్తున్నారు నిర్వాహకులు. ఆక్షన్‌కు సమయం దగ్గర పడడంతో ఫ్రాంచైజీల కీలక అప్‌డేట్ ఇచ్చారు. ఈసారి ఒక్కో జట్టు ఆరుగురుని మాత్రమే అట్టిపెట్టుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ టోర్నీ చరిత్రలో ఇంత తక్కువ మందిని రిటైన్ చేసుకోవాలని సూచించడం ఇదే మొదటిసారి. ప్రతి జట్టు ఆరుగురిని మాత్రమే కొనసాగించనున్న నేపథ్యంలోఈ సారి 72 స్లాట్స్ కోసం వేలం జరుగనుంది. అంతేకాదు రైట్ టు మ్యాచ్ విధానాన్ని కూడా వినియోగించుకోవచ్చు. మూడో సీజన్‌లో తమకు ఆడిన క్రికెటర్ కోసం ఈ ఫార్ములాను వాడుకునే వీలుంది. అయితే.. వేలంలో సఫారీ ప్రతి ఫ్రాంచైజీలో 11 మంది సఫారీ ఆటగాళ్లు, ఏడుగురు విదేశీ క్రికెటర్లు.. ఉండేలా చూసుకోవాలని ఎస్ఏ20 నిర్వాహకులు తెలిపారు. అంతేకాదు వీళ్లలో అండర్ 23 ఆటగాళ్లు కనీసం ఇద్దరు ఉండాలనే నియయం విధించారు. ఐపిఎల్‌లో ఆడుతున్న ఆరుజట్లకు ఎస్ఏ20లో సిస్టర్ ఫ్రాంచైజీలు ఉన్నాయి. డర్బన్ సూపర్ జెయింట్స్ జొబర్గ్ సూపర్‌కింగ్స్ ఎంఐ కేప్ టౌన్ పార్ల్ రాయల్స్ ప్రిటోరియా క్యాపిటల్స్, సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్లు పాల్గొంటున్న ఈ టోర్నీలో తొలి రెండు సీజన్లలో ఈస్టర్న్ కేప్ విజేతగా నిలిచింది. మూడో సీజన్‌లో మాత్రం ఎంఐ కేప్‌టౌన్ ఛాంపియన్‌గా అవతరించింది.

## మాజీ స్పిన్నర్ దిలీప్ దోషి కన్నుమూత



టీమిండియా మాజీ క్రికెటర్, ఆఫ్ స్పిన్నర్ దిలీప్ దోషి కన్నుమూశారు. ఆయన వయసు 77 ఏళ్లు. లండన్‌లో ఆయన గుండె సంబంధిత వ్యాధితో మరణించారు. కొన్ని దశాబ్ధాల నుంచి ఆయన లండన్‌లోనే నివాసం ఉంటున్నారు. టీమిండియా తరపున 33 టెస్టులు ఆడిన దిలీప్.. 114 వికెట్లు తీసుకున్నాడు. అయిదేసి వికెట్లు అతను ఆరు సార్లు తీసుకున్నాడు. 15 వన్డేల్లో అతను 22 వికెట్లు తీసుకున్నాడు. సౌరాష్ట్ర, బెంగాల్, వార్‌విక్‌షైర్, నాటింగ్‌హామ్‌షైర్‌కు అతను ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఆడాడు. 1970 దశకంలో ఉన్న మేటి స్పిన్నర్ల దారిలో దిలీప్ దోషి ముందుకు సాగాడు. అతను 32 ఏళ్ల వయసులో టెస్టు అరంగేట్రం చేశాడు. నాటింగ్‌హామ్‌షైర్‌లో లెజండరీ గ్యారీఫీల్డ్ సోబర్స్‌తో కలిసి ఆడేవాడు. 1980 దశకంలో అతను స్వల్ప సమయంలోనే క్రికెట్ నుంచి తప్పుకున్నాడు. ఆ దశలో ఇండియన్ క్రికెట్ నడుస్తున్న తీరును ఆయన ఇష్టపడలేదు. స్పిన్ పంచ్ పేరుతో ఆటో బయోగ్రఫీ బుక్ రాశాడతను. దాంట్లో క్రికెట్ అనుభవాల గురించి చెప్పాడు.

## సెంచరీతో చెలరేగిన డకెట్



హెడింగ్లే టెస్టు తొలి సెషన్‌లోనే మ్యాచ్ గమనాన్ని మార్చేసిన ఇంగ్లాండ్ ఓపెనర్లు జట్టును విజయం దిశగా నడిపిస్తున్నారు. లంచ్ తర్వాత జోరు పెంచిన జాక్ క్రాలే(59 నాటౌట్) అర్ధ సెంచరీ పూర్తి చేసుకోగా బజ్ బాల్ గేమ్ ఆడుతున్న బెన్ డకెట్ (105 నాటౌట్) సెంచరీతో చెలరేగాడు. తొలి వికెట్‌కు 181 రన్స్ జోడించిన ఈ ద్వయం దూకుడుకు వరుణుడు అడ్డుపడ్డాడు. డకెట్ సెంచరీ తర్వాత.. వానజల్లులు మొదలయ్యాయి. దాంతో, ఇరుజట్ల ఆటగాళ్లు డ్రెస్సింగ్ రూమ్‌కు పరుగులు తీశారు. అప్పటికి ఆతిథ్య జట్టు వికెట్ కోల్పోకుండా 181 పరుగులు చేసింది. ఇంకా విజయానికి 190 పరుగుల దూరంలో ఉంది ఇంగ్లాండ్ హెడింగ్లే టెస్టులో ఐదో రోజు ఇంగ్లాండ్ ఓపెనర్లు క్రీజులో పాతుకుపోవడంతో భారత బౌలర్లు వికెట్ కోసం చెమటోడ్చుతున్నారు. తొలి సెషన్‌లో ఓపెనర్లు బౌండరీలతో విరుచుకుపడ్డారు. దాంతో, భోజన విరామానికి ఇంగ్లాండ్ వికెట్ కోల్పోకుండా 117 రన్స్ చేసింది. రెండో సెషన్‌లోనూ బజ్ బాల్ ఆటతో టీమిండియా బౌలర్లను ఉతికేసిన ఓపెనర్ బెన్ డకెట్ (105 నాటౌట్) శతకంతో మెరవగా.. జాక్ క్రాలే(59 నాటౌట్) అర్ధ శతకంతో సహకారం అందించాడు. అయితే.. 97 పరుగుల వద్ద సిరాజ్ బౌలింగ్‌లో యశస్వీ క్యాచ్ వదిలేయండంతో బతికిపోయిన డకెట్.. జడేజా ఓవర్లో బౌండరీతో వందకు చేరువయ్యాడు. మాజీ అలెస్టర్ కుక్ తర్వాత నాలుగో ఇన్నింగ్స్‌లో సెంచరీ బాదిన రెండో క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడీ హిట్టర్.

# ఫోకస్

# మహిళ

## ఆర్థికంగా మహిళల ముందంజ..



మారుతున్న కాలంతోపాటు మహిళలు కూడా తమ జీవన శైలిని మార్చుకుంటున్నారనడానికి ఆర్థికంగా వారి ముందంజే నిదర్శనం. కేవలం ప్రభుత్వాలపై ఆధారపడకుండా, వచ్చిన ప్రతి అవకాశాన్నీ వినియోగించుకొని, ఉపాధి మార్గాలు పెంచుకుంటున్నారు. నిజానికి గ్రామీణ భారతదేశంలో మహిళలు అనేక సామాజిక పరిమితుల మధ్య జీవనం సాగిస్తున్నప్పటికీ, స్వయం ఉపాధి వైపు అడుగులు వేస్తున్నారు. ఆర్థికంగా స్వతంత్రంగా ఎదుగుతున్నారు. ఈ మార్పుకు ప్రధాన కారణం వారి పట్టుదల, కృషి, ఆత్మవిశ్వాసం. ప్రభుత్వ పథకాలు, శిక్షణా అవకాశాలు, మారుతున్న మార్కెట్ పరిణామాలు కూడా సహకరిస్తున్నాయి. నేడు గ్రామీణ మహిళలకి లభ్యమవుతున్న ఉపాధి అవకాశాలు ఇప్పుడు ఎన్నో రకాలుగా విస్తరించాయి. భారత గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం ప్రధానంగా ఉంటుంది. మహిళలు సైతం దీన్ని తమ ఉపాధి మార్గంగా స్వీకరించారు. వారు సేంద్రియ వ్యవసాయం, కూరగాయల సాగు, మిర్చి, కరివేపాకు, పుదీనాకు వంటి వంటకాల సాగులో పాల్గొంటున్నారు. అంతేకాక, పశుపోషణ ద్వారా పాల ఉత్పత్తి, గొర్రెలు, మేకల పెంపకం ద్వారా వారిని ఆదాయపరులుగా మార్చుకుంటున్నారు. కొన్నిచోట్ల వారు మత్స్యం పెంపకం వంటి వాటికీ దోహదపడుతున్నారు. గ్రామీణ మహిళలకు చేతి నైపుణ్యంతో కూడిన కళలు కలిగి ఉండటం వల్ల, హస్తకళలు వారికో గొప్ప ఉపాధి మార్గం. చేనేత చీరలు, అల్లిక వస్తువులు, బుట్టలు, చాపలు, రంగుల మట్టి బొమ్మలు, అలంకరణ వస్తువులు తయారీ వంటి శిల్ప కళలు మహిళల చేతుల్లో రూపు పొందుతున్నాయి. ఇలాంటి వస్తువులకు దేశీ,విదేశీమార్కెట్లలో విస్తృత ఆదరణ ఉండటంతో, గ్రామీణ మహిళలు తమ స్వంతవ్యాపారాలు ప్రారంభిస్తున్నారు. ఒక్కొక్కరిగా పోరాడడం కష్టం కాని, సమష్టిగా కలిసినప్పుడు మహిళలు ఎంతో శక్తివంతంగా మారతారు. స్వయం సహాయ సంఘాలు గ్రామీణ మహిళల జీవితంలో ఆర్థిక పరంగా పెద్ద మార్పును తీసుకొచ్చాయి. ఈ సంఘాల ద్వారా వారు చిన్న పరిశ్రమలతో వ్యాపారాలు ప్రారంభించి, పాపడ్లు, అగర్బత్తీలు, పిక్కిలు, మురుకులు వంటి స్వీయ ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. కొన్ని సంఘాలు పెద్ద సంస్థలకు సరఫరాదారులుగా కూడా మారాయి.

పశుపోషణ గ్రామీణ జీవనంలో భాగం. ఇది మహిళల కోసం విశ్వసనీయమైన ఉపాధి మార్గం. పాల ఉత్పత్తి, మేకలు, గొర్రెలు, కోళ్ల పెంపకం వంటి వ్యవహారాల ద్వారా వారు నెల వారీ ఆదాయాన్ని పొందుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళలే ఎక్కువగా ఈ బాధ్యతలు చేపడుతున్నారు. గుడ్లు, పాలు, మాంసం వంటి ఉత్పత్తుల విక్రయం ద్వారా కుటుంబాలకు గణనీయమైన ఆదాయం అందుతుంది.

ఇంటి నుండే చేయగలిగే మరో ముఖ్యమైన ఉపాధి రంగంగా కుట్టు పనులను పేర్కోవచ్చు. బ్లౌజులు, పాఠశాల యూనిఫార్మ్‌లు, సిల్క్ దుస్తులు మొదలైనవి కుట్టి స్థానికంగా లేదా ఆర్డర్‌పై అమ్ముకోవచ్చు. కొన్ని మహిళలు తమ సొంత బొటిక్ షాపులు ప్రారంభించి, డిజైన్ వస్త్రాల తయారీలో ప్రత్యేకతను కలిగి ఉన్నారు. ఇది ప్రత్యేకంగా పట్టణానికే పరిమితమైన అంశం కాదు. గ్రామాల్లోనూ ప్రస్తుతం ఇది వేగంగా అభివృద్ధి చెందుతున్న మార్గం. ఇంట్లో తయారుచేసే వస్తువులు కూడా ఆదాయ మార్గాలు అవుతున్నాయి. పచ్చళ్లు, అచ్చంగా గోధుమల అటుకులు, జామకాయ జామ్, జీడిపప్పు చక్కెర మిశ్రమాలు వంటివి ఇంట్లో తయారుచేసి, స్థానికంగా లేదా హౌస్ బ్రాండ్లతో విక్రయించవచ్చు. మహిళలే వంటలో నైపుణ్యం కలిగి ఉండడం వల్ల ఇది వారి ఉపాధి మార్గంగా మారింది.



### ఆన్‌లైన్ మాధ్యమంగా..

ఇతర మార్గాల కంటే కొత్తదైన ఆన్‌లైన్ మాధ్యమంగా కూడా ఉపాధి అవకాశాలు పెంచుకోవచ్చు. నేడు అనేక గ్రామీణ మహిళలు వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి మాధ్యమాల్లో తమ ఉత్పత్తులను ప్రమోట్ చేస్తున్నారు. మిషో వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్ ద్వారా కూడా వస్తువుల విక్రయం చేస్తున్నారు. వీటితో పాటు డేటా ఎంట్రీ, వర్చువల్ అసిస్టెంట్, డిజిటల్ మార్కెటింగ్ వంటి ఉపాధి అవకాశాలు ఉన్నా, కొంత డిజిటల్ శిక్షణ అవసరం.

స్వయం ఉపాధి కోసం అనేక ప్రభుత్వ పథకాలు గ్రామీణ మహిళలకు అందుబాటులో ఉన్నాయి. ముద్రా యోజన ద్వారా మైక్రో రుణాలు, నేషనల్ రూరల్ లైవ్‌లిహుడ్ మిషన్ ద్వారా శిక్షణ, నాబార్డ్ (ఎన్ఎబిఎఆర్‌డి) ద్వారా వ్యవసాయ అనుబంధ రంగాలలో సహాయం లభిస్తున్నాయి. అలాగే, శిక్షణా కేంద్రాలు, స్వయం ఉపాధి శిక్షణా ఇన్స్టిట్యూట్ల ద్వారా నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చు. ఒక స్థిరమైన ఉపాధి మార్గాన్ని పొందాలంటే శిక్షణ అవసరం. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎస్ఇటిఐలు, గ్రామీణ శిక్షణా కేంద్రాలు, హస్తకళా మండలీలు ఉచితంగా శిక్షణా అవకాశాలను కల్పిస్తున్నాయి. మహిళలు ఈ శిక్షణను తీసుకొని సెల్ఫ్‌ఎంప్లాయిమెంట్ లేదా చిన్న స్థాయి వ్యాపారాలు ప్రారంభిస్తున్నారు.

### సవాళ్లు లేకపోలేదు...

గ్రామీణ మహిళలు ఎదిగే క్రమంలో కొన్ని సవాళ్లను ఎదుర్కొంటున్నారు. అవగాహన లోపం, పెట్టుబడి కొరత, కుటుంబ, సామాజిక పరమైన అడ్డంకులు, మార్కెట్‌లో పోటీ వంటి పలు అంశాలు వారి అభివృద్ధికి, అభ్యున్నతికి అడ్డంకులుగా మారుతుంటాయి. కానీ, సరైన ప్రోత్సాహం, శిక్షణ, మద్దతుతో వీటిని అధిగమించడం సాధ్యమే. ఏదిఏమైనా, గ్రామీణ మహిళలు తమ జీవితాన్ని స్వయం ఆధారంగా మార్చుకునే దిశగా ప్రయాణం చేస్తున్నారు. వారు కేవలం ఇంటిపనులకు మాత్రమే పరిమితం కాకుండా, వ్యవసాయం, పశుపోషణ, హస్తకళలు, ఆన్‌లైన్ వ్యాపారాలు, శిక్షణ ద్వారా ఉపాధిని పొందుతున్నారు. ఇది వారి ఆర్థిక స్థితిని మెరుగుపరచడమే కాక, వారి స్వయంప్రతిష్టను, కుటుంబంలో గౌరవాన్ని పెంచుతుంది. మహిళలు బలపడితే గ్రామాలు బలపడతాయి. గ్రామాలు బలపడితే దేశం బాగుపడుతుంది.

## కార్పొరేట్లకు ఖనిజ సంపద దోచి పెట్టడానికే 'ఆపరేషన్ కగార్'


### సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి సదానందం ధ్వజం




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ఖనిజ సంపదను కార్పొరేట్లకు దోచి పెట్టడానికే కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆపరేషన్ కగార్ నిర్వహిస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం ఆరోపించారు. మంగళవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్‌లో జరిగిన సిపిఐ నగర సమితి కార్యకర్తల సమావేశంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు గోసిక మోహన్, నగర కార్యదర్శి కనకరాజులతో కలిసి ఆయన మాట్లాడారు. మావోయిస్టులు ఈ దేశ ప్రజలని, ఎక్కడైతే అణిచివేత ఉంటుందో అక్కడి ప్రజల రక్షణకు, వారి హక్కుల సాధనకు మావోయిస్టులు ఉంటూ ప్రజల అణిచివేతకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ మొండి వైఖరి విడనాడి ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని కోరారు. ఈనెల 28న పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగే సిపిఐ జిల్లా నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, నాయకులు తాళ్ళపెల్లి మల్లయ్య, మాటేటి శంకర్, మడికొండ ఓదేమ్మ, మార్కపూరి సూర్య, తొడుపునూరి రమేశ్ కుమార్ సిరిసిల్ల మల్లేష్ పడాల కనకరాజు, ఎంఎ గౌస్, గంగారపు చంద్రయ్య, ఉప్పులేటి తిరుపతి, అబ్దుల్ కరీం, జైపాల్‌రెడ్డి, కల్వల జగన్, చిలుముల రాజయ్య, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నివర్గాల సమస్యలపై పోరాటాలు

### సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి విలాస్




**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** అన్ని వర్గాల ప్రజల సమస్యలపై సిపిఐ పోరాటాలు చేస్తోందని సిపిఐ నిర్మల్ జిల్లా కార్యదర్శి ఎస్.విలాస్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సిపిఐ కార్యాలయంలో ఎస్ఎన్.రెడ్డి అధ్యక్షతన జరిగిన సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూలై 6న నిర్మల్ పట్టణంలోని పెన్షనర్ భవన్‌లో సిపిఐ జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. మహాసభలకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కలవేని శంకర్ హాజరవుతారని తెలిపారు. నిర్మల్ జిల్లాలో మహిళలు, రైతులు, విద్యార్థులు, గిరిజనులు, కార్మికులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. సమావేశంలో మహాసభ ఆహ్వాన సంఘం ఏర్పాటైంది. అధ్యక్షుడిగాఎస్.ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్.విలాస్, కోశాధికారిగా కే.శ్రీరామ్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కమిటీ కార్యదర్శి భూక్యా రమేష్, పట్టణ సహాయ కార్యదర్శి అబ్దుల్ నసీర్, కౌన్సిలర్ ఆషిఫ్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.పద్మకుమారి, ఎండిఎం గంగన్న కౌట్ల, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

# అమెరికా యుద్ధకాంక్షతోనే ప్రపంచంలో అశాంతి

### ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండిస్తూ వామపక్షాల నిరసనలు



ఖమ్మం



వరంగల్



వనపర్తి

**ప్రజాపక్షం/ఖమ్మం :** కేవలం ఆయుధ వ్యాపారం కోసమే ప్రపంచశాంతికి భంగం కలిగిస్తూ అమెరికా ఇరాన్‌పై దాడికి తెగబడిందని వామపక్షాల నేతలు ఆరోపించారు. మంగళవారం సిపిఐ, సిపిఎం, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాకేంద్రంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఐ కార్యాలయం నుంచి ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వామపక్షాల నేతలు మాట్లాడుతూ ఇరాన్‌పై అమానుషంగా దాడి చేస్తుందని గాజాపై ఇజ్రాయిల్ దాడిని సమర్థించడమే కాకుండా స్వయంగా ఇరాన్‌పై దాడికి పాల్పడడం సామ్రాజ్యవాద కాంక్షలో భాగమేనన్నారు. గాజాలో మహిళలు, పసిపిల్లలు అని చూడకుండా ఇజ్రాయిల్ వరుస దాడులు చేస్తుందని, దీనిపై భారత్ తన వైఖరిని స్పష్టం చేయాలన్నారు. ప్రపంచ శాంతికి అమెరికా భంగం కలిగిస్తున్న భారత ప్రధాని మోడీ మౌనంగా ఉండటం పరోక్షంగా ట్రంప్‌ను సమర్థించడమేనన్నారు. అంతర్జాతీయ చట్టాలను లెక్కచేయకుండా ఇరాన్ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేవిధంగా వ్యవహరిస్తున్న అమెరికా వైఖరిని యావత్ ప్రపంచం ఖండించాలని వారు విజ్ఞప్తి చేశారు. సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ నాయకులు బాగం హేమంతరావు, దండి సురేష్, నున్నా నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వర్లు, ఝాన్సీ, జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, వై.విక్రం, శింగు నర్సింహారావు, బిజి క్లెమెంట్, పోటు కళావతి, మహ్మద్ సలాం, మాదినేని రమేష్, బొంతు రాంబాబు, కళ్యాణం వెంకటేశ్వరరావు, బండి పద్మ, యర్రా శ్రీను, రావి శివరామకృష్ణ, మంగతాయి, పగడాల మల్లేష్, మేకల శ్రీను, వెంకటాద్రి పాల్గొన్నారు.

**మహబూబాబాద్:** ఇరాన్‌పై అమెరికా దాడిని ఖండిస్తూ, వామపక్షాల ఆధ్వర్యంలో మంగళవారం డోనాల్డ్ ట్రంప్ దిష్టిబొమ్మ దహనం చేశారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి వామపక్షనేతలు సాదుల శ్రీనివాస్, మండల వెంకన్న, పాయం చిన్న చంద్రన్న, పెరుగుకుమార్, గౌని ఐటయ్య, మదార్ మాట్లాడుతూ వెంటనే ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్‌లు యుద్ధ ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలతో చింతకుంట్ల వెంకన్న, వెలుగు శ్రావణ్, హాలావాత్ లింగ్య, సామ పాపన్న, అల్వాల వీరన్న, కుంట ఉపేందర్, దుడ్డెల రాంమూర్తి, కొత్తపల్లి రవి, సూరి, ఆబోతు అశోక్, రాగం మల్లయ్య, కుమ్మరికుంట్ల నాగన్న, కోటేష్, బాలాజి, బోళ్ళ భద్రయ్య, వేణు, హేమనాయక్ తదితరులు పాల్గొన్నారు.


సిరిసిల్ల

**మిర్యాలగూడ :** ఇరాన్‌పై అమెరికా దాడిని ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు, ఎంసిపియు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వస్కుల మట్టయ్యలు అన్నారు. మండలంలోని యాద్గారపల్లి గ్రామంలో వారు నిరసన వ్యక్తం చేసి ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయీద్, వామపక్ష నాయకులు డబ్బికార్ మల్లేష్, పోతినేని సుదర్శన్, అంజనపల్లి రామలింగం, మట్టయ్య, శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, రాములు, నర్మద, నర్సమ్మ, బావండ్ల పాండు, మల్లు గౌతంరెడ్డి, రవినాయక్, శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, సీతారాములు, వరలక్ష్మి, పరుశురాములు, రొండి శ్రీనివాస్, గాదె పద్మ తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ అర్బన్ :** ప్రపంచంలో అశాంతి నెలకొల్పి అమెరికా తన యుద్ధ సామాగ్రిని అమ్ముకోవాలని చూస్తున్నారని సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య అన్నారు. వామపక్ష పార్టీల పిలుపులో భాగంగా జిల్లా కేంద్రంలోని ధర్నా చౌక్ వద్ద అమెరికా అధ్యక్షుడు ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు హనుమాండ్లు, రాధాకుమార్, భానుచందర్, సిపిఎం నాయకులు రమేస్‌బాబు, వెంకట్ రాములు, నూర్జహాన్, సుజాత, విఘ్నేష్, మాస్ లైన్ నాయకులు సుధాకర్, వెంకన్న, నరేందర్, న్యూడెమోక్రసి నాయకులు సాయిబాబా, మల్లికార్జున్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

**వరంగల్ :** ఇరాన్‌పై అమెరికా దాడిని నిరసిస్తూ వరంగల్ హెడ్‌పోస్ట్ ఆఫీస్ సెంటర్‌లో వామపక్షపార్టీల నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమానికి న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు అధ్యక్షత వహించగా సిపిఐ జిల్లా కార్యదర్శి మేకల రవి ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్. సిపిఎం జిల్లా నాయకురాలు నలిగంటి రత్నమాల, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పనాస ప్రసాద్, ఎంసిపిఐయు జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్, వామపక్ష నాయకులు వలదాసు దుర్గయ్య, సింగారపు బాబు, సుంచు జగదీష్, నరసింహారావు, సత్యనారాయణ, డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు సంఘీ ఏలేందర్, ఎఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి శరత్ తదితరులు పాల్గొన్నారు.

**రాజన్న సిరిసిల్ల :** ఇరాన్‌పై అమెరికా బాంబు దాడులకు నిరసనగా జిల్లాకేంద్రంలోని గాంధీ చౌరస్తాలో కండ్లకు గంతలు కట్టుకొని సిపిఐ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కడారి రాములు, ఎలిగేటి రాజశేఖర్, అజ్జ వేణు, మీసం లక్ష్మన్, తిరుపతిరెడ్డి, మంద అనిల్, కుర్ర రాజేష్, పండుగ పోచమల్లు, సోమ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**హనుమకొండ :** ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తున్న అమెరికా సామ్రాజ్య వాదాన్ని ఎండగట్టాలని వామపక్ష పార్టీల నాయకులు అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సిపిఎం జిల్లా కార్యదర్శి గాదె ప్రభాకర్ రెడ్డి, ఆర్ఎస్పి జిల్లా కార్యదర్శి కౌడగాని శివాజీ, ఎంసిపిఐయూ జిల్లా కార్యదర్శి ఎన్.హంసరెడ్డి, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి గంగుల దయాకర్, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరు జ్యోతి మాట్లాడారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, నద్దునూరి అశోక్ స్టాలిన్, మండ సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు జక్కు రాజు గౌడ్, కొట్టేపాక రవి, నకిర్తఓదెలు, బత్తిని సదానందం, మునగాల బిక్షపతి, ఎదునూరి వెంకటరాజం, వేల్పుల సారంగపాణి, గుంటి రాజేందర్, శనిగరపు రాజ్ కుమార్, నిమ్మల మనోహర్, రెంటాల రమేష్ దేవా, సిపిఎం జిల్లా నాయకులు రాగుల రమేష్, బొట్ల చక్రపాణి, వెంకట్, వీరన్న, ఉప్పలయ్య,మంద సంపత్, ఎంసిపిఐయు నాయకులు గడ్డం నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

**జయశంకర్ భూపాలపల్లి :** సిపిఐ ఆధ్వర్యంలో భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్ లో ఇరాన్‌పై అమెరికా దాడులకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఇజ్రాయిల్, అమెరికా దేశాలు ఇరాన్ దేశంపై యుద్ధం ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, సిపిఐ జిల్లా నాయకులు గురిజేపల్లి సుధాకర్ రెడ్డి, మాతంగి రాంచందర్, క్యాతరాజు సతీష్, నెరెళ్ల జోసెఫ్, వేముల శ్రీకాంత్, పీక రవికాంత్,గోనెల తిరుపతి, రమేష్ చారి, గోలి లావణ్య, శ్రావణి పల్లెర్ల రజిత, శ్రీలత వాసం, రజిత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**వనపర్తి టౌన్ :** తమ ఆయుధాల వ్యాపార విస్తరణకు దేశాల మధ్య యుద్ధాలను ప్రోత్సహిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్, అమెరికా సామ్రాజ్యవాదానికి పాడె కట్టాలని సిపిఐ నేతలు పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు వనపర్తి అంబేద్కర్ చౌక్‌లో ఇరాన్ పై అమెరికా దాడికి వ్యతిరేకంగా ఎర్రజెండాలు ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాబర్ట్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మోష, జన జ్వాల, ఎఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్ , పృధ్వినాదం, లక్ష్మీనారాయణ, జయమ్మ, జ్యోతి, గంధం నాగరాజు, పాషా, విష్ణు తదితరులు పాల్గొన్నారు.


నిజామాబాద్



భూపాలపల్లి


హన్మకొండ


మహబూబాబాద్


మిర్యాలగూడ



# స్థానికం
REGIONAL NEWS

మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## ఘనంగా రైతుభరోసా వేడుకలు




**ప్రజాపక్షం/వంగూర్ :** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రైతు అభివృద్ధి కార్యక్రమంలోభాగంగా మంగళవారం మండలకేంద్రంలో రైతుభరోసా వేడుకలను కాంగ్రెస్‌పార్టీశ్రేణులు ఘనంగా జరుపుకున్నారు. గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా కాంగ్రెస్‌పార్టీ నాయకులు మాట్లాడుతూ తొమ్మిదిరోజులలోనే రూ.9వేలకోట్ల రూపాయలు 70లక్షలమంది రైతుల ఖాతాల్లోకి జమచేసిన ఘనత సిఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికే దక్కిందన్నారు. అనంతరం సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు అల్వాల్ రెడ్డి, రమేష్‌గౌడ్, మల్లయ్య, ప్రకాష్‌రావు, హరీష్‌రెడ్డి, నారాయణరెడ్డి, మధుకర్‌రెడ్డి పాల్గొన్నారు.

## నూతన ఎస్సీ వర్గీకరణ సర్టిఫికెట్లు ఇవ్వాలి

**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ఎస్సీ వర్గీకరణ జరిగిన కూడా, నూతన రిజర్వేషన్ల ప్రకారం, ఎస్సీ గ్రూపులకు సంబంధించిన సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, తెలంగాణ దండోరా వ్యవస్థాపక అధ్యక్షుడు మీసాల రాము మాదిగ అన్నారు. వీపనగండ్లలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి జీఓ విడుదల చేసి ఎస్సీలను 3 గ్రూపులుగా చేశారు. మాదిగ, మాదిగ ఉపకులాలను గ్రూప్ 2కు సంబంధించిన సర్టిఫికెట్లు ఇవ్వాలని అధికారులను కోరగా తమకింకా ఎలాంటి గైడ్ లైన్స్ రాలేదని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. 30 ఏళ్ల మాదిగల పోరాటం ఫలించి రాష్ట్ర ప్రభుత్వాలు అనుకూలంగా జీఓ విడుదల చేసినప్పటికి ఎస్సీ గ్రూపు సర్టిఫికెట్లు ఇప్పటికి అమలు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు ఇంకా గైడ్ లైన్స్ రాలేదని నిర్లక్ష్యం చేస్తే, రిజర్వేషన్ ఫలాలు కోల్పోవాల్సి వస్తుందని, సంబంధిత జిల్లా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను త్వరగా పరిష్కరించాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి తక్షణమే మండల స్థాయిలో తహసీల్దార్ ద్వారా ఎస్సీ వర్గీకరణ గ్రూపు సర్టిఫికెట్లు ఇచ్చే విధంగా చూడాలని కోరారు. లేనిచో మాదిగలు మరో ఉద్యమానికి సిద్ధం కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

## డ్రగ్ ఇన్‌స్పెక్టర్ తనిఖీలు



**ప్రజాపక్షం/పెబ్బేరు :** పెబ్బేరు మండల కేంద్రంలో రాఘవేంద్ర ఆసుపత్రికి చెందిన మెడికల్ షాప్ నిర్వాహకులు మూడు రోజుల క్రితం నాగరాలకు చెందిన గర్భిణీ స్త్రీకి కాలం చెల్లిన మందులను అంటగట్టడంతో వివిధ ప్రచారమాధ్యమాలతో పాటు గర్భిణీ స్త్రీ భర్త డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మంగళవారం రోజు వనపర్తి జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ రష్మీ మెడికల్ షాపులో తనిఖీలు నిర్వహించి కాలం చెల్లిన మందులను అమ్మినందున పనిష్మెంట్‌గా వారం రోజుల పాటు మెడికల్ షాప్‌ను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం అయితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

## రైతు భరోసా డబ్బులు జమ కాలేదని పాన్‌గల్‌లో రైతుల నిరసన



**ప్రజాపక్షం/పాన్‌గల్ :** గ్రామాలలో చాలా మంది రైతులకు ప్రభుత్వం నుండి రావాల్సిన రైతు భరోసా డబ్బులు ఖాతాలలో జమ కాలేదని మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి బాల్య నాయక్ మాట్లాడుతూ ఒక ఎకర, రెండు, మూడు ఎకరాలు నుండి మొదలుకొని చాలా మంది రైతులకు రైతు భరోసా డబ్బులు ఖాతాలలో జమ కాలేదన్నారు. కొంత మంది రైతులకు నాలుగు ఎకరాలు ఉన్న రైతులు 10 గుంటలకు మాత్రమే రైతు భరోసా డబ్బులు ఖాతాలలో జమ అయ్యాయని, మిగతా ఎకరాలకు డబ్బులు పడలేదన్నారు. మండలంలో 30 శాతం మంది రైతులు రెండు ఎకరాలు నాలుగు ఎకరాలు, 5 ఎకరాలలోపు ఉన్న రైతులకు నూటికి 30 శాతం మందికి రైతు భరోసా పథకంకు సంబంధించి డబ్బులు ఖాతాలు జమ్మకాలేదని అన్నారు. గతంలో ప్రభుత్వ భూములకు పట్టేదారు భూములకు డబ్బులు జమ చేయడం జరిగిందన్నారు. ప్రతి రైతుకు రైతు భరోసా డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

## తీర్థ యాత్రలకు వెళ్ళే వారికోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్ళు

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి:** తీర్థ యాత్రలకు వెళ్ళే వారికోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను అందుబాటులోకి తీసుకొచ్చింది. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం జులై 05 వ తేదీ నుండి జులై 13 వ తేదీ వరకు ప్రత్యేక రైళ్లను హైదరాబాద్ నుండి ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సిటీసీ టూరిజం జాయింట్ జనరల్ మేనేజర్ డిఎస్‌జీపి కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. యాత్రకి సంబంధించిన వివరాలు వెల్లడించారు. ప్యాకేజీ వివరాలు: (ఐదు జ్యోతిర్లింగ యాత్ర ఎస్‌సిజెడ్‌బిజీ43): ఉజ్జయిని (మహాకాళేశ్వర్ ఓంకారేశ్వర్ త్రయంబకేశ్వర భీమశంకర్‌ఘృష్ణేశ్వర్). ఈ యాత్రలో మహాకాళేశ్వర్/ ఓంకారేశ్వర్ / త్రయంబకేశ్వర/ భీమశంకర్/ ఘృష్ణేశ్వర్/ ఎల్లోరా/ మోవ్/నాగ్‌పూర్ ప్రాంతాలు సందర్శించవచ్చు. ఈ యాత్ర జులై 05 వ తేదీన ప్రారంభమైన 13వ తేదీ వరకు ఉంటుంది. దీనికి ఒక్కొకరికి సాధారణ టికెటు ధర రూ.14,700, 3 ఏసీ ధర రూ.22900,2 ఏసీ ధర రూ.29900 ఉంటుంది. ఈ యాత్ర సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, నాందేడ్, ముద్ఖడ్, పూర్ణ మీదుగా వెళ్తుంది. సౌకర్యాలు: రైలు, బస్సు, హోటల్, అన్ని భోజనాలు (ఉదయం అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం), వాటర్ బాటిల్, టూర్ ఎస్కాట్ సేవలతో సందర్శనా స్థలాలు, (అదనపు ఖర్చు లేదు), ప్రయాణ బీమా, ఇన్సూరెన్స్ అలాగే రైల్వే స్టేషన్ నుండి దేవాలయాలకు ప్రమాణం పూర్తిగ ఉచితం. ప్రతి రైలులో 718 మంది ప్రయాణికులు ఉంటారు. ప్రతి 70 మందికి ఇద్దరు కోర్డినెటర్లు అందుబాటులో ఉండి అన్ని సావకార్యాలు సమకురుస్తారు. కోచ్‌కి ఒక సెక్యూరిటీ గార్డ్ అలాగే రైలులో సీసీ కెమెరాలతో కూడిన భద్రత ఉంటుందని తెలియజేశారు. టికెట్ బుక్ చేసుకోవాలి అనుకునే వారు వివరాలకు 9701360701, 9281495843, 928103750, 9281030749 లకు సంప్రదించాలని మరిన్ని వివరాలకు వెబ్‌సైట్‌ని సంప్రదించాలని తెలిపారు.

## శాగపూర్‌లో ఆరోగ్య వైద్య శిబిరం

**ప్రజాపక్షం/పాన్‌గల్ :** పాన్‌గల్ మండల పరిధిలోని శాగపూర్ గ్రామంలో మంగళవారం జిల్లా వైద్య బృందం, ఇంటిగ్రేటెడ్ హెల్త్ క్యాంపేన్ బృందం , ఎన్‌జిఓ టీమ్ సభ్యుల సహకారంతో నిర్వహించిన సమగ్ర ఆరోగ్య వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరంలో 66 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డా. చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆరోగ్య సమస్యలు ఉన్న వారు ఖచ్చితంగా వైద్యుల సలహాలు, సూచనలను పాటించి వైద్య పరీక్షలను చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటి హెల్త్ ఆఫీసర్ రామయ్య, ఎమ్ఎల్‌హెచ్‌పి డా.నిహారిక, తార శశాంక్, సూపర్వైజర్ సుమనశ్రీ, హెల్త్ అసిస్టెంట్స్ రామచంద్రయ్య, సుమిత్ర, ఆశ కార్యకర్తలు సరిత, సరస్వతి, రేణుక, యాదమ్మ, వైద్య శిబిరం సిబ్బంది, కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

# జిల్లాలో ఉత్సాహంగా రైతు విజయోత్సవ సంబరం

### జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** జిల్లావ్యాప్తంగా రైతువేదికలవద్దకు అన్నదాతలు స్వచ్ఛందంగా తరలివచ్చి రైతుభరోసా నిధులు తొమ్మిదిరోజుల వ్యవధిలోనే పూర్తిస్థాయిలో బ్యాంకుఖాతాలలో ప్రభుత్వం జమచేయడంపట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ముఖాముఖి కార్యక్రమంలో రైతులు ఆసక్తిగా పాల్గొన్నారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గపరిధిలోని తాడూరు మండలం ఇంద్రకల్ వ్యవసాయ క్లస్టర్ రైతు వేదికలో రైతువేదిక నుండి ఆదర్శ రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతు సంక్షేమానికి రైతులకు వ్యవసాయ పనుల కోసం రైతుభరోసాసాయంతో వారిని ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషి చేస్తుందన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 9రోజుల్లోనే 2,92,539మంది రైతుల ఖాతాల్లోకి రూ.394.381 కోట్ల రూపాయలను జమచేయడం జరిగిందన్నారు. ప్రభు త్వం అందించిన పెట్టుబడిసహాయం రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, కలుపు మందులు కొనుగోలుకు సక్రమంగా వినియోగించుకోవడానికి అందించడం జరిగిందన్నారు. రైతులు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అలంభించి పంటలు పండించాలని, కొత్త సాంకేతికతలను ఉపయోగించి తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చన్నారు. రైతుభరోసా నిధులు తొమ్మిదిరోజుల వ్యవధిలోనే తమఖాతాల్లో జమచేయడంపట్ల రైతు లు ఆనందం వ్యక్తం చేశారు. సిఎం ప్రసంగాన్ని రైతులు ఆసక్తిగా తిలకించారు. ఇంద్రకల్ రైతువేదికలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రశేఖర్, జిల్లా ఆర్టికల్చర్ అధికారి వెంకటేశం, తాడూరు తహసీల్దార్ జయంతి, మండల వ్యవసాయ అధికారి, ఇంద్రకల్ వ్యవసాయక్లస్టర్‌పరిధిలోని రైతులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నిర్మూలనలో విద్యార్థులు భాగస్వామ్యం

### ఎస్‌పి యోగేష్ గౌతమ్




**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా:** మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాలలో భాగంగా మక్తల్ విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు, మత్తు పదార్థాల మహమ్మారికి దూరంగా ఉంటూ, ఉజ్వల భవిష్యత్తు కొరకు బాటలు వేసుకోవాలని, మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపిఎస్ పిలుపునిచ్చారు. మంగళవారం రోజు మక్తల్ పట్టణంలోని మహాత్మా జ్యోతి రావు పూలె ట్రైబల్ బిసి వేల్ఫర్ రెసిడెన్సీ స్కూల్ బాయ్స్, అంబేద్కర్ నగర్ (ఐలిన్) స్కూల్ లో ఏర్పాటు చేసిన మత్తు పదార్థాల నిర్మూలన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ విద్యార్థి దశ మీ జీవితానికి అత్యంత కీలకమైన పునాది. ఈ సమయంలో తెలియని ఆకర్షణలకులోనై డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల బారిన పడితే మీ భవిష్యత్తు అంధకారమయమతుంది. ఇది కేవలం మీ ఆరోగ్యాన్ని మాత్రమే కాదు. మీ కుటుంబాన్ని, మీ కలలను కూడా నాశనం చేస్తుంది. పోలీసులు మీ శ్రేయోభిలాషులు, ఎన్‌డిపిఎస్ యాక్ట్ చాలా కఠినమైనది ఒక సారి ఈ కేసులో చిక్కుకుంటే జీవితాంతం దాని పర్యవసానాలు అనుభవించాల్సి వస్తుంది. కాబట్టి మీరంతా చైతన్యవంతులై, మీ స్నేహితులను కూడా ఈ వ్యసనం వైపు వెళ్లకుండా కాపాడాలి అని హితవు పలికారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా, గంజాయి దుష్ప్రభావాలను వివరించి అవగాహన కల్పించారు. విద్యార్థులు స్కూలు కాలేజీల వద్ద చాక్లెట్ రూపంలో మత్తు పదార్థాలను అమ్ముతున్నారని అలాంటి వాటికి దూరంగా ఉండాలని ఎస్పీ సూచించారు. జిల్లాను మాదకద్రవ్యాల రహితంగా మార్చేందుకు పోలీసు శాఖ అహర్నిశలు శ్రమిస్తోందని, ఇందులో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రతిరోజు వినూత్న కార్యక్రమాలు చేపడుతున్నామని ఎస్పీ తెలిపారు. ప్రజల చైతన్యం, సహకారంతోనే మత్తు పదార్థాలైన డ్రగ్స్, గంజాయిని పూర్తిగా నిర్మూలించగలమని, తద్వారా నేరరహిత సమాజాన్ని స్థాపించగలమని ఆయన గట్టిగా విశ్వాసం వ్యక్తం చేశారు. డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాల సమాచారం తెలిస్తే విద్యార్థులు 1908 టోల్ ఫ్రీ నెంబర్‌కి సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మక్తల్ సిఐ రామ్ లాల్, ఎక్సైజ్ సిఐ అశోక్ కుమార్, ఎస్‌ఐలు భాగ్య లక్ష్మి రెడ్డి, అశోక్ బాబు, డివైయస్‌ఓ వెంకటేశ్, అనిల్ గౌడ్, ప్రిన్సిపాల్ రాములు, యంఈఓ ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# క్షయను పారదోలేందుకు కట్టుదిట్టమైన చర్యలు

### కలెక్టర్ ఆదర్శ్ సురభి



**ప్రజాపక్షం/వనపర్తి ప్రతినిధి :** భూ భారతి చట్టం అమలులో భాగంగా వనపర్తి జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో జిల్లా వ్యాప్తంగా 8059 దరఖాస్తులు స్వీకరించడం జరిగిందని వాటిలో ఇప్పటికే ఆరు వేలకు పైగా దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం ఉదయం హైదరాబాద్ నుండి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వన మహోత్సవం, ఇందిరమ్మ ఇళ్లు, ఎరువుల నిల్వలు, ఆయిల్ పాం సాగు, భూ భారతి, సీజనల్ వ్యాధుల నిర్మూలనపై సమీక్ష నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ వివరిస్తూ రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడమే కాకుండా నోటీస్‌లు జారీ చేసి దరఖాస్తులు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జిల్లాలో క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే సమస్యాత్మక ప్రజలను గుర్తించి వారికి తేమడ పరీక్షలు నిర్వహించడం మొబైల్ ఎక్స్‌రే మిషన్ కొని ఎక్సరేలు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటి వరకు గుర్తించిన 567 మంది క్షయ వ్యాధి గ్రస్తులకు క్రమం తప్పకుండా వైద్యం, మందులు ఇవ్వడమే కాకుండా వారికి అంత్యోదయ కార్డులు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆర్‌బిఎస్‌కె ద్వారా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, వర్కర్లకు వైద్య పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఆయిల్‌ఫాం సాగు పెంచేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా చేపడుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలను జిల్లాలోని విజయవంతం చేసేందుకు జిల్లా కలెక్టర్లు, ప్రత్యేక దృష్టి పెట్టాలని, తరచుగా అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ కార్యక్రమాలు విజయవంతం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇంచార్జీ యాదయ్య, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందా నాయక్ , ఉమాదేవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రిలో కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** వైద్యసేవలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేకదృష్టిసారించడంతోపాటు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వైద్యులు, సిబ్బంది సమయానికి వస్తున్నారా, లేదా అని ఆరా తీశారు. ఆస్పత్రిలోని ఐసియు, ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ గదులను పరిశీలించారు. రోగులతో మాట్లాడివారి ఆరోగ్యస్థితులను తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని వార్డులో వివిధరకాల రోగులకు అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఇతర వ్యాధిగ్రస్తులకు మహిళలు, శిశువులకు అందించే చికిత్సలపై కూడా ఆరా తీశారు. జనరల్‌వార్డు, ఎక్స్‌రేరూమ్, ప్రయోగశాలను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలోని ఆపరేషన్ థియేటర్లను వినియోగంలోకి తీసుకురావడానికి కావాల్సిన మరమ్మత్తులకు కావాల్సిన నిధులను తక్షణమే మంజూరు చేస్తామని వెంటనే మరమ్మత్తులు పూర్తి చేసి మూడు ఆపరేషన్ థియేటర్లను వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. ఆస్పత్రిలో కావాల్సిన అన్ని మౌకలి వసతులను కల్పిస్తామని, ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అదేవిధంగా ఆస్పత్రిలోని పలు రికార్డులను పరిశీలించి, వైద్య అధికారులకు పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో రోగుల కోసం ఏర్పాటు చేసిన మరుగుదొడ్ల సౌకర్యాలను పరిశీలించారు. ఆయనవెంట ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రఘు, ఇతర వైద్యులు ఉన్నారు.

**జిల్లావ్యాప్తంగా వనమహోత్సవ కార్యక్రమం**

జిల్లావ్యాప్తంగా వనమహోత్సవం కార్యక్రమంద్వారా 41 లక్షల మొక్కలను నాటేలా ప్రణాళికలు ఏర్పాటుచేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. మంగళవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావు ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్‌ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆన్‌లైన్‌నుంచి అటవీ పర్యావరణ శాఖమంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. వన మహోత్సవం కార్యక్రమం, ఇందిరమ్మ ఇండ్లు, ఎరువుల లభ్యత, ఆయిల్‌ఫామ్ పంట విస్తరణ, సీజనల్‌వ్యాధుల నియంత్రణకు చర్యలు, భూభారతి దరఖాస్తుల పరిష్కారంవంటి పలు అంశాలపై సిఎస్ సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలుచేశారు. ఈ వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్‌గోపిడి, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయంలతోకలిసి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ సమీకృత జిల్లా కలెక్టరేట్‌నుంచి పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరిస్తూ సీజనల్‌వ్యాధుల నియంత్రణకు గ్రామీణ పట్టణప్రాంతాల్లో పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని, ప్రతి శుక్రవారం డ్రైడే కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులపట్ల జిల్లాలో అధికారయంత్రాంగం అప్రమత్తంగా ఉండేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈవీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఉపాధి సామర్థ్యాలను పెంచుకోవాలి

**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలితో కలిసి లైఫ్ సైన్సెస్ సెక్టార్ స్కిల్ డెవలప్మెంట్ కౌన్సిల్ ద్వారా మూడు లేక నాలుగు సంవత్సరాల అప్రెంటిస్షిన్ ఎంబెడెడ్ డిగ్రీ ప్రోగ్రామ్ (ఏఈడిపి) అనేది ప్రోగ్రాంలో అప్రెంటిస్ షిప్ శిక్షణను ఒక ప్రధాన భాగంగా సమగ్ర పరచడానికి రూపొందించబడిన ఒక కార్యక్రమం ఇది విద్యార్థులను అధ్యయనాలతో పాటు ఆచరణాత్మక ఉద్యోగ అనుభవాన్ని పొందేందుకు వారి ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించడానికి, వర్కు ఫోర్స్‌కు వారిని సిద్ధం చేయడానికి డిగ్రీ అలాగే ఉద్యోగం లక్ష్యంగా పెట్టుకున్న కార్యక్రమం అని ఏఈడిపి తెలంగాణ ఇన్చార్జ్ పృథ్వి ఈ కోర్సుల ప్రాధాన్యత వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ అటానమస్ కళాశాలలో ఈ కార్యక్రమం కింద ప్రముఖ లైఫ్ సైన్సెస్‌లో మార్కెటింగ్ సేల్స్ అండ్ ఫార్మా మెడిటెక్ అలాగే బీకాంలో బిఎఫ్‌ఎస్ఐ కోర్సులను కళాశాల దోస్త్ అడ్మిషన్ ప్రమాణాల ప్రకారం ఏదైనా గ్రూప్‌ను విద్యార్థులు ఎంచుకొని గ్రాడ్యుయేషన్ తర్వాత మెరుగైన ఉపాధి సామర్థ్యాలను పెంచుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి.రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్.పద్మ అనురాధ, మధుసుదన్ శర్మ, డాక్టర్. శ్రీదేవి, అనిత, సుధాకర్ రెడ్డి, మద్దిలేటి పాల్గొన్నారు.

## సిపిఐ జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయండి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** భారతకమ్యూనిస్టుపార్టీ సిపిఐ నాగర్‌కర్నూల్ జిల్లా మూడో మహాసభలను పట్టణంలో ఆగస్టు 1,2తేదిల్లో జరగనున్నాయని ఈమహాసభలను విజయవంతం చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మ పిలుపునిచ్చారు. పట్టణంలోని యుటిఎఫ్ భవనంలో మంగళవారం ఉదయం జిల్లా మహాసభల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన సిపిఐ జిల్లా విస్తృతస్థాయికౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న నిర్లక్ష్యపు ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ ఎప్పటికప్పుడు ప్రజలపక్షాన ప్రజాపోరాటాలు నిర్వహిస్తుందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకివస్తే అద్భుతాలను సృష్టిస్తామని ప్రతి ఒక్కరికి రూ.15లక్షలచొప్పున ఉచితంగా ఇస్తానని సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు ఇస్తాననిచెప్పి మోసం చేసిందన్నారు. కాని అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు గడుస్తున్నప్పటికి ఇచ్చిన వాగ్దానాలను ఒక్కటి నెరవేర్చకపోగా వాటికి వ్యతిరేకంగా పని చేస్తూ దేశంలో కులం, మతం, ప్రాంతం ధనిక అనేటటువంటి అంతరాలనుసృష్టించి ప్రజల జీవితాలతో మోడి ప్రభుత్వం చెలగాటమాడుతుందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి నెరవేర్చలేదన్నారు. రైతుభరోసా, రుణమాఫీ అంతా అసంపూర్తిగానే మిగిలిందన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన ప్రతిఒక్కరికి ఇవ్వాలన్నారు. ఈసమావేశంలో సిపిఐజిల్లా నాయకులు డాక్టర్ శ్రీనివాసులు, హెచ్.ఆనంద్‌జి, ఎస్ఎండి ఫయాజ్, వార్లవెంకటయ్య, కేశవులు గౌడ్, నర్సింహ్మ, ఈర్ల చంద్రమౌళి, కొమ్ము భరత్, ఇందిర, పులిజాల పరుష రాములు, గడ్డం శ్రీనివాస్, మల్లేష్, గోపాల్, శివశంకర్ పాల్గొన్నారు.

## విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



### కృష్ణ ఎస్ఐ ఎస్ఎం.నవీద్

**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా:** పర్యావరణ అనుకూలతకు చెట్లు నాటి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు మాదకద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా మాదకద్రవ్యాలకు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని కృష్ణ ఎస్ఐ ఎస్ఎం.నవీద్ తెలియజేశారు. మంగళవారం రోజు కృష్ణ మండలంలోని గుడెబల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటి డ్రగ్స్ గంజాయి వంటి మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని మొక్కలు నాటడం వల్ల మనకు మంచి ఆక్సిజన్‌తో ఆరోగ్యం వస్తుందని అలాగే మత్తుపదార్థాల వల్ల జీవితాలు చిత్తవుతాయని, కావున మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అలాగే విద్యార్థులు, యువకులు తమ చుట్టుపక్కల ఉన్న వారు ఎవరైనా మత్తు పదార్థాలు గంజాయి డ్రగ్స్ వంటివి సేవిస్తున్నట్లు తెలిస్తే వెంటనే 1908 టోల్ ఫ్రీ నెంబర్‌కు లేదా దయల్ 100 కి సమాచారం ఇవ్వాలని ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్‌మాస్టర్,ఉపాధ్యాయులు,విద్యార్థులు, కృష్ణ పాల్గొన్నారు.

## నూతన జిల్లా అధ్యక్షుడు, మండల అధ్యక్షుడికి సన్మానం

**ప్రజాపక్షం/మానవపాడు:** జోగులాంబ గద్వాల జిల్లా అల్లంపూరు నియోజకవర్గం అలంపూరు చౌరస్తాలోని ఆర్.కిషోర్ కార్యాలయానికి జై నడిగడ్డ యువత కమిటీ నూతన అధ్యక్షులు విచ్చేసిన సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పల్లె రాజుకి మానవపాడు మండల నూతన అధ్యక్షుడు శాంతకుమార్ కి ముందుగా శాలువాతో సన్మానించి బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆర్.కిశోర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్.కిషోర్ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు విద్యా అవకాశాలలో సహకారం అందించాలని యువతకు ఉపాధి కార్యక్రమాలు వెసులుబాటు కలిగించే తట్టు చూడాలని నిత్యం ప్రజల్లో అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జై నడిగడ్డ యువత సభ్యులు, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆర్.కిశోర్ ఉద్యమకారుడు చెన్నిపాడు దుబ్బన్న, జల్లాపురం గ్రామస్తులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 15నాటికి రెవెన్యూ సదస్సుల దరఖాస్తుల పరిష్కారం




**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ప్రజలకు భాగస్వామ్యం చేస్తూ వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం చేయాలని రాష్ట్ర ముఖ్య కార్యదర్శి కే.రామకృష్ణారావు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుంచి సిఎస్ కే.రామకృష్ణరావు ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఆన్‌లైన్ నుంచి అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ జిల్లా కలెక్టరేట్‌లోని వీసీ హాల్ నుంచి పాల్గొన్నారు. వన మహోత్సవం కార్యక్రమం, ఇందిరమ్మ ఇండ్లు, ఎరువుల లభ్యత, ఆయిల్‌పామ్ పంట విస్తరణ సీజనల్ వ్యాధుల నియంత్రణకు చర్య లు, భూభారతి దరఖాస్తుల పరిష్కారం వంటి పలు అంశాలపై సీఎస్ సుదీర్ఘంగా చర్చించి పలు సూచనలు చేశారు. ముఖ్య కార్యదర్శి కే.రామ కృష్ణా రావు మాట్లాడుతూ 2 లక్షల 30 వేలకు పైగా ఇందరిమ్మ ఇండ్ల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశామని, లక్షకు పైగా ఇండ్ల నిర్మాణ పనులు గ్రౌండ్ అయ్యాయని అన్నారు. జిల్లాలో ఎరువుల కొరత ఏమి లేదని కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, డీఆర్డి మొగులప్ప, హౌసింగ్ పీడీ శంకర్, జిల్లా వైద్యాధికారి డా.జయచంద్రమోహన్, హార్టికల్చర్అధికారి ఇతర అధికారులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ఇందిరమ్మ ఇండ్లు పేదింటి కల



**ప్రజాపక్షం/ హాలియా:** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పేదవాడి అంత ఇంటి కల నెరవేరుతుందని మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎడవెల్లి నరేందర్ రెడ్డి అన్నారు. శాసనసభ్యులు కుందూరు జయ వీర్ రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం ఇబ్రహీంపేటలో భూమి పూజ నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ళ పథకంలో భాగంగా మంగళవారం అనుముల మండలంలోని ఇబ్రహీంపేట గ్రామ పంచాయతీలో ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లల్లో భూమి పూజ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ అక్బర్, చాపల వెంకన్న, పేరూరి గోవిందు, పేరూరి కోటయ్య, అనుముల సాయికుమార్, చినాల రవి, లింగాల యశ్వంత్, గోపిశెట్టి శేఖర్, లింగాల ప్రభాకర్ పాల్గొన్నారు.




## 192 మంది విద్యార్థులు ఎంపిక

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** లక్కీడ్రా ద్వారా బెస్ట్ అవైలబుల్ పథకం కింద 192 మంది విద్యార్థులను ఎంపిక చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో షెడ్యూల్ కులముల విద్యార్థులకు 202526 విద్యా సంవత్సరంలో బెస్ట్ అవెలబుల్ పథకం కింద వివిధ పాఠశాలల్లో 1వ తరగతి డెస్కాలర్, 5వ తరగతి రెసిడెన్షియల్‌లో ప్రవేశాలకు మంగళవారం లక్కీ డ్రా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1వ తరగతిలో 94 మంది విద్యార్థులకు, 5వ తరగతిలో 98 మంది విద్యార్థులను లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి దయానందరాణి, డిఈవో అశోక్, రెసిడెన్షియల్ జిల్లా కోఆర్డినేటర్ సిహెచ్ పద్మ, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మార్పు కోసమే జరిమానా : ఎస్‌పి




**ప్రజాపక్షం/సూర్యాపేట:** చట్టాలు ప్రజల రక్షణ కోసమే ఏర్పటు చేయబడినవని, జరిమాన మార్పుకోసమేనని, మాదకద్రవ్యాల బారీ నుండి సమాజాన్ని కాపాడుకోవాలని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పబ్లిక్ క్లబ్ లో సూర్యాపేట పట్టణ, ట్రాఫిక్ పోలీసులు, పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లకు, రోడ్డు భద్రత ప్రమాదాల నివారణ, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమంలో ఎస్‌పి పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాల జోలికి వెళ్లమని ఆటోడ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎస్‌పి కె.నర్సింహా మాట్లాడుతూ చట్టాలు ప్రజల రక్షణ కోసమే ఏర్పాటు చేయబడ్డాయని, జరిమాన విధించడం అనేది మానలో మార్పు కోసమే అని, రోడ్డు ప్రమాదాల బారీన పడకుండా జాగ్రత్తలు పాటించాలని, ఆటో డ్రైవర్లు వాహనాలు కండిషన్‌లో ఉంచుకోవాలని, వాహనాలు నడిపేటప్పుడు సౌండ్ బాక్సులు వినియోగించవద్దని, తప్పుల నుండి మంచి పాఠాలు నేర్చుకుని జాగ్రత్తగా ఉండాలని కోరారు. సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాంను పట్టణ ఎస్ఐ ఆంజనేయలును ఎస్‌పి నర్సింహా అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌టివో సురేష్‌రెడ్డి, పోలీసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## ముగ్గురు మేకల దొంగలకు రిమాండ్



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** కొండమల్లేపల్లి, గుర్రంపోడ్, నాంపల్లి మండలాలల పరిధిలోని గ్రామాలలో అర్ధరాత్రి మేకలు, గొర్రెలను దొంగతనం చేస్తున్న నలుగురు అంతర్ జిల్లా నిందితులను అరెస్టు చేసి ముగ్గురిని రిమాండ్‌కు, ఒకరిని జూవైనల్ హోమ్‌కు పంపినట్లు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో కొండమల్లేపల్లి ఇంచార్జీ సిఐ డి. రాజు, ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం యాచారం సోషల్ వెల్ఫేర్ కాలేజిలో ఇంటర్ చదువుతున్న వీరు ఒకరికిఒకరు పరిచయం అయి జూన్ 06వ తేదిన మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామంలోని రోడ్డు పక్కన గల మేకల షెడ్డులో 10 మేకలను దొంగిలించారు. మేకల యజమాని ఎస్‌కే. షరీఫ్‌బీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్ఐ అజ్మీరా రమేష్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తుండగా మంగళవారం మండల కేంద్రంలోని చౌరస్తాలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని విచారించగా తాము గుమ్మడవెల్లి, గుర్రంపోడు, నాంపల్లి మండలాలలో మొత్తం 4 చోట్ల చోరీలు చేసినట్లు నేరం ఒప్పుకున్నారని అన్నారు. వారి వద్ద నుండి రూ. 2లక్షల 20వేల నగదును స్వాదీన పరుచుకొని ముగ్గురు యువకులను రిమాండ్‌కు పంపి, ఒక మైనర్ బాలుడిని జూవైనల్ హోమ్‌కు తరలించారు. తక్కువ సమయంలో దర్యాప్తు చేపట్టి కేసును చేధించిన కొండమల్లేపల్లి ఎస్ఐ అజ్మీరా రమేష్, క్రైమ్ సిబ్బంది భాస్కర్, హేమునాయక్, నవీన్‌రెడ్డిలను ఇంచార్జీ సిఐ రాజు అభినందించారు.

## స్థానిక సంస్థల ఎన్నికలకు కసరత్తు

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** రాష్ట్రంలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు జన సమితి కసరత్తు చేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర ఎన్నికల సబ్ కమిటి సభ్యులు కుంట్ల ధర్మార్జున్, గోపగాని శంకర్‌రావు, ఆశప్ప నిజన్న రమేష్ లు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో పోటీ సాధ్య సాధ్యాలు బల బలహీనతలపై క్షేత్రస్థాయిలో పరిశీలించటం కోసం రాష్ట్ర పార్టీ అధ్యక్షులు కొదండరాం ఏర్పాటు చేసిన ఈ కమిటి సూర్యాపేట జిల్లా కేంద్రంలో భువనగిరి, ఖమ్మం, కొత్తగూడెం, సూర్యాపేట, నల్లగొండ జిల్లా కమిటిల అధ్యక్ష, కార్యదర్శులతో ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీతో పొత్తు ఉన్న లేకున్నా పోటికి సిద్దం కావాలని కార్యకర్తలు ఈ కమిటి ముందు తమ అభిప్రాయాన్ని తెలిపారు. గ్రామ స్థాయి నుండి బూత్ స్థాయి నుండి కమిటిల నిర్మాణానికి డబ్బులు లేని రాజకీయ ప్రచారానికి ఇప్పటి నుండే కార్యకర్తలంతా సమాయత్తమై ప్రచారానికి వెళ్లాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు బొడ్డు రమాశంకర్, బొడ్డు శంకర్, సర్దార్ హుస్సేన్, రవి, దేవదానం, కరుణాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, గుండెబోయిన నాగేశ్వరరావు, గిరిబాబు, సందీప్, నాగిరెడ్డి, పులి పాపయ్య, వినయ్‌గౌడ్, కొల్లు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



## జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె

### జయప్రదం చేయాలని కార్మిక సంఘాల పిలుపు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని జూలై 9 న జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి,సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి,ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షులు అంబటి సోమన్న, బిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు గుర్రం వెంకట్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఐఎన్‌టియుసి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా వంద సంవత్సరాల లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లను ముందుకు తెచ్చిందని అన్నారు. వీటికి వ్యతిరేకంగా గత ఐదేళ్లుగా కార్మిక వర్గం చేస్తున్న ఆందోళన పోరాటాలతో లేబర్ కోడ్ ల అమలు ఐదు సంవత్సరాలు ఆలస్యమైనా వాటిని ఇప్పుడు అమలు చేస్తూ పూర్తిగా కార్మిక హక్కులను హరించే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను వెనక్కి కొట్టేందుకు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు కేంద్ర కార్మిక సంఘాలు స్వతంత్ర ఫెడరేషన్లు అసోసియేషన్లు జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించాయని వాటిని నల్గొండ జిల్లాలో విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు నూనె రామస్వామి, జిల్లా ఉపాధ్యక్షులు కేఎస్ రెడ్డి ,సిఐటియు జిల్లా అధ్యక్షులు చినపాక లక్ష్మీనారాయణ,ఐఎన్టీయూసీ జిల్లా వార్కింగ్ ప్రెసిడెంట్ మైనుద్దీన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకిశాల వెంకన్న, ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు బొంగు రాల నరసింహా, వివిధ సంఘాల నాయకులు ఆర్ ఆచారి,సంబిరెడ్డి జలాలుద్దీన్ పాల్గొన్నారు.

### దేశంలో కార్మిక వ్యతిరేక పాలన: శ్రీనివాసరావు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** దేశంలో కార్మిక వ్యతిరేక పాలన కొనసాగుతుందని, మోడి కార్మిక వ్యతిరేక విధానాలపై జూలై 9న దేశవ్యాప్తంగా కోట్లాదిమంది కార్మికులు రోడ్డెక్కి నిరసన తెలియజేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి మేకల శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం హుజూర్ నగర్ మండల కార్మిక సంఘాల ముఖ్యుల సమావేశం ఎఐటియుసి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న, పెద్ద పరిశ్రమలో పనులను బంద్ ఏసి నిరసన తెలిపాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు జడ శ్రీనివాస్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జెట్టి ప్రసాద్, నాయకులు జక్కుల శ్రీనివాస్, గొల్లగోపు వీరేశం, ముల్కలపల్లి రాము, జక్కుల రమణ పాల్గొన్నారు.



## అసభ్యకరమైన పోస్టులతో వృద్ధ దంపతుల మనస్తాపం



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** మా కుటుంబ సభ్యుల అందరిపై తప్పుడు ఆరోపణలు చేస్తు తమను మానసికంగా ఇబ్బంది పెడుతు కేతేపల్లి గ్రామ రెడ్డి సంఘం వాట్సప్ గ్రూప్ లో పోస్టులు పెడుతు న్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కొప్పుల సునంద, శ్రీనివాస్ రెడ్డి లు కోరారు. మంగళవారం నల్లగొండ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గతంలో ఉన్న భూమి తగాదాలను మనసులో పెట్టుకొని నాన్న ఇబ్బందులు పెడుతున్నారని పేర్కొన్నారు. తాము గౌరవంగా జీవించే కుటుంబం అని వృద్ధుల మైన తమపై కేతేపల్లి గ్రామానికి చెందిన కొప్పుల ప్రదీప్ రెడ్డి అనే వ్యక్తి అసభ్యకరమైన మాటలతో మానసికంగా బాధ పెట్టుచున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల 22న సోషల్ మిడియా వాట్సప్ గ్రూప్ లో మా క్యారెక్టర్ను అసభ్యకరంగా పోస్టులు చేస్తూ మా బందువుల వద్ద, స్నేహితుల వద్ద సభ్య సమాజంలో మాకు సమస్యగా వుందని భారతదేశంలోస్త్రీలకు స్వేచ్ఛగా బ్రతికె హక్కు వున్న ఇలా మా పైన అసభ్యంగా బహిరంగంగా పోస్టులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు . దీనిపై అధికారులు సమగ్రా విచారణ చేయించి తప్పుచెసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోని సోషల్ మిడియా వాట్సప్ గ్రూప్ నుండి ఈ అసభ్యకరమైన పోస్టును డిలీట్ చేయించాలని అధికారులను కోరారు.

## బాల్య వివాహాలపై అవగాహన సదస్సు




**ప్రజాపక్షం/బీబీనగర్ :** రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రాచకొండ ఎల్బీనగర్ అడిషనల్ సీపీ ఇన్చార్జి ఎండి షాకీర్ హుస్సేన్ ఆదేశాల మేరకు మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఎస్ఐ రాములు నాయక్ మాట్లాడుతూ బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు, లైంగిక వేధింపులు, గృహనిర్బంధాలు, బాల కార్మిక చట్టంపై బలవంతపు వ్యభిచారం ఇతర దేశాలకు బాలికలను అమ్మివేయడం వంటి చట్టాలపై అవగాహన కల్పించారు. ఆపదలో ఉన్నప్పుడు 100 నంబర్ గాని ప్రస్తుతం ప్రభుత్వం ఆ నంబర్ల స్థానంలో 112 నెంబర్ను అత్యవసర సేవల కోసం ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఈ నెంబర్‌కు ఫోన్ చేసినట్లయితే అత్యవసర సేవలకు వేగంగా స్పందించే విధంగా ఏర్పాటు చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఇందిర ప్రేమ జ్యోతి, ఎస్సై జి.వెంకట శ్రీను, మహిళా కానిస్టేబుల్ లలిత పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడితే జరిమానా తప్పదు

**ప్రజాపక్షం/మునుగోడు:** మండలంలోని ప్లాస్టిక్ ను నిషేధించామని ఎవరైనా ప్లాస్టిక్ వాడితే జరిమానాలు తప్పవని ఇన్చార్జ్ ఎంపీడీవో భాస్కర్ హెచ్చరించారు. మంగళవారం మండల కేంద్రంలో పలు దుకాణ సముదాయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి ప్లాస్టిక్ ను వాడుతున్న దుకాణ యజమానులకు 13వేల రూపాయలు జరిమాణాలు విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్లాస్టిక్ ని అమ్మినట్లయితే, వారు ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. మండల పంచాయతీ అధికారి స్వరూప రాణి, గ్రామపంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి విద్యార్థికి పర్యావరణంపై అవగాహన

### కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్



**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** ప్రతి విద్యార్థి పర్యావరణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ అన్నారు. మంగళవారం కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్‌తో కలిసి నేషనల్ స్టూడెంట్ పర్యావరణ కాంపిటేషన్ (ఎన్ఎస్‌పిసి) 2025 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూలై 1న నుండి విద్యార్థుల కోసం పర్యావరణ క్విజ్ పోటీకి నమోదు ప్రారంభం అవుతుందని, వాతావరణ మార్పుల పర్యావరణాల నుండి రక్షణకు విద్యార్థుల్లో పర్యావరణ నైపుణ్యాలు, జీవనశైలి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని, జిల్లాలోని అన్ని విద్యా సంస్థల విద్యార్థలందరూ ఈ పోటీల్లో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. అదే థీమ్ పై దేశ వ్యాప్తంగా ఎన్ఎస్‌పిసి పోటిని పర్యావరణ సంరక్షణ (పిఎస్‌జి) నిర్వహిస్తోందని, ఈ క్విజ్ పోటీకి జూలై 1 నుండి ఆగస్టు 21 వరకు రిజిస్ట్రేషన్ అందుబాటులో ఉంటుందని, ఈ పోటీకి కేంద్ర విద్యా పర్యావరణ మంత్రిశాఖల సహాయ సహకారం కూడా ఉంటుందని , ఫలితాలు ఆగస్టు 30న ప్రకటించబడతాయని, ఒకటో తరగతి నుండి పరిశోధన విద్యార్థులు వరకు ఐదు విభాగాల్లో పోటి నిర్వహించబడుతుందని తెలిపారు. ఇసివోఎంఐటిఆర్ఎం యాప్ ద్వారా రిజిస్టేషన్ చేసుకోవాలని, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో క్విజ్ ప్రశ్నలు ఉంటాయని, ఈ క్విజ్ పోటికి రిజిస్టేషన్ ఫీజు లేదని, మొక్కలు నాటుతున్న మీరు సేవ చేస్తున్న సెల్ఫీ అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. అన్ని విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సహించాలని, ఈ పోటీల్లో 5 విభాగాలుగా నిర్వహించబడుతుందని తెలిపారు. ఒకటవ తరగతి నుండి ఐదవ తరగతి వరకు, ఆరో తరగతి నుండి 8వ తరగతి వరకు, 8వ తరగతి నుండి 12వ తరగతి వరకు, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు, ఇతరులు సామాన్య పౌరులు కూడా పాల్గొన్నవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈవో అశోక్, జిల్లా సైన్స్ అధికారి దేవరాజ్, సెక్టోరల్ అధికారి శ్రా వణ్, జనార్ధన్, రాంబాబు, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## రైతును రాజును చేయడమే లక్ష్యం



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** రాష్ట్రంలోని అన్ని రైతు వేదికల లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతుల ప్రయోజనార్థం ప్రత్యక్ష ప్రసారం చేయగా నకిరేకల్ మండలం,చందుపట్ల రైతు వేదిక లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి హాజరయ్యారు. వ్యవసాయాన్ని పండగ చేసి రైతును రాజును చేయడమే తమ లక్ష్యమని రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి అన్నారు. చెప్పిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా కింద 9 రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలను 70 లక్షల మంది రైతుల ఖాతాలలో జమ చేసిన సందర్భంగా మంగళవారం హైదరాబాదులోని సెక్రటేరియట్ వద్ద నిర్వహించిన రైతు విజయోత్సవ సంబరాలు లో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి తన ప్రసంగంలో గత ప్రభుత్వం ఎగ్గొట్టిన 7,625 కోట్ల రైతు బంధు నిధులను తాము అధికారంలోకి వచ్చిన తరువాత చెల్లించామన్నారు. చెప్పిన విధంగానే మొదటి సంవత్సరంలోనే 21 వేల కోట్ల రూపాయలురెండు లక్షల లోపు రుణాలను మాఫీ చేసి 2024 ఆగస్టు 15న రైతులను రుణ విముక్తులను చేసామని గుర్తు చేశారు.వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, ఆర్డీవో అశోక్ రెడ్డి, తహసిల్దార్ జహీరుద్దీన్, మాజీ ఎంపిటిసి సరిత, ఇంచార్జ్ వ్యవసాయ అధికారి జానిమియా, తదితరులు హాజరయ్యారు. భూభారతి లో భాగంగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారం, టి బి ముక్త్ భారత్ కింద టిబి,(క్ష)నివారణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు.మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వివిధ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్షిస్తూ జిల్లాలో క్షయ వ్యాధినివారణకుతీసుకోవాల్సిన చర్యల పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని,ప్రజలు టైఫాయిడ్,డెంగ్యూ తదితర వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తం చేయాలని చెప్పారు. మంగళవారం హైదరాబాద్ లో నిర్వహిస్తున్న 'రైతు భరోసా సంబరాల' పాల్గొనేందుకు జిల్లా నుండి బయలుదేరి వెళుతున్న రైతుల వాహనాలకు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు.సుమారు 200 మంది రైతులు జిల్లా నుండి హైదరాబాదులో నిర్వహిస్తున్న రైతు భరోసా రైతు సదస్సుకు హాజరయ్యేందుకు తరలి వెళ్లారు .ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధనపు కలెక్టర్ జే .శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్,జిల్లా వ్యవసాయ అధికారి శ్రవణ్, జిల్లా ఉద్యాన శాఖ డిడి అనంతరెడ్డి హాజరయ్యారు.

## మాదకద్రవ్యాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మాదకద్రవ్యాలు, గంజాయి లాంటి మత్తు పదార్ధాలకు విద్యార్థులు, యువత దూరంగా ఉండాలని హుజూర్‌నగర్ సిఐ చరమందరాజు అన్నారు. మంగళవారం పట్టణంలోని జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల నిర్మూలన విద్యార్థుల పాత్ర అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. డ్రగ్స్ వినియోగించే వారి జీవితం నాశనం అవుతుందని, వారి భవిష్యత్ కోల్పోతారని చెడు వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్యాలను ఎంచుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, పోలీసులు పాల్గొన్నారు.

## నత్తనడకన బ్రిడ్జి పనులు

### మూడు సంవత్సరాలైనా పూర్తికాని పనులు

**ప్రజాపక్షం/ఉండవెల్లి:** మండల పరిధిలోని బైరాపురం బ్రిడ్జి పనులు నత్త నడకన నడుస్తున్నాయి. కాంట్రాక్టర్ పనులు చేయడంలో నిర్లక్ష్యం ధోరణి అవలంబిస్తున్నాడని విమర్శలు ఉన్నాయి. సుమారు కోటి రూపాయలు బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన మూడు సంవత్సరాలు పూర్తి కావస్తున్న పనులు ఇంకా పూర్తి కాకపోవడంతో వాహనదారులకు రాకపోకలకు స్థానికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. కాంట్రాక్టర్ సబ్ కాంట్రాక్టర్‌తో పనులు చేయడం వలన జనం జరుగుతుందని స్థానికులు వాపోతున్నారు. పనులు కూడా నాణ్యతగా చేపట్టడం లేదా నే విమర్శలు ఉన్నాయి. వర్షాకాలం ప్రారంభమైన పనులు ముందుకు సాగకపోవడంతోనే మార్గం దారి లేక సమస్యగా ఏర్పడిందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉన్నతాధికారులు స్పందించి వెంటనే బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. స్థానికుడు పాండు మాట్లాడుతూ బ్రిడ్జి పనులు ప్రారంభమై మూడు సంవత్సరాల కాలం గడిచిన నేటికి పూర్తి కాకపోవడంతో భారీ వర్షాల ప్రభావం వల్ల స్థానికులకు రాకపోకలకు సమస్య ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చెందారు. పన్నుల్లో నాణ్యత చేపట్టే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.



## మనువాద సిద్ధాంతాన్ని వ్యాప్తి చేస్తున్న బిజెపి, బిఆర్ఎస్

### తెలంగాణ రాష్ట్ర డ్యిప్యూటీ స్పీకర్ రామచంద్రునాయక్




**ప్రజాపక్షం/సూర్యాపేట:** బిజేపి, ఆర్ఎస్ఎస్‌లు దేశంలో మనువాద సిద్ధాంతాన్ని వ్యాప్తి చేస్తూ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల అణిచివేతకు పాల్పడుతున్నారని డోర్నకల్ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర డిప్యూటి స్పీకర్ రామచంద్రనాయక్ అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని రెడ్డి హస్టల్‌లో మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి సహకారంతో మాజీ ఎంపిపి, మార్కెట్ కమిటి డైరెక్టర వీరన్ననాయక్ అధ్యక్షతన నిర్వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా ఆదివాసి బునియాది కార్యకర్తల శిక్షణ శిబిరానికి ఆయన ముఖ్య అతిధిగా పాల్గొ మాట్లాడారు. దేశంలో బిజెపి, ఆర్ఎస్ఎస్ లు మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నాయని, ప్రజల మధ్య చిచ్చుపెట్టి విభజించే విధానాన్ని అవలంభిస్తున్నాయని అన్నారు. కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే అన్ని వర్గాలను సమానంగా ఆదరిస్తుందని, దళితులకు మైనార్టీలకు ఆదివాసీలకు కాంగ్రెస్ పార్టీలోనే రక్షణ లభిస్తుందని అన్నారు. ఆదివాసీల భూములను వారికి అప్పగించే విధంగా కాంగ్రెస్ పార్టీ అనేక చట్టాలను తీసుకొని వచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతి అని, ఇందిరగాంధీ గరిబ్ హటావో నినాదంతో పాటుగా భూ సంస్కరణ చట్టం తీసుకవచ్చి లక్షలాది ఎకరాలను పేదలకు పంచారని ఆయన అన్నారు. మాజీ ప్రధాని మన్‌హ్మన్ సింగ్ ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణలే ఈనాడు దేశాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రపంచంలో నాల్గవ ఆర్థిక శక్తిగా నిలబడటానికి తోడ్పాడ్డాయని చెప్పారు. ఉపాధి హామీ పథకం, సమాచార హక్కు చట్టంం, భూసేకరణ నియంత్రణ చట్టం లాంటి చట్టాలను తీసుకొని వచ్చి పేదలకు రక్షణ కల్పించారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బంజారాల ఆరాధ్యదైవమైన సంత్ సేవలాల్ జయంతిని ప్రభుత్వ సెలవుగా గుర్తించిందని, రాష్ట్రంలో నలుగురు ఎస్పీలు ఎస్టీలని, ట్రైకారగ చైర్మన్‌తో పాటు కార్యదర్శి కూడా ఎస్టీలని, సింగరేణి ఎండిగా ఎస్టీకి చెందిన వ్యక్తిని నియమించారని ఆయన గుర్తు చేశారు. ఆదివాసీ బంజారా బిడ్డలు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను తెలుసుకోవాలని, అందుకోసమే శిక్షణ తరగతులను ఏర్పాటు చేశామని, ఇప్పటికే ఐదు జిల్లాలో ఈ శిక్షణ పూర్తి ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నిర్వహిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ భారత స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న పార్టీ అని, అహింసా మార్గంలో మహాత్మాగాంధీ స్వతంత్ర సాధనకు కృషి చేశారని, రాజ్యంగ నిర్మాతగా బిఆర్ అంబేద్కర్‌ను కాంగ్రెస్ పార్టీ నియమించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, టూరిజం డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యానాయక్, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ కోట్యానాయక్, ఎలిటిమినేటి అభినయ్, బాబునాయక్, నాగేశ్వర్‌నాయక్, శ్రీను, మల్లిఖార్జున్, శివనాయక్ పాల్గొన్నారు.

# రీల్




## 'జై బగళాముఖి' పాట విడుదల

నితిన్ హీరోగా వేణు శ్రీరామ్ దర్శకత్వంలో నిర్మించిన 'తమ్ముడు' సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో 'జై భగళాముఖిజై నాయకీ జై వరరూపిణి' పాటను విడుదల చేశారు. ఈ పాటను జొన్నవిత్తుల్లా రామలింగేశ్వర రావు రాశారు. గాయత్రీ స్తోత్రంగా తెరకెక్కించారు. ఈ పాట చిత్రీకరణ కోసం అమ్మవారి సెట్ వేశారు. నితిన్ సరసన సప్తమి గౌడ, వర్ష బొల్లమ్మ హీరోయిన్ లుగా నటించారు. చాలా రోజుల తరువాత సీనియర్ నటి లయ ఇందులో అంత్యంత కీలకమైన పాత్రను పోషిస్తోంది. ఎస్వీసీ బ్యానర్ పై దిల్ రాజు, శిరీష్ నిర్మించిన ఈ సినిమాను జూలై 4వ తేదీన విడుదల చేయనున్నారు. అన్న చెల్లెలి సెంటిమెంట్ తో తెరక్కేకించిన చిత్రమని నిర్మాత దిల్ రాజు చెప్పారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయని అన్నారు.



## 'షోటైం' ట్రైలర్ విడుదల

స్కై లైన్ మూవీస్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై కిషోర్ గరికిపాటి నిర్మాతగా మదన్ దక్షిణామూర్తి దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం షో టైం. ట్రైలర్ విడుదల కార్యక్రమం ఘనంగా జరుపుకుంది. నవీన్ చంద్ర హీరోగా కామాక్షి భాస్కర్ల హీరోయిన్‌గా నటిస్తున్న వినూత్నమైన థ్రిల్లర్ చిత్రం షో టైమ్ జూలై 4న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు రంగం సిద్ధమైంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాత అనిల్ సుంకర ప్రజెంట్ చేస్తున్నారు. ఒక మర్డర్ చుట్టు అల్లుకున్న కథ ఇది. కోర్ట్‌లో సాగే డ్రామా, పోలీస్ ఇన్విస్టిగేషన్ సీన్లతో ఊపిరి బిగపట్టి చూసే ఆసక్తికరమైన సన్నివేశాలు ఇందులో ఉన్నాయి. ట్రైలర్ రిలీజ్ సందర్భంగా నటుడు రాజా రవీంద్ర మాట్లాడుతూ చిన్న సినిమా, పెద్ద సినిమా అని కాదు కాన్సెప్ట్ బాగుంటే సినిమా చాలా బాగా ఆడుతుంది అన్నారు. ఈ క్యారెక్టర్ ఇచ్చిన డైరెక్టర్ మదన్ దక్షిణామూర్తి కి ప్రత్యేక ధన్యవాదాలు చెప్పారు.


## ఆగస్టు 27న 'మాస్ జాతర'





మాస్ మహారాజా రవితేజ కథానాయకుడిగా నటిస్తున్న ప్రతిష్టాత్మక 75వ చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను మెప్పించి సినిమాపై భారీ అంచనాలు ఏర్పడేలా చేసింది. 'మాస్ జాతర' కోసం అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్నారు. తాజాగా నిర్మాతలు చిత్ర విడుదల తేదీని ప్రకటించారు. 'మాస్ జాతర' చిత్రం వినాయక చవితి కానుకగా ఆగస్టు 27న విడుదల కానుంది.

## 'సమ్మతమే' దర్శక నిర్మాతల కొత్త చిత్రం

రొమాంటిక్ కామెడీ ఎంటర్ టైనర్ గా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది 'సమ్మతమే' సినిమా. గోపీనాథ్ రెడ్డి దర్శకత్వంలో యూజీ ప్రొడక్షన్స్ నిర్మించిన సినిమా రిలీజై సరిగ్గా మూడేళ్లవుతోంది. 2022, జూన్ 24న 'సమ్మతమే' ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఈ ప్రత్యేక సందర్భాన్ని సెలబ్రేట్ చేసుకుంటూ మూవీ టీమ్ క్రేజీ అనౌన్స్ మెంట్ ఇచ్చింది. గోపీనాథ్ రెడ్డి దర్శకత్వంలో యూజీ ప్రొడక్షన్స్ తమ సంస్థలో ప్రొడక్షన్ నెం. 2గా కొత్త చిత్రాన్ని నిర్మించబోతోంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అనౌన్స్ మెంట్ రేపు ఉదయం 11.11 నిమిషాలకు చేయబోతున్నారు. ఈ సినిమా హీరో హీరోయిన్స్, ఇతర వివరాలు బుధవారం వెల్లడించనున్నారు.




## హరిహర వీరమల్లుకు కేరళలో జోరుగా ప్రచారం



పవన్ కళ్యాణ్ హీరోగా నటించిన హరి హర వీరమల్లు సినిమాకోసం ఇతర రాష్ట్రాల్లో జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పవన్ కళ్యాణ్ కెరీర్‌లో తొలిసారిగా ఈ సినిమాను పాన్ ఇండియా సినిమాగా రిలీజ్ చేస్తున్నారు. వచ్చే నెలలో విడుదల కానున్న హరి హర వీరమల్లు సినిమాకోసం నిర్మాతలు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. ప్రస్తుతం కేరళలో ప్రమోషన్ చేస్తున్నారు. దీనికోసం మలయాళంలో పోస్టర్లను రిలీజ్ చేశారు. జులై 24న విడుదల కానున్న ఈ సినిమా కోసం ఎం.ఎం కీరవాణి సంగీతం అందించారు. ఇప్పటికే పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. పవన్ కళ్యాణ్ యాక్షన్ పార్ట్ ఇందులో హైలెట్‌గా నిలుస్తుందని నిర్మాత ఏ.ఎం.రత్నం అంటున్నారు. కొన్ని అనివార్య కారణాల వల్ల సినిమా కాస్త ఆలస్యమైనా అభిమానులను ఎక్కడా నిరుత్సాహపరచకుండా సినిమా తెరకెక్కించామన్నారు.



## 3బిహెచ్‌కె నుంచి 'ఆగిపోను నేను' పాట ఆవిష్కరణ

సిద్ధార్థ్ హీరోగా శ్రీ గణేష్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఫ్యామిలీ ఎంటర్ టైనర్ '3 BHK'. బ్లాక్ బస్టర్ హిట్ 'మావీరన్' నిర్మాత అరుణ్ విశ్వ శాంతి టాకీస్‌పై తెలుగు తమిళ్‌లో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శరత్‌కుమార్, దేవయాని, యోగి బాబు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ టీజర్‌కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా సెకండ సింగిల్ ఆగిపోను నేను రిలీజ్ చేశారు.అమృత్ రామ్‌నాథ్ ఈ పాటను కంపోజ్ చేశారు. దేవా ఈ సాంగ్‌కు భావోద్వేగభరితమైన లిరిక్స్‌కు అందించడంతో పాటు డైనమిక్ ర్యాప్ పాడి అదరగొట్టారు.

## మహాభారతం సినిమాగా తీయాలనుకుంటున్నా

### మీడియా చిట్ చాట్‌లో ముఖేష్ కుమార్ సింగ్



మంచి విష్ణు టైటిల్ పాత్రను పోషించిన కన్నప్ప సినిమా ఈనెల 27న విడుదల అవుతోంది. ప్రభాస్, అక్షయ్ కుమార్, మోహన్ లాల్, వంటి దిగ్గజాలు నటించిన ఈ సినిమాకు బాలీవుడ్ దర్శకుడు ముఖేష్ కుమార్ సింగ్ తెరకెక్కించారు సినిమా విడుదల సందర్భంగా మీడియాతో దర్శకుడు చిట్ చాట్ నిర్వహించారు. ముఖేష్ కుమార్ సింగ్ మీడియాతో ఆసక్తికరమైన విషయాల్ని పంచుకున్నారు. 'మహాభారతం' సీరియల్ చాలా పెద్దది. అన్ని ఎపిసోడ్స్‌కి నేను దర్శకత్వం వహించలేదు. మరి కొంత మంది దర్శకులు కూడా ఉన్నారు. విష్ణు టీం నుంచి నాకు ఓ సారి కాల్ వచ్చింది. నాతో పాటు ఇంకా కొంత మంది కూడా ఆ సీరియల్‌కు డైరెక్ట్ చేశారు అని చెప్పాను. ఆ తరువాత చాలా రోజుల వరకు కాల్స్ ఏమీ రాలేదు. అనూప్ సింగ్ ఠాకూర్ ఆచారి అమెరికా యాత్ర సినిమాను చేశారు. ఆ టైంలో నా గురించి అనూప్, విష్ణుకి మధ్య చర్చ జరిగింది. అలా నన్ను మళ్లీ అప్రోచ్ అయ్యారు. విష్ణుని కలిసిన తరువాత ఓ మూడు, నాలుగు గంటలు చర్చించుకున్నాం. అప్పటి వరకు నాకు కన్నప్ప గురించి అంత పెద్దగా తెలీదు. విష్ణు ఈ కథ గురించి చెప్పిన తరువాత చాలా రీసెర్చ్ చేశాను. మళ్లీ మోహన్ బాబు మరోసారి పిలిచారు. మహాభారతం సీరియల్ గురించి నాతో గంట మాట్లాడారు. అప్పుడు ఈ ప్రాజెక్ట్ గురించి కూడా చర్చించుకున్నాం. అలా నన్ను ఈ చిత్రానికి ఫైనల్ చేశారు. నేను ఇంత వరకు బుల్లితెరపై చేసినవన్నీ హై బడ్జెట్ ప్రాజెక్టులే. 'మహా భారతం' సీరియల్‌ను రూ.200 కోట్లతో తీశాం. నాకు సినిమాలేమీ కొత్త కాదు. ఇది వరకు అంతర్జాతీయ సంస్థలతో కలిసి ఇంగ్లీష్ చిత్రాల్ని నిర్మించాను. నేను బుల్లితెరకు పని చేసినా, వెండితెరకు పని చేసినా ఒకే మైండ్ సెట్‌తో పని చేస్తాను. 'కన్నప్ప' కోసం ప్రతీ ఒక్కరూ అద్భుతంగా పని చేశారు. అందరూ ఎంతో అంకిత భావంతో సెట్స్ మీద వర్క్ చేశారు. వారి వల్లే నా పని చాలా ఈజీగా మారిపోయింది. అక్షయ్ సర్, మోహన్‌లాల్ సర్, ప్రభాస్, మోహన్ బాబు, విష్ణు, బ్రహ్మానందం ఇలా అందరితో పని చేయడం మరిచిపోలేని అనుభూతి. నిర్మాతగా ఒకలా ఉండేవారు.. నటించేటప్పుడు ఇంకోలా అనిపించేవారు. 'కన్నప్ప' మీద ఇంత వరకు వచ్చిన చిత్రాలన్నీ చూశాను. కన్నడ, తెలుగు, హిందీలో వచ్చిన చిత్రాలన్నీ చూశాను. అన్నింటినీ గమనించాను. వారిలానే నేను కూడా న్యాయం చేయాలని అనుకున్నాను. విష్ణు కన్నప్ప పాత్రకు వంద శాతం న్యాయం చేశారు. చివరి గంట అద్భుతంగా ఉంటుంది.మా ఆర్ట్ డైరెక్టర్ చాలా రీసెర్చ్ చేశారు. ఎన్నో మ్యూజియంలను సందర్శించారు. వెపన్స్, క్యాస్టూమ్స్ మీద చాలా పరిశోధనలు చేశాం. రెండో శతాబ్దం వాతావరణం తెరపైకి తీసుకు రావడానికి చాలా ప్రయత్నించాం. అందుకే న్యూజిలాండ్‌కు వెళ్లి మూవీని షూటింగ్ చేశాం. ప్రభాస్ పాత్ర ఎంతో పవర్ ఫుల్‌గా ఉంటుంది. ఇందులో ఎవరి క్యారెక్టర్ కూడా అలా వచ్చి ఇలా వెళ్లేలా ఉండదు. అన్ని పాత్రలు ప్రేక్షకులపై కచ్చితంగా ప్రభావాన్ని చూపిస్తాయి. ఎవరి ఫ్యాన్స్ కూడా ఈ మూవీని చూసి నిరాశచెందరు. ఇప్పటి వరకు చాలా మందికి ఈ మూవీని చూపించాం. అందరూ అద్భుతంగా ఉందని ప్రశంసలు కురిపించారు. కన్నప్పపై ఇది వరకు వచ్చిన చిత్రాల్లో కూడా లిబర్టీ తీసుకున్నారు. ఇందులో కూడా కొంత వరకు ఫిక్షనల్ పార్ట్ ఉంటుంది. కన్నప్ప అనేది మైథలాజి కాదు.. ఇది మన హిస్టరీ. ఓ ఘటన జరిగితే.. ఒక్కొక్కరు ఒక్కోలా చెబుతుంటారు. కన్నప్ప అనే వాడు ఉండేవాడు. కానీ ఎవ్వరికీ సరిగ్గా తెలీదు. కన్నప్ప తన కంటిని శివుడికి ఇచ్చాడు. ఇదంతా మన చరిత్ర.మహాభారతం సీరియల్ తీశాను. ఇప్పుడు సినిమాగా తీయాలని అనుకుంటున్నాను. మహాభారతం అనేది పబ్లిక్ ప్రాపర్టీ. ఎవరైనా తీసుకోవచ్చు. రాజమౌళి తీసుకోవచ్చు. అమీర్ ఖాన్ తీసుకోవచ్చు. అది పబ్లిక్ డొమైన్‌లో ఉన్న సబ్జెక్ట్ అని ముఖేష్ కుమార్ యంగ్ తెలిపారు.

## అమ్మ ఆరోగ్యం చాలా బాగుంది

నాగ బాబు

మెగాస్టార్ చిరంజీవి తల్లి అంజనాదేవి అనారోగ్యం క్షీణించిందని కొన్ని మీడియాలో కథలు వచ్చాయి. అంతే కాదు అమ్మ ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హుటాహుటిన హైదరాబాద్‌కు బయలుదేరి వచ్చారని కూడా ప్రచారం జరిగింది. అయితే మీడియాలో వచ్చిన కథనాలపై ఎంఎల్‌సి నాగబాబు స్పందించారు. అమ్మ ఆరోగ్యం చాలా బాగుందని తన సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మీడియాలో కొంత తప్పుడు సమాచారం వచ్చిందని పేర్కొన్నారు.



---

## భారత్ వైఖరి చాటాం

(మొదటి పేజీ తరువాయి)

మోకరిల్లేలా చేసిందన్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో ఉగ్రవాదులు దాడులు చేసి 26మంది పౌరులను దారుణంగా చంపిన నేపథ్యంలో భారతదేశం పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలపై ఖచ్చితమైన దాడులు జరిపిందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలైన హౌసింగ్, తాగునీరు, ఆరోగ్యభీమా రంగంతో పాటు ఇతర విభాగాలను ఉదహరిస్తూ వంచించబడిన వెనకబడిన తరగతుల సాధికరత కోసం కృషిచేశామని ప్రధానమంత్రి నరేంద్రమోదీ నొక్కిచెప్పారు. దేశంలో మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత 11ఏళ్ల కాలంలో గతంలో కంటే ఎక్కువగా ఐఐటిలను, ఐఐఎంలను, ఎఐఐఎంఎస్‌లను ప్రారంభించడంతో భారతదేశం ఒక కొత్తమార్గంలో పయనిస్తూ ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించిందని చెప్పారు. సమాజంలోని వివక్షతలకు విముక్తి కల్పించేందుకు నారాయణ గురు చేసిన కృషి అనితరసాధ్యమని ప్రధానమంత్రి చెప్పారు. సంతృప్తవిధానాన్ని అవలంభిస్తూ దేశంలో వివక్షను తుదముట్టించేందుకు అందుబాటులో ఉన్న ప్రతీ అవకాశాన్ని వినియోగిస్తున్నామని మోదీ చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి గత దశాబ్దం వరకూ దేశంలోని మిలియన్ల సంఖ్యలో పౌరులు తీవ్ర కష్టతరమైన పరిస్థితులలోకి నెట్టివేయబడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కోట్లాది కుటుంబాలకు ఉండేందుకు నిలువనీడలేని పరిస్థితి ఉండేదని, లక్షలాది గ్రామాలకు తాగునీటి లభ్యత కరువైందని, మైనర్లు జబ్బుపడ్డా వారికి చికిత్స అందించే సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ కరువైందని, కనీసం మైనర్లు మంచానపడ్డా వారికి చికిత్స అందించలేని దారుణ పరిస్థితిలో ప్రజల జీవనం సాగిందని మోదీ చెప్పారు. పేద ప్రజలు, మహిళలు కనీస మానవ గౌరవాలను కోల్పోతున్నారని మోదీ చెప్పారు. నారాయణగురు ఆదర్శాలు అందరికీ గొప్ప నిధి అని ప్రధానమంత్రి ప్రశంసించారు. స్వాతంత్ర్య ఉద్యమానికి మూలపురుషుడు అయిన మహాత్మాగాంధీతో నారాయణగురు జరిపిన సంభాషణ భారతదేశ స్వాతంత్ర్యానికి కొత్త దిశానిర్దేశం చేసిన ఒక చరిత్రాత్మక ఘటన అని, దానిని నిర్దిష్ట లక్ష్యాలుగా రూపొందించుకునేందుకు మార్గం సుగమం చేసిందని చెప్పారు. ఈ సందర్భంగా నారాయణగురు స్థాపించిన శివగిరి మఠంతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. శివగిరి మఠం సాధువులంటే తనకెంతో అభిమానం అని వివరించారు.

## చొరవ చూపండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రారంభమయ్యాయి. పారిశ్రామికవేత్తలకు మాప్రభుత్వంపై ఉన్న నమ్మకాని కి ఇది నిదర్శనం. పరిశ్రమలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. ప్రతిభ గల మానవ వనరులకు కొరత లేదు. మరింత వేగంగా.. సరళంగా.. పారదర్శకంగా అనుమతులిచ్చేందుకు టీజీ – ఐపాస్‌ను ఏఐతో అనుసంధానం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం' అని చెప్పారు. 'ఏరో స్పేస్, ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ లాంటి రంగాల్లో పలు ఫ్రెంచ్ కంపెనీలు ఇప్పటికే తెలంగాణలో పెట్టుబడులు పెట్టాయి. సనోఫి, మోనిన్, సఫ్రాన్, క్యాప్ జెమినీ, డసాల్ట్, టెలీ పర్ ఫార్మెన్స్, ఓపెల్లా హెల్త్ కేర్ లాంటి దిగ్గజ సంస్థలు తమ కార్యకలాపాలను ఇక్క డ నిర్వహిస్తున్నాయి. ఎమర్జింగ్ టె క్నాలజీస్, క్లీన్ ఎనర్జీ, గ్రీన్ మొబిలిటీ, డిజిటల్ గవర్నెన్స్, అగ్రో ఇన్నోవేషన్, స్మార్ట్ హెల్త్ సిస్టమ్స్, ఫ్యూచర్ రెడీ ఎడ్యుకేషన్, సస్టైనబుల్ మ్యానుఫాక్చరింగ్ తదితర రంగాల్లో మంచి అవకాశాలున్నాయి. దీన్ని ఫ్రాన్స్ పా రిశ్రామికవేత్తలు సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపండి' అని ఇఫ్కీ ప్రతినిధులను కోరారు. 'తెలంగాణ – ఫ్రెంచ్' మధ్య ద్వైపాక్షిక సహకారా న్ని మరింత మెరుగుపర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

కార్యక్రమంలో ఇఫ్కీ నుంచి యోహాన్ సామ్యూల్, ప్రియాంక్ ప్రకాష్, నకుల్ దల్వాలా, మోనిన్, ఓపెల్లా హెల్త్ కేర్, సఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ సర్వీసెస్ ఇండియా, సనోఫీ ఇండియా, టెలిపర్ ఫార్మెన్స్, వార్ ఎలక్ట్రోకెమ్ ప్రైవేట్ లిమిటెడ్ జీగ్లర్ ఏరోస్పేస్ తదితర పలు ఫ్రెంచ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రైలు చార్జి

(మొదటి పేజీ తరువాయి)

ఆధార్ ప్రామాణీకరణ తప్పనిసరి కానుంది.

### స్వల్పంగా పెరగనున్న ప్రయాణ ఛార్జీలు

వివరాల్లోకి వెళితే, నాన్‌ఏసీ మెయిల్, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణ ఛార్జీ కిలోమీటర్‌కు ఒక పైసా చొప్పున పెరగనుంది. ఏసీ తరగతుల్లో ప్రయాణానికి కిలోమీటర్‌కు రెండు పైసల చొప్పున ఛార్జీలు పెంచనున్నారు. అయితే, సబర్బన్ టికెట్ల ధరల్లో ఎలాంటి మార్పు ఉండదని రైల్వే శాఖ స్పష్టం చేసింది. అలాగే, 500 కిలోమీటర్ల వరకు ప్రయాణించే సెకండ క్లాస్ టికెట్ల ధరల్లో కూడా ఎటువంటి పెంపు ఉండదు. 500 కిలోమీటర్లకు మించిన దూరాలకు మాత్రం సెకెండ్ క్లాస్ ప్రయాణంలో కిలోమీటర్‌కు అర పైసా చొప్పున ఛార్జీ పెరగనుంది. నెలవారీ సీజన్ టికెట్ల (ఎంఎస్‌టీ) ధరల్లో కూడా ఎటువంటి పెంపు లేదని రైల్వే శాఖ తెలిపింది. ఈ కొత్త ఛార్జీల విధానం జూలై 1 నుంచి అమలులోకి వస్తుంది.

## సాంకేతిక పరిజ్ఞానం అవశ్యం

నకిలీ వార్తలతో జరభద్రం

పాత్రికేయులకు పత్రికా రంగ ప్రముఖుల సూచనలు

ఒంగోలులో ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర మహాసభలు ప్రారంభం




**ఒంగోలు :** నిత్యం మారుతున్న సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలని, నకిలీ వార్తలతో జాగ్రత్తగా ఉండాలని పాత్రికేయులకు పత్రికారంగ ప్రముఖులు సూచించారు. ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఎపియుడబ్ల్యుజె) 36వ రాష్ట్ర మహాసభలు మంగళవారం ఒంగోలులో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కృత్రిమ మేధ (ఎఐ) ఆధారిత సామాజిక మాధ్యమాలు వాస్తవాల నిర్ధారణ అనే అంశంపై ఎన్టీఆర్ కళా పరిషత్‌లో ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అధ్యక్షత సెమినార్ నిర్వహించారు. ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజెయు) అధ్యక్షుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సిఆర్ మీడియా అకాడమీ చైర్మన్ అలపాటి సురేష్ కుమార్ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల ద్వారా నకిలీ వార్తల వ్యాప్తి చెందుతున్నదని, దీనిపై ప్రతి పాత్రికేయుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. ఎఐ టెక్నాలజీ అన్ని రంగాలలో ప్రవేశిస్తున్నదని, దీనిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. రాబోయే రోజుల్లో ఎఐ వినియోగంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉండేలా కషిచేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. ఎఐ సాంకేతిక గురించి, పత్రికా రంగంలో వినయోగం, ఉపయోగాలపై ఎం.నరసింహ స్వామి మాట్లాడారు. ఒక ఫోటో, వీడియో లేదా వార్త నిజమైనదా కాదా ఎలా తెలుసుకోవచ్చో కూలంకుషంగా వివరించారు. ఎఐతో సమయం ఆదా అవుతుందన్నారు. వార్తల సేకరణ, పంపిణీలోను ఈ సాంకేతికత ఉపయోగపడుతుందని చెప్పారు. విశాలాంధ్ర ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కె.అజయ్ బాబు మాట్లాడుతూ.. ప్రపంచం మొత్తం మీద సుమారు 22 కోట్ల యూట్యూబ్ ఛానల్స్ ఉండగా మన దేశంలో వీటి సంఖ్య ఎంతో ఎక్కువగా ఉందన్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్ వంటి సామాజిక మాధ్యమాలలో ఫేక్ న్యూస్ విశంఖలంగా వస్తున్నాయని, పాత్రికేయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ.. ఎపియుడబ్ల్యుజె యూనియన్ రాష్ట్ర మహాసభలు ఒంగోలులో నిర్వహించటం ఆనందంగా ఉందన్నారు. కృత్రిమ మేధపై సెమినార్ పాత్రికేయులకు ఎంతో ఉపయోగమన్నారు. ఐజెయు ప్రధాన కార్యదర్శి బల్వీందర్ సింగ్, స్టీరింగ్ కమిటీ సభ్యుడు ఎస్‌వీ సిన్హా, జాతీయ కార్యదర్శి డి.సోమసుందర్, ఏపీయుడబ్ల్యుజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చందు జనార్దన్ ప్రసంగించారు. ఎపియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎ.సురేష్, ప్రకాశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌వీ రమణ, దాసరి కనకయ్య, ఎపి ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్రావు, ఇఫ్తేకార్ బాషా తదితరులు కార్యక్రమం నిర్వహణలో సహకరించారు. సెమినార్‌లో వివిధ జిల్లాల నుంచి 250 మంది పాత్రికేయులు పాల్గొన్నారు. ఒంగోలు దక్షిణ బైపాస్‌లోని విష్ణుప్రియ కన్వెన్షన్‌లో యూనియన్ మహాసభ బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి జరుగుతుందని యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

## ఘనంగా ఉజ్జయిని మహాకాళి జాతర ఏర్పాట్లు

బోనాలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

బోనాల పండుగ కోసం అధికారులు సమన్వయంతో పని చేయాలి

హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉజ్జయిని మహాకాళి అమ్మవారి ఆషాడం బోనాలు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహకాళి దేవస్థానంలో మంగళవారం ఆషాడం జాతర బోనాలు ఉత్సవాలపై సమావేశానికి జిల్లా కలెక్టర్ హరి చందన దాసరి అధ్యక్షత వహించగా స్థానిక శాసనసభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్, దేవాదాయ శాఖ కమిషనర్ ఎస్. వెంకట్రావు, అడిషనల్ పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, ఆలయ కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ చరిత్రాత్మకమైన ఉజ్జయిని మహాకాళి అమ్మవారి ఆషాడ జాతర బోనాల ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలన్నారు. అందుకు తగ్గట్లుగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కలిసి పని చేస్తూ, బోనాల జాతరను విజయవంతం చేయాలని సూచించారు. ఉజ్జయిని మహాకాళి దేవస్థానం సికింద్రాబాద్‌లో జూలై 13న అమ్మవారికి బోనాలు సమర్పణ, 14న రంగం ( భవిష్యవాణి), అమ్మవారిని అంబారిపై ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తారని తెలిపారు. రెండు రోజులలో భక్తులు, ప్రజలు లక్షల్లో తరలి వస్తారని, ఆ దిశగా ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేపట్టాలన్నారు. ముఖ్యంగా 13వ తేదీన దేవాలయంలో భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించాలని దేవాలయ, పోలీస్ అధికారులను మంత్రి ఆదేశించారు.

### గత జాతర అనుభవాల నేపథ్యంలో అధికారులు సేవా భావంతో పనిచేయాలి..

గత జాతర అనుభవాలను దృష్టిలో ఉంచుకొని అధికారులందరూ సేవా భావం, బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి సూచించారు. రెవెన్యూ, దేవాదాయ, పోలీస్, జిహెచ్ఎంసి అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. 14వ తేదీన అంబారీ ఊరేగింపులో భక్తులు, ప్రజలకు తొక్కిసలాటలు కాకుండా పోలీస్ అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ బోనాల ఉత్సవాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఇప్పటికే నిధులు మంజూరు చేసిందన్నారు. గోల్కొండ బోనాలు, బల్కంపేట ఎల్లమ్మ బోనాలు, ఉజ్జయిని మహాకాళి బోనాలు, లాల్ దర్వాజా బోనాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. బోనాలు నిర్వహించే దేవాలయాల్లో ఎక్కడ కూడా విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్రంతో పాటు దేశం నలుమూలల నుండి తెలంగాణ బోనాల ఉత్సవాలకు భక్తులు తరలి వస్తారని, నిరంతర విద్యుత్, తాగునీరు, వాహనాల పార్కింగ్, వాహనాల మళ్లింపు, ట్రాఫిక్ నియంత్రణ, భారీ కేడింగ్ ఏర్పాట్లు, నిరంతరం నీటి నిల్వాలు పరిశీలన, పారిశుద్ధ్య పనులు, మొబైల్ టాయిలెట్స్, సిసి కెమెరాల నిర్వహణ ఏర్పాట్లు పక్కాగా చేయాలన్నారు.

### భక్తుల సంఖ్యకు తగ్గట్లు ఏర్పాటు చేయాలి : తలసాని శ్రీనివాస్ యాదవ్

స్థానిక శాసనసభ్యులు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ఉజ్జయిని మహంకాళి బోనాలు అంటేనే తెలంగాణకు ఒక ప్రత్యేకమన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో సమిష్టిగా పనిచేయాలన్నారు. వివిధ శాఖల అధికారులు, పోలీసు అధికారుల సర్వీసును ఈ జాతరలో ఉపయోగించుకోవాలని సూచించారు. ముందుగా మంత్రితో పాటు దేవాదాయ కమిషనర్, జిల్లా కలెక్టర్ మహాకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ఎస్. కామేశ్వర్, పోలీస్ జాయింట్ కమిషనర్ రామకృష్ణా రావు, దేవాలయం ఈ.ఈ మనోహర్ రెడ్డి, జోనల్ కమిషనర్ ఎన్. రవి కిరణ్, ఎస్.సి విద్యుత్ శాఖ చక్రపాణి, డిఎం అండ్ హెచ్ఓ డాక్టర్ వెంకటి, జిహెచ్ఎంసి, హెచ్ఎండిఏ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com